
‘ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 303

బుధవారం 24-1-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రవిశాస్త్రికి ‘లైఫ్‌టైమ్’ అవార్డు

నాలుగేళ్ల వార్షిక అవార్డులు ప్రదానం చేసిన బీసీసీఐ -14లో



8.50 లక్షల కోట్ల సంపద ఆవిరి

సెన్సెక్స్ 1,053 పాయింట్లు క్రాష్. నిఫ్టీ నష్టం 330 పాయింట్లు -15లో



నేటి నుంచి జేఈఈ మెయిన్స్

జేఈఈ మెయిన్స్–2024 తొలి విడత పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 12.3 లక్షల మంది విద్యార్థులు హాజరు కానున్నారు.


- వివరాలు 5లో



అడ్డుకుని.. ప్రచారం ఇచ్చారు!

అస్సాంలో బీజేపీ ప్రభుత్వం తమ యాత్రకు అవరోధాలు కల్పిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు.

- వివరాలు 6లో



వాటి నుంచి విముక్తి కల్పించాలి

దేశాభివృద్ధికి వారసత్వ రాజకీయాలు, ఆశ్రిత పక్షపాతం, అవినీతి అడ్డంకులుగా మారాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు.

- వివరాలు 6లో




అమ్మాయి ఆరోగ్యానికి ఏడు పరీక్షలు

ఆడపిల్లలు ఆరోగ్యంగా పెరగాలంటే తల్లిదండ్రులు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించాలి. ‘గర్ల్ చైల్డ్ డే’ సందర్భంగా ప్రత్యేక కథనం

- వివరాలు 13లో

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న



బిహార్‌కు రెండు సార్లు ముఖ్యమంత్రిగా సేవలు

- జననాయకుడిగా చిరపరిచితుడు
- బిహార్‌లో ఓబీసీ రాజకీయాలకు నాందిపలికిన ఠాకూర్
- దేశ అత్యున్నత పురస్కారం పొందిన 49వ వ్యక్తి
- నాయకత్వ దార్శనికతతో చెరగని ముద్ర వేశారు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: స్వాతంత్య్ర సమరయోధుడు, బిహార్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత కర్పూరి ఠాకూర్‌ను కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం ‘భారతరత్న’తో గౌరవించింది. నేడు ఆయన వందో జయంతి. ఠాకూర్ శత జయంతి ఉత్సవాల ప్రారంభానికి ఒకరోజు ముందే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం ఈ ప్రకటన వెలువరించడం విశేషం. జననాయకుడిగా అందరికీ చిరపరిచితుడైన ఠాకూర్ బిహార్‌లో ఓబీసీ రాజకీయాలకు నాంది పలికారు. భారత రత్న అందుకోబోతున్న వారిలో ఠాకూర్ 49వ వ్యక్తి. చివరిసారిగా 2019లో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్నను ప్రదానం చేసింది. కాగా బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న తొలి కాంగ్రెసేతర సోషలిస్ట్ నేతగా ఠాకూర్ చరిత్ర సృష్టించారు. బిహార్‌కు ఆయన రెండుసార్లు సీఎంగా సేవలందించారు. తొలిసారిగా సీఎంగా 1970 డిసెంబర్ నుంచి 1971 జూన్ వరకు పనిచేశారు. 1977 డిసెంబర్ నుంచి 1979 ఏప్రిల్ వరకు రెండోసారి ముఖ్యమంత్రిగా ఉన్నారు. గతంలో డిప్యూటీ సీఎంగానూ చేశారు. ‘ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయానికి ప్రతిరూపం ఠాకూర్. అణగారిన వర్గాల తరఫున పోరాడి వారిలో మార్పు రావడానికి ఎంతగానో కృషిచేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని జీవన విధానంగా మార్చుకున్న మహానుభావుడు. ఈ పురస్కారం ఆయన చేసిన కృషికి మాత్రమే కాదు భావితరాలకు స్ఫూర్తిగా, గొప్ప ప్రేరణగా నిలుస్తుంది’ అని కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా ఆయన మరణించిన 36 ఏళ్ల తరువాత ఈ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించడం విశేషం.

విద్యార్థి దశలోనే స్వాతంత్య్రపోరాటంలోకి..

ఠాకూర్ బిహార్‌లోని సమస్తీపూర్ జిల్లాలో కర్పూరిగ్రామ్‌లో 1924 జనవరి 24వ తేదీన

మిగతా 2వ పేజీలో ▶

రూ.40,000 కోట్లు!



2024-25 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయానికి బడ్జెట్ ప్రతిపాదనలు

- ప్రభుత్వానికి పంపించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ
- 2023–24లో రూ.26,831 కోట్లు కేటాయించిన సర్కార్
- ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వ తొలి బడ్జెట్లో రూ.40 వేల కోట్లు కోరుతూ ప్రతిపాదనలు
- రూ.2 లక్షల వరకు రుణ మాఫీకి మొత్తం రూ.36 వేల కోట్లు కావాలని అంచనా
- ఈ ఏడాది రూ.7,200 కోట్లు చెల్లించేలా ప్రతిపాదనలు
- బ్యాంకులకు ప్రతి నెలా రూ.600 కోట్ల చొప్పున ఐదేళ్ల పాటు చెల్లించే అంశాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వం... రైతు భరోసాకు మరో రూ.22,500 కోట్లు కావాలి
- వ్యవసాయ యాంత్రీకరణ, రైతు బీమా, వర్సిటీలకు నిధుల కోసం ప్రతిపాదనలు

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ రంగానికి 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో రూ.40 వేల కోట్లు కేటాయించాలని వ్యవసాయ శాఖ కోరింది. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. బడ్జెట్‌పై ప్రభుత్వం వివిధ శాఖల నుంచి ప్రతిపాదనలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున కసరత్తు చేసిన వ్యవసాయ శాఖ గతం కంటే అధికంగా నిధులు కేటాయించాలని కోరడం విశేషం. 2022–23 బడ్జెట్లో ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రూ.24,254 కోట్లు కేటాయించగా, 2023–24లో రూ.26,831 కోట్లు కేటాయించింది. కాగా ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వ మొదటి బడ్జెట్లో ఏకంగా రూ.40 వేల కోట్లు కేటాయించాలంటూ వ్యవసాయ శాఖ ప్రతిపాదించడం.. రైతుల పట్ల సర్కారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందనడానికి నిదర్శనమని అధికార వర్గాలు అంటున్నాయి.

రుణమాఫీ, రైతు భరోసాకే అధికం

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. అలాగే రైతుభరోసా పేరుతో అన్నదాతలకు ఏడాదికి ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. రెండు పథకాలను ఈ ఏడాది నుంచే అమలు చేయనుంది. దీనితో వీటికి అధిక మొత్తంలో నిధులు అవసరం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 36.68 లక్షల మంది రైతులకు రూ.లక్ష వరకు రుణ మాఫీకి మొత్తం రూ.19,198.38 కోట్లు

మిగతా 2వ పేజీలో ▶

భక్తులతో కిటకిటలాడుతున్న అయోధ్య రామ మందిర ప్రాంగణం



పోటెత్తిన భక్తజనం

అయోధ్య బాలరాముడి దర్శనానికి తెల్లవారుజాము నుంచే క్యూలైన్లు

అయోధ్య భక్తజన సంద్రమవుతోంది. అంగరంగ వైభవంగా కొలువుదీరిన బాలరాముణ్ని దర్శించుకునేందుకు దేశ నలుమూలల నుంచీ భక్తులు సరయూ తీరానికి పోటెత్తుతున్నారు.

అయోధ్య రామయ్య ఇకపై.. బాలక్ రామ్

గణతంత్ర వేడుకల్లో అయోధ్య రాముడు శకటాన్ని ప్రదర్శించనున్న ఉత్తరప్రదేశ్ సర్కార్

ఆ దివ్య దరహాసం వెనక.. బాలరాముడి రూపకల్పనకు శిల్పి అరుణ్ తపస్సు

- వివరాలు 6లో

బీసీల ఓట్లకు ‘కులగణన’ అస్త్రం

లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్త హామీ ఇచ్చే దిశగా కాంగ్రెస్

- ఇదే అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చనున్న ఏఐసీసీ
- గాంధీభవన్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డిలతో భేటీ అయిన ఏఐసీసీ నేత ప్రవీణ్ చక్రవర్తి
- సమావేశానికి హాజరైన టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యులు



భేటీలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో కోమటిరెడ్డి, దీపాదాస్ మున్షీ, మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా వెనుకబడిన వర్గాల ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ ‘కులగణన’అస్త్రాన్ని ప్రయోగించనుంది. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడంలో కులగణన కీలకపాత్ర పోషిస్తుంది. ఈ వర్గాల ఓటర్లను ఆకర్షించడమే ధ్యేయంగా మేనిఫెస్టో రూపకల్పనకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. కులగణనకు అనుకూలంగా ఇప్పటికే రాహుల్‌గాంధీ పలు సందర్భాల్లో ప్రకటనలు చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఈ గణన ఇప్పటికే ప్రారంభించడం, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ హామీని మేనిఫెస్టోలో చేర్చిన విషయం విదితమే. దీంతో వచ్చే లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశాన్ని ప్రధానంగా చేర్చనున్నారన్న చర్చ జరుగుతోంది. తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని చెప్పడం ద్వారా బీసీవర్గాల ఓట్లు రాబట్టుకునే అంశంపై మంగళవారం

మిగతా 2వ పేజీలో ▶

టీడీపీలో ధిక్కార స్వరం

తమ సంగతి తేల్చాలని ఎక్కడికక్కడ నేతల పట్టు..

- క్షేత్ర స్థాయిలో దిగజారిన పార్టీ పరిస్థితి
- డబ్బున్న వారికే టికెట్.. పార్టీని వీడేందుకు పలువురు సిద్ధం
- గంటాను పట్టించుకోని చంద్రబాబు... బండారు సత్యనారాయణమూర్తి సీటుపై అయోమయం... తడాఖా చూపిస్తామంటున్న గాజువాక, అనకాపల్లి నేతలు పల్లా, పీలా
- తీవ్ర నిరాశలో అయ్యన్న.. పార్టీ కార్యక్రమాలకూ దూరం
- ఉమ్మడి గోదావరి జిల్లాల నేతల్లో జనసేన చిచ్చు.. మోసపోయానని మండిపడుతున్న దేవినేని ఉమ... సత్తెనపల్లిలో భగ్గుమంటున్న కోడెల శివరామ్
- చిలకలూరిపేటలో పుల్లారావు పరిస్థితి అగమ్యగోచరం
- ధర్మవరం, రాప్తాడులో పరిటాల శ్రీరామ్, సునీత అసంతృప్తి

- వివరాలు 12లో

న్యూస్‌రీల్

ఆ షాపులపై రంగు పడింది



పేటెంట్ హక్కు కలిగి ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన పోచంపల్లి ఇక్కత్‌ను నిబంధనలకు విరుద్ధంగా ప్రింట్‌చేసి విక్రయిస్తున్న పలు వస్త్ర దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. వస్త్రాలను సీజ్ చేసి షాపు యజమానులకు నోటీసులిచ్చారు.

- వివరాలు 7లో

జీరో టికెట్ @ 10 కోట్లు



45 రోజుల్లోనే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతిని పది కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ పథకం ప్రారంభమైన విషయం తెలిసిందే. సోమవారానికి జారీ అయిన జీరో టికెట్లు 10 కోట్లు దాటాయి.

- వివరాలు 16లో

అయోధ్య ప్రసాదం.. వీఐపీ దర్శనం



అయోధ్య రామమందిరం పేరును సైబర్ నేరగాళ్లు కొత్త మోసాలకు ఉపయోగించుకుంటున్నారు. అయోధ్య ప్రసాదం, విరాళాల సేకరణ, వీఐపీ దర్శనం టికెట్ల పేరిట వచ్చే సందేశాలకు స్పందించవద్దని ఎస్‌సీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు.

- వివరాలు 8లో

హైదరాబాద్‌లో కాస్మొటిక్ మాన్యుఫాక్చరింగ్ హబ్



దక్షిణ కొరియాకు చెందిన ప్రఖ్యాత కాస్మొటిక్ తయారీ సంస్థ డూసన్ హైదరాబాద్‌లో కాస్మొటిక్ మాన్యుఫాక్చరింగ్ హబ్ ఏర్పాటుకు ముందుకొచ్చినట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.

- వివరాలు 5లో

ఇదండీ సంగతి



గాడి తప్పడానికి చాన్సేలేద్సార్! ఎందుకంటే గతంలో ఎప్పుడూ గాడిలోనే లేదు!

అడవే చెంచులకు అమ్మ

కారం తొక్కు.. చింత పులుసే నిత్యాహారం... సీజన్‌లోనే పోషకాహారం

విద్య, వైద్యం, గిరిపోషణ, సౌకర్యాలు నీటిమీద రాతలే



మల్లాపూర్ పెంటలోని చెంచు నివాసం

ఐటీడీఏ మన్ననూర్ పరిధిలో చెంచుల జనాభా

జిల్లా	గ్రామాలు	కుటుంబాలు	జనాభా
నాగర్‌కర్నూల్	88	2,595	8,784
మహబూబ్‌నగర్	20	517	1,710
వికారాబాద్	22	740	2,554
రంగారెడ్డి	11	164	533
నల్లగొండ	9	243	790
మొత్తం	150	4,259	14,371

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: నల్లమల అటవీ ప్రాంతంలోనే నివసించే చెంచుల జీవనశైలి...బాహ్య ప్రపంచానికి కొంచెం వైవిధ్యంగానే ఉంటుంది. అంతరించిపోతున్న జాతుల్లో చెంచులు కూడా ఉన్నారు. అయినా వారు ఇప్పటికీ సరైన ఆహారానికి నోచుకోవడం లేదు. కారం మెతుకులు, చింత పులుసు, ఎప్పుడోసారి పప్పు ఇదే వారి రోజువారీ మెనూ. రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా, వారి జీవన ప్రమాణస్థాయిల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. పౌష్టికాహార లోపం, ఉపాధి సన్నగిల్లడం, సరైన వైద్యం అందకపోవడంతో సగటు చెంచుల ఆయుర్దాయం 50ఏళ్లకే పరిమితమవుతోందని పలు స్వచ్ఛంద సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ఉన్న 120 చెంచు పెంటల్లో కలిపి చెంచుల జనాభా పదివేల లోపే. వీరి కుటుంబాల్లోని పిల్లలు కనీసం బడిచదువుకు కూడా నోచుకోవడం లేదు.

నిత్యం ఒక్కటే..: చెంచు చిన్నారుల నుంచి పెద్దల వరకు పోషకాహారం కరువవుతోంది. లోతట్టు అటవీ ప్రాంతంలోని అప్పాపూర్ పరిసర ప్రాంతాల్లోని చెంచులు కూరగాయలు కావాలన్నా 30 కిలోమీటర్ల దూరంలోని మన్ననూర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి. పదిహేను, నెల రోజులకు ఒకసారి

మిగతా 8వ పేజీలో ▶

యూరియా సరఫరాలో కోత

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయం
- దీని వాడకంతో భూసారం తగ్గుతోందని, ప్రజల ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతోందని భావిస్తున్న కేంద్రం
- రైతులు వినియోగం తగ్గించేలా చూడాలని రాష్ట్రాలకు ఆదేశం
- యూరియా ఎంత తగ్గిస్తే అంత ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటన
- ‘సేంద్రియ’ వాడకం పెంచాలని సూచన

7లో

26 నుంచి 28 వరకు హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్

- ఏటా జనవరిలో నిర్వహించే హైదరాబాద్ సాహిత్య ఉత్సవాలు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. హైటెక్‌సిటీలోని సత్వ నాలెడ్జ్ సెంటర్ వేదిక కానుంది. -16లో

క్లుప్తంగా...

యువతకు ప్రతినిధిగా ఉంటా

● ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



టైపు రైటింగ్ అసోసియేషన్ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

లాలాపేట: రాష్ట్రంలోని 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వరకు ఉన్న యువతకు తాను ప్రతినిధిగా ఉంటానని నూతనంగా ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బల్మూరి వెంకట్ నర్సింగరావు వెల్లడించారు. లాలాపేటలో తెలంగాణ టైపిస్టు నిరుద్యోగుల సంఘం, తెలంగాణ టైపు రైటింగ్, షార్ట్ హ్యాండ్ కంప్యూటర్ ఇన్స్టిట్యూట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వెంకట్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కార్యాలయం ఏర్పాటు చేసి ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలను తెలుసుకుంటాననీ, దరఖాస్తులు స్వీకరిస్తానని తెలిపారు. ఆ దరఖాస్తులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డి వద్దకైనా తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. టైపు రైటింగ్ ఇన్స్టిట్యూట్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను, ఖాళీగా ఉన్న స్టైనో, టైపిస్టు ఉద్యోగాల భర్తీ తదితర సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.

నామినేటెడ్ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యమివ్వాలి

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు



సాక్షి, హైదరాబాద్: నామినేటెడ్ పదవుల్లో మహిళా నాయకులకు ప్రాధాన్యమివ్వాలని, కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన మహిళలను గుర్తించి వారికి పదవులివ్వాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతామని ఆమె చెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో సునీతారావు అధ్యక్షతన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆలిండియా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి హసీనా, ఎమ్మెల్సీలు మహేశ్ కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం మహిళా నేతలందరూ ప్రతి ఓటరును కలిసి మాట్లాడాలని కోరారు. త్వరలోనే జిల్లా నుంచి వార్డుల వరకు అన్ని స్థాయిల్లో మహిళా కాంగ్రెస్ కమిటీలను నియమించాలన్నారు. సమావేశంలో భాగంగా మహిళా కాంగ్రెస్ నేతల బయోడేటాలను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అందజేశారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ నేతలు నీలం పద్మ, సుజాత, పగడాల మంజుల, సదాలక్ష్మి, దుర్గారాణి, గోపగాని మాధవి, ఉషశ్రీ, పాక జ్ఞానేశ్వరి, జరీన్, రాజేశ్వరి, నాగ శివమణి, వసంత తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం బీజేపీ దిగజారుడు రాజకీయాలు: వీహెచ్



సాక్షి, హైదరాబాద్: ఓట్ల కోసం బీజేపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని, అందుకే ఎన్నికల కోసం రాముడిని కూడా ఆయుధంగా వాడుకునేందుకు ప్రయత్నిస్తోందని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు వ్యాఖ్యానించారు. ఓట్ల కోసమే బీజేపీ మత రాజకీయం చేస్తోందని, రామునిపై భక్తి అందరికీ ఉంటుందన్న విషయాన్ని ఆ పార్టీ గ్రహించాలన్నారు. అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం కోసం భద్రాచలం దేవాలయానికి ఎందుకు ఆహ్వానం పంపలేదని ప్రశ్నించారు. మోదీ రాముడు, రాహుల్ రావణుడని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. రానున్న ఎన్నికల్లో అసోంలో బీజేపీ తుడిచి పెట్టుకుపోతుందని వ్యాఖ్యానించారు. వెంటనే రాహుల్‌కు హిమంత క్షమాపణలు చెప్పాలని వీహెచ్ డిమాండ్ చేశారు.

డిప్యూటీ సీఎంతో ప్రవాస టిబెట్ ఎంపీల భేటీ

సాక్షి, హైదరాబాద్: భారత్‌లో ప్రవాసంలో ఉన్న టిబెట్ పార్లమెంట్ సభ్యులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సచివాలయంలో సెరింగ్ యాంగ్‌చెన్ నాయకత్వంలోని ఎంపీల బృందం కలుసుకుంది. ప్రస్తుతం టిబెట్‌లో నెలకొన్న పరిస్థితుల గురించి ఈ సందర్భంగా వారు వివరించారు. భారత్-టిబెట్‌ల మధ్య దీర్ఘకాలికంగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలను గుర్తుచేసుకున్నారు. టిబెట్ పక్షాన నిలబడినందుకు ప్రభుత్వానికి, ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రవాసంలో ఉన్న టిబెట్ పార్లమెంట్ స్పీకర్ ఖేన్పో సోనమ్ టెన్ఫెల్, తదితరులు ఈ ప్రతినిధి బృందంలో ఉన్నారు.

టెంపుల్, ఎకో టూరిజాలతో సర్క్యూట్లు

● అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖలకు డిప్యూటీ సీఎం భట్టి సూచన
● నాగోబా, మేడారం జాతరలకు దేశ, విదేశీ పర్యాటకులను ఆహ్వానించాలి
● బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయా శాఖలతో సమీక్ష



సమీక్షలో మంత్రి కొండా సురేఖ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో టెంపుల్ టూరిజంతో ఎకో టూరిజాన్ని కలిపి టూరిస్ట్ సర్క్యూట్లను ఏర్పాటు చేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖలకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతోపాటు దేవాలయ ఖాళీ భూముల్లో ఆలయ సందర్శకుల సౌకర్యార్థం కాటేజీలు నిర్మించేలా చర్యలు చేపట్టాలన్నారు. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన దేవాదాయ, పర్యావరణ, అటవీ శాఖల బడ్జెట్ అంచనాలపై సమీక్ష జరిగింది.


గిరిజనుల లబ్ధికి ఔషధ మొక్కల తోటల పెంపకం చేపట్టండి..

ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ఎన్నో ప్రముఖ ఆలయాలు, ప్రార్థనాలయాలున్న తెలంగాణలో టెంపుల్ టూరిజం అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. నాగోబా, మేడారం లాంటి గిరిజన జాతరలకు దేశ, విదేశీ పర్యాటకులను ఆహ్వానించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆయన సూచించారు. అటవీ సంపద, వన్య ప్రాణుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు ఏజెన్సీ, అటవీ భూముల్లో గిరిజనులకు ఆర్థికపరమైన మేలు జరిగేలా ఆయుర్వేద సంబంధిత ఔషధ మొక్కల తోటలను పెంచాలన్నారు. ఆయుష్ శాఖ, ఆయుర్వేద మందుల కంపెనీలతో ఈ ప్లాంటేషన్లకు సంబంధించి మార్కెటింగ్‌ను అనుసంధానించాలని పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో సఫారీ, ఎకో టూరిజానికి హైదరాబాద్‌వాసుల్లో ఆదరణ ఉందని, ఈ విధమైన పర్యాటకాభివృద్ధి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని భట్టి చెప్పారు. అటవీ ప్రాంతాల్లో వివిధ అవసరాలకు సోలార్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేయాలన్నారు. దేవాదాయ, అటవీ శాఖలకు సంబంధించి ప్రతిపాదిత బడ్జెట్ నిధులను ఉదారంగా కేటాయించాలని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, ఎండోమెంట్స్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, పర్యావరణ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, దేవాదాయ కమిషనర్ అనీల్ కుమార్, పీసీసీఎఫ్ డోబ్రియల్ పాల్గొన్నారు.

త్వరలోనే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి జైలుకెళ్లడం ఖాయం

● లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదు: మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: త్వరలోనే గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీ నెరవేరబోతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. హామీల అమలుపై సమీక్షలు జరిపి వంద రోజుల్లో అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. మంగళవారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని కేసీఆర్ సర్కారు గుల్ల చేసిందని, అందుకే హామీల అమలులో కొంత జాప్యం జరుగుతోందని చెప్పారు. ఇక, కరెంటు బిల్లులు కోమటిరెడ్డి ఇంటికి పంపాలన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి ఫైర్ అయ్యారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాల్లో జగదీశ్‌రెడ్డి పాత్ర కూడా ఉందని, ఆయన జైలుకెళ్లడం ఖాయమని, ఆయనతోపాటు కేటీఆర్, కవితలకూ జైలు తప్పదన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వకపోతే కరెంటు బిల్లులు తమకు పంపాలని బీఆర్‌ఎస్ ప్రజలను రెచ్చగొడుతోందని, రూ.3,016 నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, తాము నిరుద్యోగులను ఇలాగే రెచ్చగొట్టి ఉంటే కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చేవారా అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం అక్రమాల నిగ్గు తేల్చే పనిలో ఉన్నామని, కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు అన్ని అక్రమాలపై విచారణ జరుగుతోందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ చీలికలు, పీలికలు అవుతుందని, ఒక్క పార్లమెంట్ స్థానంలో కూడా బీఆర్‌ఎస్ గెలవదని కోమటిరెడ్డి జోస్యం చెప్పారు.

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న

▶ మొదటి పేజీ తరువాయి

జన్మించారు. ఈ గ్రామం పూర్వం బ్రిటిష్ ఇండియా పాలనలో బిహార్-ఒడిశా ప్రావిన్స్‌లో పితౌజియా పేరుతో పిలవబడేది. పితౌజియా గ్రామం పేరును ఈయన పేరిట కర్పూరిగ్రామ్‌గా మార్చారు. అతి సామాన్య నాయీ బ్రాహ్మణ రైతు కుటుంబంలో కర్పూరి ఠాకూర్ జన్మించారు. ఠాకూర్‌కు చిన్నప్పటి నుంచి విప్లవభావాలు ఎక్కువే. కాలేజీ విద్యను మధ్యలోనే వదిలేసి భారత స్వతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు బ్రిటిష్ ప్రభుత్వం ఠాకూర్‌ను 1942, 1945లో అరెస్ట్‌చేసి జైలులో వేసింది. స్వాతంత్ర్యం సిద్ధించాక మొదట్లో గ్రామంలో టీచర్‌గా పనిచేశారు. రామ్ మనోహర్ లోహియాకు ప్రభావితులై రాజకీయాల్లో చేరారు. జయప్రకాశ్ నారాయణ్‌కు సన్నిహితంగా మెలిగేవారు. ఎమర్జెన్సీలో ఆయనతో కలసి పోరాటం చేశారు.

జననాయకుడు: బిహార్‌లో బీసీలకు 26 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న మంగేరీ లాల్ కమిషన్ సిఫార్సులను 1978లో అమలుచేశారు. మండల్ కమిషన్‌కు ఈ సిఫార్సులే ప్రేరణగా నిలిచాయి. అత్యంత వెనుకబడిన కులాలు అనే భావనను తొలిసారిగా మంగేరీ కమిషనే తీసుకొచ్చింది. 1952లో తొలిసారిగా సోషలిస్ట్ పార్టీ తరఫున తేజ్‌పూర్ స్థానం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి బిహార్ శాసనసభకు ఎన్నికయ్యారు. తుదిశ్వాస విడిచేదాకా ఎమ్మెల్యేగానే కొనసాగారు. 1970లో బిహార్ రాష్ట్ర వ్యాప్తంగా మద్యపాన నిషేధం అమలుచేసి అందరి మన్ననలు పొందారు. రాష్ట్రంలో ఓబీసీలు రాజకీయాల్లో కీలకంగా మారడం వెనక ఈయన పాత్ర ఉంది. జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌లకు ఠాకూర్ రాజకీయ గురువు. 1988లో తుదిశ్వాస విడిచారు. ఈయన కుమారుడు ప్రస్తుతం రామ్‌నాథ్ ఠాకూర్ రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు.

అణగారిన వర్గాల పెన్నిధి: మోదీ

ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడంపై ప్రధాని మోదీ సంతోషం వ్యక్తంచేశారు. 'పేద, అణగారిన, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా అంకితభావంతో పనిచేశారు. ఆయన నాయకత్వ దార్శనికత భారత సామాజిక, రాజకీయ ముఖచిత్రంపై చెరగని ముద్ర వేసింది. ఈ పురస్కారం ఆయన కృషి మాత్రమేకాదు సమసమాజ స్థాపనకు మనం చేసే ప్రయత్నాలకు చక్కని ప్రేరణ' అని మోదీ శ్లాఘించారు.

రేపు హైదరాబాద్‌కు ఖర్గే



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం హైదరాబాద్‌కు రానున్నారు. పార్టీకి చెందిన పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్లతో ఎల్బీ స్టేడియం వేదికగా జరిగే సమావేశంలో ఆయన భేటీ కానున్నారు. ఈ సందర్భంగా పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన పోలింగ్ బూత్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేయనున్నారు. కాగా, ఈ సమావేశం ఏర్పాట్లపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సమీక్షించారు. తన నివాసంలో మహేశ్‌తో సమావేశమైన రేవంత్ కార్యక్రమ ఏర్పాట్లు జరుగుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చేసిన పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్స్ అందరూ సమావేశానికి హాజరు కావాలని ఈ సందర్భంగా రేవంత్ పిలుపునిచ్చారు.

సీఎంను కలిసిన సలహాదారులు, ఎమ్మెల్సీలు

కాగా, కొత్తగా నియమితులైన సలహాదారులు, ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధి, ఇద్దరు ఎమ్మెల్సీలు మంగళవారం సీఎం రేవంత్‌ను కలిశారు. సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, హర్కర వేణుగోపాల్‌రావు, ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లురవితో పాటు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్‌లు జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సీఎం రేవంత్ అభినందించారు. అదే విధంగా దావోస్ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకోవడం పట్ల సలహాదారులు, ఎమ్మెల్సీలు సీఎం రేవంత్‌కు అభినందనలు తెలిపారు.

రూ.40,000 కోట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

అవసరమని అంచనా వేసింది. అయితే దాదాపు రూ.13 వేల కోట్ల వరకు మాత్రమే మాఫీ చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలంటే మొత్తం రూ.30 వేల కోట్లు అవసరమవుతాయని, వడ్డీలతో కలిపి రూ.36 వేల కోట్లు కావాల్సి ఉంటుందని అంచనా. కాగా మొదటి సంవత్సరానికి గాను రూ.7,200 కోట్లు చెల్లించేలా వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు చేసింది.

బ్యాంకులకు నెలసరి వాయిదాల్లో..

రుణమాఫీ నిధులను బ్యాంకులకు ప్రతి నెలా రూ.600 కోట్ల చొప్పున ఐదేళ్ల పాటు చెల్లించే అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం నోడల్ బ్యాంకుతో ఒక దఫా చర్చలు కూడా జరిపినట్లు సమాచారం. అవసరమైతే ఆర్‌బీఐతోనూ చర్చించాలని, బ్యాంకులకు నెలసరి వాయిదాల్లో ఈ మొత్తాన్ని చెల్లించినప్పటికీ, రుణమాఫీ ఒకేసారి చేసేలా బ్యాంకులను ఒప్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇలావుండగా రుణమాఫీకి సంబంధించిన కట్ ఆఫ్ డేట్ (గడువు తేదీ)పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. రుణమాఫీ ఎలా చేయాలన్న దానిపై త్వరలో మార్గదర్శకాలు ఖరారు కానున్నాయి. ఇక రైతుబంధు కోసం 2023-24 బడ్జెట్లో రూ.15,075 కోట్లు కేటాయించారు. తాజాగా రైతుభరోసా సొమ్ము కూడా పెరగడంతో బడ్జెట్ కూడా పెంచాల్సి ఉంది. కాబట్టి రూ.22,500 కోట్లు కావాల్సి ఉంటుందని అంచనా కాగా.. ఆ మేరకు వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు పంపింది.

వ్యవసాయ యాంత్రీకరణకు రూ.500 కోట్లు

వ్యవసాయ యాంత్రీకరణపైనా దృష్టి సారించాలని, ఆ మేరకు రూ.500 కోట్లు కేటాయించాలని వ్యవసాయశాఖ ప్రతిపాదించినట్లు తెలిసింది. రైతు బీమాకు ప్రభుత్వం 2022-23లో రూ.1,466 కోట్లు కేటాయిస్తే, 2023-24 బడ్జెట్లో రూ.1,589 కోట్లు కేటాయించింది. ఈసారి రూ.1,600 కోట్లు కేటాయించే అవకాశాలున్నాయి. ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచేందుకు 2023-24 బడ్జెట్లో రూ.1,000 కోట్లు కేటాయించింది. ఈసారి కూడా అంతే మొత్తంలో కేటాయించాలని ఉద్యానశాఖ నుంచి ప్రతిపాదనలు వచ్చినట్లు సమాచారం. రైతులకు విత్తనాలు సరఫరా చేసేందుకు, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి, రైతు వేదికలకు, మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్, వ్యవసాయ విస్తరణ కార్యకలాపాలకు, మైక్రో ఇరిగేషన్ తదితరాలకు కూడా నిధులు కోరుతూ వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు చేసింది. ఇక రాష్ట్రంలో కొత్తగా పంటల బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఎప్పటినుంచో ప్రతిపాదన ఉంది. దీన్ని అమలు చేయాలంటే ఆ మేరకు నిధులు కేటాయించాల్సి ఉంటుంది.

రామమందిర ప్రారంభోత్సవానికి సెలవెందుకు ఇవ్వలేదు?

బీజేపీ అధికార ప్రతినిధి పోరెడ్డి కిశోర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 22న సెలవుదినంగా ప్రకటించకపోగా ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు కనీసం ఏర్పాట్లు చేయలేదని బీజేపీ అధికార ప్రతినిధి పోరెడ్డి కిశోర్‌రెడ్డి విమర్శించారు. అప్పుడు శ్రీరాముడికి కేసీఆర్ గౌరవం ఇవ్వలేదని విమర్శించి.. ఎన్నికల సమయంలో శ్రీరాముడి అంశాన్ని ఓట్ల కోసం వాడుకున్న చరిత్ర రేవంత్‌రెడ్డిదని మండిపడ్డారు. మంగళవారం కిశోర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించగా తెలంగాణలో మాత్రం ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవం వేళ రాష్ట్ర ప్రభుత్వం పట్టింపులేకుండా వ్యవహరించడం దారుణమన్నారు. కేసీఆర్ ఎన్నడూ భద్రాచలంలో శ్రీరాముడికి పట్టువస్త్రాలు తీసుకురాలేదని, భద్రాచలం ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు ఇస్తానని మోసం చేసి చరిత్రహీనుడిగా మిగిలారని రేవంత్ చేసిన విమర్శలను గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో రామమందిరాలు నిర్మిస్తామని చెప్పారని, అలాంటిది బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సెలవు ఇవ్వకపోవడం ఏంటని కిశోర్‌రెడ్డి నిలదీశారు.

బీఆర్‌ఎస్‌పై అసంతృప్తి లేదు

● పార్టీ మారుతున్నట్లు వస్తున్నవి వదంతులు మాత్రమే: గుత్తా
● అమిత్‌కు నల్లగొండ లేదా భువనగిరి టికెట్ అడుగుతున్నా



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధిష్టానంపై తాను అసంతృప్తిగా ఉన్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తాను పార్టీ మారుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తున్నవి వదంతులు మాత్రమేనని, కాంగ్రెస్ పార్టీకి తాను గతంలో ఎంత దూరంలో ఉన్నానో ఇప్పుడు కూడా అంతే దూరం పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. శాసనమండలిలోని చైర్మన్ ఛాంబర్‌లో గుత్తా మంగళవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో సహా తనకు ఎవరితోనూ విభేదాలు లేవన్నారు. తనకు మరో నాలుగేళ్ల పదవీ కాలం ఉందని, ప్రత్యక్ష రాజకీయాలకు కూడా దూరంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కష్టకాలంలో పార్టీ కేడర్‌ను కాపాడి పార్టీకి అండగా నిలబడేందుకు తన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్లు సుఖేందర్‌రెడ్డి వెల్లడించారు. నల్లగొండ, భువనగిరి లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఎక్కడ అవకాశమిచ్చినా తన కుమారుడు పోటీ చేస్తాడని, అతనిది అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం అని పేర్కొన్నారు. తన కుమారుడికి పార్టీ టికెట్ అంశంపై ఒకటి రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని గుత్తా వెల్లడించారు. నల్లగొండ, భువనగిరిలో బీసీలకు అవకాశమిచ్చినా గెలుపు కోసం సహకరిస్తామన్నారు. నల్లగొండ నుంచి సోనియా గాంధీ పోటీ చేసినా ఆమెపై పోటీకి తన కుమారుడు అమిత్ సిద్ధంగా ఉన్నాడని చెప్పారు. తన కుమారుడికి టికెట్ ఇవ్వకున్నా పార్టీ మారే ప్రసక్తే లేదని గుత్తా స్పష్టం చేశారు.

ఫిర్యాదులు ప్రివిలేజ్ కమిటీకి..

ముఖ్యమంత్రిపై సభ్యులు చేస్తున్న ఫిర్యాదులను ప్రివిలేజ్ కమిటీకి పంపిస్తానని గుత్తా వెల్లడించారు. కేటీఆర్ తన నివాసానికి రావడం సాధారణ రాజకీయ ప్రక్రియలో భాగమని పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తన సొంత జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వచ్చే శాసన మండలి సమావేశాలను పాత భవనంలో జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కమ్యూనిస్టుల ఓట్ల శాతం తగ్గినా ఎంతో కొంత బలం ఉందన్నారు.

బీసీల ఓట్లకు 'కులగణన' అస్త్రం

▶ మొదటి పేజీ తరువాయి

టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సమావేశంలో కూడా చర్చ జరగడం గమనార్హం.

అన్ని రాష్ట్రాల్లోనూ అధ్యయనం

లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పనలో భాగంగా అన్ని రాష్ట్రాలకు ఏఐసీసీ ప్రతినిధులు వెళుతున్నారు. అందులో భాగంగానే జాతీయ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్, మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ప్రవీణ్ చక్రవర్తి మంగళవారం తెలంగాణకు వచ్చారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టో తయారీకి టీపీసీసీ నియమించిన కమిటీతో ఆయన గాంధీభవన్‌లో భేటీ అయ్యారు. టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షీ, కమిటీ సభ్యులు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, తాహెర్‌బిన్ హందాన్, లింగంయాదవ్, రవళిరెడ్డి, కోట నీలిమ, పోట్ల నాగేశ్వరరావు, సామా రామ్మోహన్‌రెడ్డి, గాల్‌రెడ్డి హర్షవర్దన్‌రెడ్డి, రియాజ్, కత్తి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పనలో రాష్ట్ర నేతల ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ఎన్నికల మేనిఫెస్టో పీపుల్స్ ఫ్రెండ్లీగా ఉందని, క్షేత్రస్థాయిలోని అంశాలనూ టచ్ చేశారని అభినందించారు. ఈ సందర్భంగా మేనిఫెస్టో కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు విస్మరించే వర్గాలను కూడా మేనిఫెస్టోలో చేర్చామని చెప్పారు. ట్రాన్స్‌జెండర్లు, ఇళ్లలో పనిచేసే వారి గురించి అధ్యయనం చేసి, వారి సమస్యలను కూడా ప్రస్తావించామని వివరించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజల ముందు ఒక మేనిఫెస్టో ఉంచగలిగామని చెప్పారు. ప్రజలు తమపై విశ్వాసంతో అధికారం అప్పగించారని, ఈ హామీలు నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

ఒకట్రెండు ఆలోచనలు ప్రధాన మేనిఫెస్టోకు వెళతాయి: ప్రవీణ్ చక్రవర్తి

సమావేశ అనంతరం దీపాదాస్ మున్షీ, ఇతర తెలంగాణ నేతలతో కలిసి ప్రవీణ్‌చక్రవర్తి గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశ ప్రజల ఆలోచనలను తెలుసుకునేందుకు అన్ని రాష్ట్రాలకు వెళ్లి ప్రజలు, నిపుణులు, పార్టీ నేతల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల మేనిఫెస్టో ముఖ్య సాధనమని కాంగ్రెస్ నమ్ముతుందని చెప్పారు. మేనిఫెస్టో కమిటీ సభ్యులతో పాటు పౌర సంఘాలు, కొందరు ప్రజలతో సమావేశమయ్యామన్నారు. ఈ చర్చల్లో వచ్చిన ఫీడ్‌బ్యాక్ నుంచి ఒకట్రెండు ఆలోచనలు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించే ప్రధాన మేనిఫెస్టోకు వెళతాయని చెప్పారు.

అధికారం కోల్పోయాకే కార్యకర్తలు గుర్తుకొస్తారా?

ఉద్యమకారులకు ఎంపీ టికెట్లు ఇచ్చి బీఆర్‌ఎస్ చిత్తశుద్ధి నిరూపించుకోవాలి: రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌కు, ఆ పార్టీ నేతలకు అధికారం కోల్పోయాకకానీ కార్యకర్తలు గుర్తుకురాలేదా అని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు ప్రశ్నించారు. పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఇస్తామంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు చెబుతున్నారని అధికారంలో ఉన్నపుడు వారికి ఎందుకు సముచిత స్థానం, గౌరవం కల్పించలేకపోయారని ఆయన నిలదీశారు. మంగళవారం ఆయన మీడియాతో మట్లాడుతూ, ఉద్యమకారులకు ఎంపీ టికెట్లు ఇవ్వడం ద్వారా వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మీ నీతి, నిజాయితీ నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సమీక్షల పేరుతో రోజుకో కొత్త మాట చెబుతున్నారని ఎద్దేవా చేశారు. అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు, కార్యకర్తలకు అన్యాయం చేసినందుకు బీఆర్‌ఎస్ నేతలు క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. మాజీమంత్రులు హరీశ్, కేటీఆర్ కొత్తగా ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం దగ్గర తాము చేసిన తప్పులకు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పి అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు, కార్యకర్తలకే ఎన్నికల్లో సీట్లు ఇస్తామని ప్రమాణం చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో మెదక్, చేవెళ్ల, మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్లు బీఆర్‌ఎస్ అమ్ముకుందనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి బీఆర్‌ఎస్‌ను ఖతం చేయాలని చూస్తున్నాయని కేటీఆర్ ప్రచారం చేయడాన్ని తప్పుబట్టారు. ప్రపంచంలోని హిందూ బంధువుల ఆకాంక్షలకు అనుగుణంగా అయోధ్యలోని రామమందిరం నిర్మాణం కోసం బీజేపీ కొట్లాడితే ఈ గుడికి వ్యతిరేకంగా అడ్వొకేట్లను పెట్టి అడ్డుకున్న పార్టీ కాంగ్రెస్ అని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంటు ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌ను ప్రజలు బొందపెడ్తారని, బీఆర్‌ఎస్ ఒక్క సీటు కూడా గెలవదని రఘునందన్ జోస్యం చెప్పారు. ఎంఐఎంతో పొత్తుపెట్టుకుని, మైనారిటీ హక్కులంటూ బీఆర్‌ఎస్ ఊరేగిందని, నేడు ఎంఐఎం బీఆర్‌ఎస్‌ను విడిచి కాంగ్రెస్ వైపు వెళ్తుంటే బీజేపీపై విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

సీఎంతో మెదక్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల భేటీ

● ప్రొటోకాల్, వ్యక్తిగత భద్రత అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడి
● రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ..మీడియాలోనూ వైరల్
● రాజకీయ ప్రాధాన్యత లేదంటూ స్పందించిన ఎమ్మెల్యేలు



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. సునీతా లక్ష్మారెడ్డి (నర్సాపూర్), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), మాణిక్‌రావు (జహీరాబాద్), కొత్త ప్రభాకర్‌రెడ్డి (దుబ్బాక) జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆయన్ను కలిసారు. నియోజకవర్గంలో తాము ఎదుర్కొంటున్న ప్రొటోకాల్, పోలీసు ఎస్కార్ట్, వ్యక్తిగత భద్రత తదితర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వారు 'సాక్షి'కి తెలిపారు. అయితే ప్రధాన ప్రతిపక్షానికి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు సీఎంను కలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యింది. మీడియాలోనూ వీరి భేటీ వైరల్ అయ్యింది. దీంతో ఎమ్మెల్యేలు స్పందించారు. తమ నియోజకవర్గాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులు కొనసాగేలా చూడాలని సీఎంను కోరినట్లు కొత్త ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. గతంలో పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపు అంశాన్ని కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. రేవంత్‌తో కేవలం మర్యాదపూర్వకంగానే భేటీ అయినట్లు మాణిక్‌రావు తెలిపారు. తాము ముఖ్యమంత్రిని కలవడంపై విపరీతార్థాలు తీయొద్దని, ప్రధాన మంత్రి మోదీని రేవంత్‌రెడ్డి ఎలా అభివృద్ధి పనుల కోసం కలిశారో తాము కూడా అదే విధంగా కలిసినట్లు మహిపాల్‌రెడ్డి వివరించారు. తమ భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని, తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. కాగా వీరు బుధవారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సీఎంతో భేటీపై వివరణ ఇవ్వనున్నట్లు సమాచారం. ఇలావుండగా తమ భద్రతకు సంబంధించిన అంశాలపై ఈ నలుగురు ఎమ్మెల్యేలు మంగళవారం ఇంటెలిజెన్స్ ఏడీజీ శివధర్‌రెడ్డిని కూడా కలిశారు.

భువనగిరి, నేరేడుచర్లలో నెగ్గిన అవిశ్వాసం

రెండు మున్సిపాలిటీల్లో చైర్మన్ పదవులు కోల్పోయిన బీఆర్‌ఎస్



భువనగిరిటౌన్/నేరేడుచర్ల: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళవారం రెండు మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలు నెగ్గాయి. భువనగిరి, నేరేడుచర్ల మున్సిపాలిటీల చైర్మన్ పదవులను బీఆర్‌ఎస్ కోల్పోయింది. భువనగిరి మున్సిపాలిటీలో 16 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు బీజేపీ, కాంగ్రెస్ సభ్యులతో కలిసి సొంత పార్టీ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి 36 మంది సభ్యులుండగా మంగళవారం నిర్వహించిన అవిశ్వాస ప్రత్యేక సమావేశానికి 31 మంది హాజరయ్యారు. 16 మంది బీఆర్‌ఎస్, 9 మంది కాంగ్రెస్, ఆరుగురు బీజేపీ కౌన్సిలర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీరంతా చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు. దీంతో అవిశ్వాసం నెగ్గింది. నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం కూడా నెగ్గింది. ఈ మున్సిపాలిటీలో 15 మంది కౌన్సిలర్లు ఉండగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వైస్ చైర్‌పర్సన్ తన పదవికి రాజీనామా చేశారు. మొదట బీఆర్‌ఎస్‌కు ఏడుగురు కౌన్సిలర్లు ఉండగా.. వైస్ చైర్‌పర్సన్ రాజీనామా చేయడంతోపాటు ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు చైర్మన్‌తో కలిసి ముగ్గురు, సీపీఎంకు ఒకరు, కాంగ్రెస్‌కు పది మంది సభ్యులున్నారు. మంగళవారం జరిగిన అవిశ్వాస సమావేశానికి చైర్మన్ మినహా అందరూ హాజరయ్యారు. చైర్మన్‌పై అవిశ్వాసానికి మద్దతుగా 13 మంది కౌన్సిలర్లు చేతులెత్తారు. దీంతో అవిశ్వాసం నెగ్గింది.



ప్రతి మనిషీ తన ఆరోగ్యాన్నీ లేదా వ్యాధినీ తనే రచించుకుంటాడు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 24 జనవరి 2024

సత్తా పోతున్న సంజీవనులు!

ప్రాణాలు నిలపాల్సిన ఔషధం కాస్తా మనం చేస్తున్న తప్పుల వల్ల ఆ సామర్థ్యాన్ని కోల్పోతే? మానవాళికి అది మహా ప్రమాదమే. యాంటీ బయాటిక్స్ వినియోగంలో మనం తరచూ చేస్తున్న తప్పుల వల్ల ఆ పరిస్థితే దాపురిస్తోందని నిపుణులు మరోసారి హెచ్చరిస్తున్నారు. యాంటీ బయాటిక్స్ అతిగా వాడడం, లేదంటే నిర్ణీత మోతాదులో సరిగ్గా వాడకపోవడం వల్ల చివరకు ఆ ఔషధాలకు కొరుకుడుపడని ప్యాథోజెన్‌లు వృద్ధి చెందుతున్నాయి. ఆ నేపథ్యంలోనే అర్హత గల వైద్యులు రాసిచ్చిన మందుల చీటీ లేకుండా యాంటీ బయాటిక్స్‌ను విక్రయించవద్దంటూ కేంద్ర ఆరోగ్య శాఖ తాజాగా అభ్యర్థించింది. అలాగే, యాంటీ బయాటిక్స్ వాడాల్సిందిగా రాసినప్పుడు అందుకు కారణాల్ని సైతం పేర్కొనాల్సిందిగా వైద్యులకు పిలుపునిచ్చింది. యాంటీ బయాటిక్స్ వాడకంలో వివేకంతో వ్యవహరిస్తేనే, మందులకు లొంగని వ్యాధికారక జీవులను అరికట్టవచ్చని మరోసారి నొక్కిచెప్పింది. కొత్త యాంటీ బయాటిక్స్ పరిశోధన, అభివృద్ధి అనేది పరిమితంగానే ఉన్నందున ఔషధ వినియోగంపై తక్షణం అప్రమత్తం కావాలన్న సూచన అందరికీ ఓ మేలుకొలుపు.

బ్యాక్టీరియా నిర్మూలనకు ఉద్దేశించిన ఔషధాలపై సదరు సూక్ష్మజీవులే విజయం సాధించడం, వాడే మందుల వల్ల అవి చావకపోగా పెరగడమనేది ఇప్పుడు ప్రపంచాన్ని వేధిస్తున్న పెద్ద సమస్య. దీనికే వైద్యపరిభాషలో 'యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్' (ఏఎంఆర్) అని పేరు. ఈ ఏఎంఆర్ వల్ల 2019లో ప్రపంచవ్యాప్తంగా 12.7 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. ఔషధాలకు నిరోధకత ఏర్పడ్డ ఇన్‌ఫెక్షన్లతో అదనంగా మరో 49.5 లక్షల మంది మరణించారని లెక్కలు చెబుతు న్నాయి. ఏఎంఆర్ వల్ల ఇన్‌ఫెక్షన్ల నివారణ, చికిత్స కుంటుబడడమే కాక, దీర్ఘకాలిక అనారోగ్యం పెరిగి, ప్రాణానికి ప్రమాదవుతుంది. బలం పెరిగిన ఈ ఇన్‌ఫెక్షన్లకు ముకుతాడు వేయాలంటే బాగా ఖరీదైన రెండో శ్రేణి ఔషధాలే దిక్కు. వాటి ఖరీదు ఎక్కువ గనక, సామాన్యులకు చివరకు చికిత్సే అందని దుఃస్థితి. పొంచివున్న ఈ ప్రమాదానికి ఇప్పుడు కేంద్ర స్థానం మన దేశమేనట! ఇదే పరిస్థితి కొన సాగితే, 2050 నాటికి ఒక్క భారత్‌లోనే 20 లక్షల మంది చనిపోతారని అంచనా. క్యాన్సర్, రోడ్డు ప్రమాదాలు కలిపి సంభవించే మరణాల కన్నా ఈ సంఖ్య ఎక్కువ. ఇది ఆందోళనకరమైన అంశం.

అరుదుగానే వాడాల్సిన వివిధ రకాల యాంటీ బయాటిక్స్‌ను పెద్ద మొత్తంలో మన దేశంలో యథేచ్ఛగా ఉపయోగిస్తున్నట్టు 2022 నాటి లాన్సెట్ అధ్యయనం తేల్చింది. వీటన్నిటి వల్లే, డాక్టర్ చీటీ లేకుండా యాంటీ బయాటిక్స్‌ను షాపుల్లో నేరుగా రోగులకు అమ్మవద్దని ఆరోగ్య శాఖ ఇప్పుడు నొక్కిచెప్పింది. ఏఎంఆర్ విజృంభించకుండా అడ్డుకొనేందుకు వీలుగా సరైన రీతిలో యాంటీ బయా టిక్స్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్న ఈ ప్రయత్నం హర్షణీయం. యాంటీ బయాటిక్స్ 1945 నాటి 'ఔషధాలు, సౌందర్య పోషకాల నిబంధనల' ప్రకారం షెడ్యూల్ హెచ్ కిందకొస్తాయి. అంటే, రిజిస్టర్ చేసుకున్న మెడికల్ ప్రాక్టీషనర్ చీటీ రాస్తే తప్ప, వాటిని మందుల షాపుల్లో అడిగినవారం దరికీ ఇవ్వరాదు. శక్తిమంతమైన యాంటీ బయాటిక్స్‌నైతే 'షెడ్యూల్ హెచ్1'లో చేర్చారు. ఈ రెండు షెడ్యూల్స్‌లోని ఔషధాలను డాక్టర్ సిఫార్సుతోనే ఫార్మసీలలో విక్రయిస్తే పెద్ద చిక్కు తప్పుతుంది. ఈ నిబంధనల్ని కఠినంగా అమలు చేయాలన్నదే ఇప్పుడు ఆరోగ్యశాఖ ప్రయత్నం.

ఏఎంఆర్ వల్ల మామూలు మందులు బ్యాక్టీరియాపై పని చేసే సత్తాను కోల్పోతాయనీ, ఫలితం గా సాధారణ అనారోగ్యాలు సైతం చివరకు ప్రాణాంతకంగా పరిణమిస్తాయనీ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సైతం ఇప్పటికే హెచ్చరించింది. చాప కింద నీరులా నిశ్శబ్దంగా వ్యాపిస్తున్న ఈ ఏఎంఆర్ మహమ్మారి నవజాత శిశువుల నుంచి వృద్ధుల దాకా ఏ వయసు వారికైనా, జీవితంలో ఏ దశలోనైనా ప్రాణాపాయమే. కాబట్టి, రోగికీ, వైద్యుడికీ మధ్య పరస్పర విశ్వాసం, సత్సంబంధాలు అవసరం. అప్పుడే ఔషధ వినియోగం సక్రమంగా జరుగుతుంది. నిజానికి, యాంటీ బయాటిక్స్ దుర్వినియోగమే కాక ఇతర కారణాలూ ఏఎంఆర్‌కు ఉన్నాయి. శుభ్రమైన తాగునీరు, పారిశుద్ధ్యం, జనంలో చైతన్యం లేకపోవడమూ ఏఎంఆర్‌కు దోహదం చేస్తాయని నిపుణుల మాట. దీన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యంపై శ్రద్ధ చూపడం ప్రభుత్వాల తక్షణ బాధ్యత.

మన దగ్గర వాడుతున్న యాంటీ బయాటిక్స్ 'నిర్ణీత మోతాదు కాంబినేషన్' (ఎఫ్‌డీసీ)లు చాలావాటికి అనుమతులు లేవు. కొన్నయితే నిషేధానికి గురైనవి. భారత్, ఖతార్, బ్రిటన్‌లలో అధ్యయనం జరిపిన పరిశోధకులు ఈ సంగతి తేల్చారు. ఇంకా చెప్పాలంటే, దేశవ్యాప్తంగా అమ్ముతున్న 58 శాతం యాంటీ బయాటిక్స్ ఎఫ్‌డీసీలు తమ లెక్కలో 'సిఫార్సు చేయరాదు' అనే జాబితాలో ఉన్నాయని డబ్ల్యూహెచ్ఓ కుండబద్దలు కొట్టింది. అలాగే, వైరల్ ఇన్ఫెక్షనా, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షనా అనేది నిర్ధారించకుండానే కొందరు వైద్యులు అతి జాగ్రత్తతో యాంటీ బయాటిక్స్ ఇస్తున్న కేసులూ లేకపోలేదు. మనం కళ్ళు తెరిచి, అవగాహనతో అడుగులు వేయాల్సిన సందర్భమిది.

అసలంటూ ఏఎంఆర్‌పై అవగాహన పెంచేందుకు ఆరోగ్య శాఖ 2016లోనే ప్రయత్నం చేయకపోలేదు. కొన్ని మందులపై నిలువునా 'ఎర్ర రంగు గీత' వేయించి, డాక్టర్ చీటీ లేకుండా అవి వాడవద్దని చెప్పింది. ఎనిమిదేళ్ళలో ఆ ప్రయత్నం ఏ మేర ఫలించిందో తేల్చి, లోటుపాట్లు సరిదిద్దాలి. భారతీయ వైద్య పరిశోధనా మండలి నెలకొల్పిన ఏఎంఆర్ నిఘా, పరిశోధక వ్యవస్థను పటిష్ఠం చేయాలి. అన్నిటి కన్నా ముందుగా ఔషధ దుర్వినియోగ నివారణకై డాక్టర్లు, ఫార్మసిస్టులు, ఫార్మా కంపెనీలు, సామాన్య జనం, సర్కారు కలసికట్టుగా నిలవాలి. సంజీవనులైన ఔషధాలే సత్తా కోల్పోతున్నాయంటే, అది మన స్వయంకృతాపరాధమని గ్రహించి, ఇకనైనా మారాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.చతుర్దశి రా.9.26 వరకు తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** ఆరుద్ర ఉ.6.48 వరకు తదుపరి పునర్వసు, **వర్జ్యం:** రా.7.30 నుండి 9.10 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.50 నుండి 12.38 వరకు, **అమృత ఘడియలు:** తె.5.34 నుండి 7.15 వరకు

సూర్యోదయం: 6.38
సూర్యాస్తమయం: 5.47
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

అరుదైన జన నాయకుడు

సందర్భం



నరేంద్ర మోదీ
భారత ప్రధాని

బిహార్‌కు రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన (1970–71, 1977–79) కర్పూరీ ఠాకూర్ జీవితం సరళత, సామాజిక న్యాయం అనే జంట స్తంభాల చుట్టూ తిరిగింది. ఆయన సాధారణ జీవనశైలి, వినయపూర్వకమైన స్వభావం సామాన్య ప్రజలను లోతుగా ప్రభావితం చేశాయి. సామాజిక న్యాయం ఆయనకు అత్యంత ప్రియమైన అంశం. భారత సమాజాన్ని పీడిస్తున్న వ్యవస్థాగత అసమానతలను పరిష్కరించేందుకు పట్టుదలగా కృషి చేశారు. తన రాజకీయ ప్రయాణంలో వనరులు సక్రమంగా పంపిణీ అయ్యే సమాజాన్ని నిర్మించేందుకు పూనుకున్నారు. ఆయన నాయకత్వంలో, ఒకరి పుట్టుక ఒకరి విధిని నిర్ణయించని; సమగ్ర సమాజానికి పునాది వేసే విధానాల అమలు జరిగింది. దురదృష్ట వశాత్తూ 64 ఏళ్ల వయసులోనే అర్ధంతరంగా మరణించినా, కోట్లాది మంది హృదయాల్లో నిలిచారు... నేడు మన 'భారత రత్న'మై వెలిగారు.

సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసి, కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు, 'జన్ నాయక్' కర్పూరీ ఠాకూర్ జీ శత జయంతి నేడు. కర్పూరీ జీని కలిసే అవకాశం నాకు ఎప్పుడూ రాలేదు కానీ, ఆయనతో సన్నిహితంగా పనిచేసిన కైలాసపతి మిశ్రా గారి నుండి నేను ఆయన గురించి చాలా విన్నాను. ఆయన సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గాలలో ఒకటైన నాయి(క్షురక) కులానికి చెందినవారు. అయినప్పటికీ ఎన్నో ఆటంకాలను అధిగమించి, అకుంఠిత దీక్షతో శ్రమించి, సమాజాభివృద్ధికి పాటుపడ్డారు.


కర్పూరీ ఠాకూర్‌జీ జీవితం సరళత, సామాజిక న్యాయం అనే జంట స్తంభాల చుట్టూ తిరిగింది. తన చివరి శ్వాస వరకు, ఆయన సాధారణ జీవనశైలి, వినయపూర్వకమైన స్వభావం సామాన్య ప్రజల హృదయాల్లో లోతుగా ప్రతిధ్వనించాయి. ఆయన సింప్లిసిటీని హైలైట్ చేసే అనేక వృత్తాంతాలు ఉన్నాయి. తన కూతురి పెళ్లితో సహా, ప్రతీ వ్యక్తిగత వ్యవహారానికి తన సొంత డబ్బును మాత్రమే ఎలా ఖర్చు పెట్టడానికి ఇష్టపడేవారో ఆయనతో పనిచేసిన వారు గుర్తు చేసుకుంటారు. బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో, రాజకీయ నాయకుల కోసం ఒక కాలనీని నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ ఆయన మాత్రం తనకోసం ఎటువంటి భూమి గానీ, డబ్బు గానీ తీసుకోలేదు. 1988లో ఆయన మరణించినప్పుడు పలువురు నాయకులు ఆయన గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. ఆయన ఇంటి పరిస్థితిని చూసి కన్నీళ్ల పర్యంతమయ్యారు– ఇంత మహోన్నతుని ఇల్లు ఇంత సాదాసీదాగా ఎలా ఉందా అని!

ఇలా కూడా ఉంటారా?

1977లో బిహార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆయన సరళతకు సంబంధించిన మరో కథనం ఇది. అప్పుడు కేంద్రంలో, బిహార్‌లో జనతా ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ సమయంలో, లోక్‌నాయక్ జేపీ(జయప్రకాశ్ నారాయణ్) పుట్టినరోజు సందర్భంగా జనతా నాయకులు పట్నాలో గుమిగూడారు. అప్పుడు ముఖ్యమంత్రి కర్పూరీ జీ కూడా వారితో ఉన్నారు. ఆయన చిరిగిన కుర్తాతో నడిచిరావడం వాళ్లు గమనించారు. చంద్రశేఖర్ జీ(మాజీ ప్రధాన మంత్రి; జనతా పార్టీ నేత) తనదైన శైలిలో, కర్పూరీజీ కొత్త కుర్తాను కొనుగోలు చేసేందుకు కొంత డబ్బును విరాళంగా ఇవ్వాలని ప్రజలను కోరారు. అయితే, కర్పూరీ ఆ డబ్బును అంగీకరించారు కానీ దానిని ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా ఇచ్చేశారు. అదీ ఆయన గొప్పతనం! తనకు సాటి ఎవరూ లేరని ఆ ప్రవర్తనతో చాటి చెప్పారు.

కర్పూరీ ఠాకూర్ సామాజిక న్యాయం కోసం పరితపించారు. ఆయన రాజకీయ ప్రయాణంలో వనరుల పంపిణీ నిష్పాక్షికంగా జరగాలని కోరుకున్నారు. ప్రతి ఒక్కరూ వారి సామాజిక స్థితిగతులతో సంబంధం లేకుండా అవకాశాలను పొందాలని తపించారు. భారత సమాజాన్ని పీడిస్తున్న వ్యవస్థాగత అసమానతలను నిర్మూలించడానికి పట్టుదలతో కృషి చేశారు.

తన ఆదర్శాల పట్ల ఆయనకున్న నిబద్ధత ఎలాంటిదంటే, కాంగ్రెస్ పార్టీ అత్యంత బలంగా ఉన్న కాలంలో జీవించినప్పటికీ, కాంగ్రెస్ తన వ్యవస్థాపక సూత్రాల నుండి వైదొలిగిందని చాలా ముందుగానే నమ్మినందున, స్పష్టమైన కాంగ్రెస్ వ్యతిరేక వైఖరిని తీసుకున్నారు.



బిహార్ మాజీ ముఖ్యమంత్రి 'జన నాయక్' కర్పూరీ ఠాకూర్ (1924-88) శతజయంతి నేడు : కేంద్ర ప్రభుత్వం నిన్న ఆయనకు మరణానంతరం 'భారతరత్న' ప్రకటించింది.

ఆయన ఎన్నికల జీవితం 1950ల మొదట్లో ప్రారంభమైంది. అప్పటి నుండి, శాసన సభలో గణనీయమైన శక్తిగా మారారు. కార్మికులు, సన్నకారు రైతులు, యువకుల కష్టాలకు శక్తిమంతమైన గొంతుకై, వారి పోరాటాలకు అండగా నిలిచారు. విద్యకు కూడా ఆయన అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. తన రాజకీయ జీవితంలో పేదలకు విద్యా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ఎంతగానో కృషి చేశారు. ఉన్నత స్థానాలకు ఎదగాలంటే చిన్న పట్టణాలు, గ్రామాల్లోని ప్రజలకు స్థానిక భాషలలో విద్యా బోధన అందాలని సూచించారు. ముఖ్యమంత్రి హోదాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం ఎన్నో చర్యలు చేపట్టారు.

కర్పూరీ వ్యక్తిత్వంలో ప్రజాస్వామ్యం, చర్చోపచర్చలు, సమావేశాలు అంతర్భాగంగా నిలిచాయి. యువకుడిగా క్విట్ ఇండియా ఉద్యమంలో మునిగితేలినప్పుడూ, మళ్లీ ఎమర్జెన్సీని కరాఖండీగా ఎదిరించి నిలిచినప్పుడూ ఈ స్ఫూర్తి కనిపిస్తుంది. ఆయనదైన ఈ ప్రత్యేక దృక్పథాన్ని జేపీ, డాక్టర్ లోహియా, చరణ్ సింగ్ వంటివారు గొప్పగా మెచ్చుకునేవారు.

బహుశా కర్పూరీ ఠాకూర్ భారతదేశానికి అందించిన అత్యంత ముఖ్యమైన సహకారాలలో ఒకటి... వెనుకబడిన తరగతుల వారికి తగిన ప్రాతినిధ్యం, అవకాశాలు లభిస్తాయన్న ఆశతో వారి కోసం నిశ్చయాత్మక చర్యలను బలోపేతం చేయడం. ఆయన నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత వచ్చినా ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గలేదు. ఆయన నాయకత్వంలో, ఒకరి పుట్టుక ఒకరి విధిని నిర్ణయించని, సమగ్ర సమాజానికి పునాది వేసే విధానాల అమలు జరిగింది. ఆయన సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందినవారు అయినప్పటికీ, ప్రజలందరి కోసం పనిచేశారు. సంకుచిత భావాలతో పని చేయలేదు. ఆయనలో లేశ మాత్రమైనా కాఠిన్యం ఉండకపోయేది, అదే ఆయన్ని నిజమైన గొప్పవాడిగా నిలబెట్టింది.

ఆయన బాటలో...

గత పదేళ్లుగా, మా ప్రభుత్వం కూడా జన్ నాయక్ కర్పూరీ ఠాకూర్ భావాలు, విధానాలను ఆదర్శంగా తీసుకుని పనిచేస్తోంది. సామాజిక సాధికారత సాధించడం లక్ష్యంగా మా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తూ, ప్రజా సంక్షేమ విధానాలు అనుసరిస్తోంది. కర్పూరీ వంటి కొద్దిమంది నాయకులను మినహాయిస్తే, సామాజిక న్యాయం కోసం ఇచ్చే పిలుపు కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే పరిమితం కావడం మన రాజకీయ వ్యవస్థ తాలూకు అతిపెద్ద విషాదాలలో ఒకటి. కర్పూరీ ఠాకూర్ విధానాల నుండి స్ఫూర్తి పొంది సమర్థవంతమైన పాలన విధానాన్ని మేము అమలు చేస్తున్నాం. గత కొన్నేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం బారి నుంచి విముక్తి పొందారు. వీరంతా అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన వారు. వలస పాలన నుంచి విముక్తి పొంది దాదాపు 70 ఏళ్ల తర్వాత కూడా వీరికి తగిన గుర్తింపు, గౌరవం లభించలేదు. సామాజిక న్యాయ సాధన కోసం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలి అన్న దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పని చేస్తోంది. మా ప్రభుత్వం సాధించిన విజయాలను చూసి కర్పూరీ ఠాకూర్ ఎంతో గర్వపడేవారని నేను నమ్మకంగా, గర్వంగా చెప్పగలను.

నేడు ముద్ర రుణాల వల్ల ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు పారిశ్రామికవేత్తలుగా మారుతున్న తరుణంలో కర్పూరీ ఠాకూర్ కలలుగన్న ఆర్థిక స్వావలంబన కార్య రూపం దాలుస్తోంది. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను పొడిగించే అదృష్టం మా ప్రభుత్వానికే దక్కింది. కర్పూరీ ఠాకూర్ చూపిన మార్గంలో పని చేస్తున్న ఓబీసీ కమిషన్‌ను (దీనిని కాంగ్రెస్ వ్యతిరేకించింది) ఏర్పాటు చేసిన ఘనత కూడా మాకు దక్కింది. మా పీఎం–విశ్వకర్మ పథకం భారతదేశం అంతటా ఓబీసీ వర్గాలకు చెందిన కోట్లాది మందికి కొత్త అవకాశాలను అందుబాటులోకి తెచ్చింది.

వెనుకబడిన తరగతులకు చెందిన వ్యక్తిగా నేను కర్పూరీ ఠాకూర్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. దురదృష్టవశాత్తూ 64 ఏళ్ల వయసులోనే ఆయన మరణించారు. చాలా అవసరమైన సమయంలో మనకు దూరం అయ్యారు. అయినా ఆయన తన పని వల్ల కోట్లాది మంది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన నిజమైన ప్రజా నాయకుడు!

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అలా జరుగుతుందా?



'రాముడంటే నిప్పు కాదు, శక్తి. రాముడంటే వివాదం కాదు, పరిష్కారం. రాముడు కేవలం మావాడు కాదు, రాముడు అందరివాడు' అన్నారు మోదీ. రాజకీయాధికారానికీ, మత ఏకీకరణకూ ఆయుధంగా చేసుకోక... మంచికీ, సామరస్యానికీ ఆయన్ని వాడుకుంటేనే... రాముడికీ రాజ్యానికీ మధ్య వారధి నెలకొంటుంది.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఘన నాగరికత



తమ దేవుళ్ల కోసం ఘనమైన ఆలయాలు నిర్మించింది కేవలం హిందువులే కాదు... గ్రీకులు, రోమన్లు, ఈజిప్షియన్లు, మాయన్లు, ఇన్‌కాలు, అజ్‌టెక్కులు, అందరూ చేశారు. కానీ ఇక్కడిలాగే అవన్నీ దురాక్రమణల్లో ధ్వంసం అయ్యాయి. తేడా అల్లా మనం ఇప్పటికీ ఆలయాలు నిర్మిస్తున్నాం. వారి నాగరికతలు కేవలం మ్యూజియంలో ప్రదర్శనలుగా మాత్రమే ఉన్నాయి.

– శేఫాలీ వైద్య, జర్నలిస్ట్

ఎక్కడుంటే ఏంటి?



నేను అక్కడ నివసించడం లేదు కాబట్టి, యెమెన్ గురించి మాట్లాడకూడదని హౌతీలు నాకు చెబుతున్నారు. అంటే, ఇప్పుడు నేను అక్కడికి వెళ్లాలి... విమర్శించినందుకు వాళ్లు నన్ను తేరగా చంపేయొచ్చు– యెమెనీ మానవ హక్కుల కార్యకర్త ఫాతెమా అల్– అర్‌వలీకి వచ్చే నెల వాళ్లు మరణశిక్ష అమలుచేస్తున్నట్టు!

– లుయీ అహ్మద్, స్వీడన్ యాక్టివిస్ట్

ఎందుకు జోక్యం?



నిన్న (జనవరి 22) అస్సాంలో జరిగినట్టుగా, కొన్ని ఆహారాల మీద ఉన్నట్టుండి రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా నిషేధం పెట్టగలవు అన్నదాని మీద ఎవరైనా సుప్రీంకోర్టుకు వెళ్లాలి. అసలు ఆహారం మీద ప్రభుత్వాల పెత్తనం ఏమిటి?

– స్వాతీ చతుర్వేది, జర్నలిస్ట్

కంగ్రాట్స్ ఇండియా!



మొట్టమొదటి సారి హాంకాంగ్ స్టాక్‌మార్కెట్‌ను ఇండియా అధిగమించింది. ఇండియాకు శుభాభినందనలు! (ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద స్టాక్ మార్కెట్‌గా ఇండియా అవతరించింది.)

– హసన్ సజ్వానీ
యూఏఈ పారిశ్రామికవేత్త

ఇన్ బాక్స్

బొబ్బిలి విషాదం

18వ శతాబ్దికి చెందిన బొబ్బిలి సంస్థానాధీశులు రాజా గోపాలకృష్ణ రంగారావుకూ, విజయ నగర సంస్థానాధీశులు పూసపాటి పెద విజయ రామరాజుకూ మధ్య శత్రుత్వం ఉండేది. ఫ్రెంచి కమాండర్ ఇన్ ఛీఫ్ మార్క్ డి బుస్సీ సహాయంతో బొబ్బిలిపై పగ సాధించాలని పెద విజయరామరాజు భావించారు. బొబ్బిలి సంస్థానాధీశులకు ఫ్రెంచి వారితో సత్సంబంధాలు లేకపోవడం కూడా బొబ్బిలి యుద్ధానికి ఒక కారణం. 1757లో బుస్సీ నిజాం సంస్థానం నుండి బయల్దేరి మచిలీపట్నం మీదుగా రాజమండ్రి చేరుకుని, కోటిపల్లి వద్ద మకాం ఉన్నాడు. పాలెగాళ్ళను, జమీందార్లను, సంస్థానాధీశులను వచ్చి తనను కలవమని కబురు పంపాడు. బొబ్బిలి పాలకుడు రంగారావు తప్ప, విజయరామరాజుతో సహా అందరూ వచ్చి కలిశారు. విజయ రామరాజు దీన్ని అవకాశంగా తీసుకుని రంగారావుకు వ్యతిరేకంగా బుస్సీ వద్ద, అతడి దివాను హైదర్ జంగు వద్దా ఆరోపణలు చేశాడు. రంగారావును బొబ్బిలి నుండి వెళ్ళగొట్టి, తనకు స్వాధీనం చేస్తే, శిస్తు సక్రమంగా చెల్లిస్తానని బుస్సీకి చెప్పాడు. బొబ్బిలి వదలిపెట్టి పోవాలని రంగారావును బుస్సీ ఆదేశించాడు. రంగారావు దాన్ని అవమానంగా భావించాడు.

విజయరామరాజు తాను బుస్సీకి కట్టాల్సిన కప్పం పది లక్షలూ కట్టడంతో పాటూ మూడు లక్షల లంచం హైదర్ జంగుకు ఇచ్చి, బుస్సీకి బొబ్బిలిపై మనసు విరిచేందుకు సహకరించమని కోరాడు. కొంత కాలం తర్వాత బుస్సీ సైనికులు బొబ్బిలి మీదుగా వెళ్ళడానికి అనుమతులు తీసుకున్నారు. ఈ సందర్భంగా బొబ్బిలి వారితో జరిగిన పోరులో 30 మంది చనిపోయారు. అనేకమంది గాయపడ్డారు. దీనికి తోడు అనేక కుట్రల ఫలితంగా ఫ్రెంచ్, విజయరామరాజు–బొబ్బిలివారికీ యుద్ధం అనివార్యమయ్యింది. యుద్ధం చివర్లో ఓటమి తర్వాత స్త్రీలు, పిల్లలు శత్రువు చేతికి చిక్కి అవమానాల పాలు కాకూడదని రంగారావు కోట లోపల ఉన్న తమ నివాసాలకు నిప్పు పెట్టమన్నారు. మంటలకు తాళలేక బయటకు వచ్చే వారిని కత్తులతో పొడిచి చంపారు. బొబ్బిలి సైనికులందరూ నేలకొరిగాక ఫ్రెంచి సైన్యం కోటలోనికి ప్రవేశించింది. బతికి ఉన్న రంగారావు కుమారుణ్ణి బుస్సీ వద్దకు తీసుకువెళ్ళారు. బుస్సీ ఆ పిల్లవాడిని బొబ్బిలి వారసునిగా ప్రకటించాడు. రంగారావు తరఫున 'రాజాం' సంస్థానాధికారి తాండ్ర పాపారాయుడు విజయరామరాజుపై పగతీర్చుకుంటానని శపథం చేశాడు. యుద్ధం ముగిసిన మూడవ రోజు రాత్రి విజయరామరాజు శిబిరంలో ప్రవేశించి నిద్రిస్తున్న విజయరామరాజును బాకుతో పొడిచి చంపాడు. ఆ విధంగా బొబ్బిలి యుద్ధం అత్యంత విషాదాన్ని మిగిల్చింది.

– ర్యాలి ప్రసాద్, రచయిత | 94945 53425
(నేటితో బొబ్బిలి యుద్ధానికి 266 ఏళ్లు)

రాజ్యాంగ విలువలకు తిలోదకాలేనా?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

సుప్రసిద్ధ మహాకవి సి. నారాయణ రెడ్డి మూడు దశాబ్దాల నాడే కొందరు భావి పాలకులు దేశ రాజ్యాంగాన్ని పక్కకు తోసేసి, 'రాచరిక పాలన'ను అభిలషిస్తూ ప్రవర్తించే అవకాశాలు ఎలా ఉన్నాయో 'ప్రపంచ పదులు' కవిత ద్వారా పాఠకులకు అందించారు. 'నడమంత్రపు బుద్ధి దూకుడు' ఎలా ఉంటుందో ఆ కవితలో నిరూపించారు:

"గాలిలోన ఎగిరిపడే గడ్డిపరక ఊపిరెంత?
ఏటిలోన తుళ్లిపడే నీటి బుడగ ఉనికి ఎంత?
అబ్బో దశ పట్టిందని ఉబ్బిపోతె ఏం లాభం?
కడలిలోన మిడిసిపడే కప్పపిల్ల పాకుడెంత?
నడమంత్రపు సిరినేర్పిన దుడుకుబుద్ధి
దూకుడెంత?"

పాలకుల ఈ 'దుడుకు బుద్ధి' వల్ల దేశానికి రాబోతున్న అనర్థాల గురించి అడుగడుగునా నిశితమైన పరిశీలనలో ఉన్నారు భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్. పదవిని అధిష్ఠించిన రోజు నుంచీ దేశ ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు.

బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్ పాలకులు ఎత్తుకున్న 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' నినాదం దేశ ఫెడరల్ వ్యవస్థ స్వరూప, స్వభావాలకు విరుద్ధం. దేశంలో 'రాచరికం' ఉంది గాని 75 ఏళ్లలో దేశ ప్రజలు నిర్మించుకున్న సెక్యులర్ రాజ్యాంగ వ్యవస్థ లేదని వర్తమాన పరిస్థితులు చెబుతున్నాయి. కనుకనే కాలానికి లొంగిపోని కర్మయోగులు నేడు మేలుకోవలసి ఉంది. ఎందుకంటే:

"కలవరపడి వెనుతిరిగితే కాలం ఎగబడుతుంది
కదనుతొక్కితే కాలం భయపడుతుంది
కనురెప్పలు మూతపడితే కాలం జోకొడుతుంది
కంఠమెత్తి తిరగబడితే కాలం జేకొడుతుంది!"

కాబట్టి ప్రతిపాదిత 'ఒక దేశం, ఒక ఎన్నిక' విధానాన్ని బుద్ధిజీవులు అందరూ వ్యతిరేకించాలి. పటిష్ఠమైన ప్రజాస్వామ్య పునాదులను గౌరవించాలనీ,

రెండో మాట



ప్రస్తుత పాలకుల కనుసన్నలలోనే ఎదిగిన మాజీ రాష్ట్రపతి కోవింద్ అధ్యక్షతన 'ప్రజాస్వామ్య రక్షణ' పేరిట మరో 'తైనాతీ' కమిటీ ఏర్పాటు తగదనీ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. పాలకుల చేతిలో కోవింద్ కీలు బొమ్మగా వ్యవహరించరాదనీ ఆయన సలహా ఇచ్చారు. అసలు విచిత్రమేమంటే, కేంద్ర, రాష్ట్రాలకు కలిపి ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా దేశానికయ్యే అపారమైన ఖర్చును ఆదా చేయవచ్చునని కేంద్ర ఎన్నికల సంఘం సలహా ఇవ్వబోవడం! ఈ చర్య రాజ్యాంగాన్నీ, పార్లమెంటరీ వ్యవస్థనూ అవమానపరచడమే!

అంతేగాదు, మత విశ్వాసాలను కూడా రాజకీయ లబ్ధి కోసం బీజేపీ–ఆరెస్సెస్ పాలకులు వాడుకోవడం ఓటర్లను దగా చేయడమే! ఈ రాజకీయమే వేల ఏళ్ల నాటి బాబ్రీమసీదు కట్టడాన్ని బలవంతంగా కూల్చివేసి, దాని స్థానే రామమందిర నిర్మాణానికి కారణమయ్యింది.

నిజానికి సాధారణ ముస్లిం పౌరులు హిందువులకు ఎప్పుడూ వ్యతిరేకం కాదు. హిందువులు పవిత్రంగా భావించే రామాయణాన్ని స్థానిక 'అవధి' భాషలో రచించి ఖ్యాతి వహించిన తులసీదాస్‌ను హిందీలో రాయనందుకు శిక్షించడానికి ప్రయత్నం జరిగింది. ఆ సమయంలో ఆయననూ, ఆయన రామాయణాన్నీ ఓ స్థానిక ముస్లిం కాపాడాడు. ఈ వాస్తవాన్ని ఈ రోజుకీ గుర్తించ నిరాకరిస్తున్న ముఠా... మహాత్మాగాంధీ పేరిట కంటి తుడుపు ఉత్సవాలు చేస్తున్నారని గమనించాలి.

లాహోర్ కుట్ర కేసులో నిందితులుగా, ముద్దాయిలుగా ఉన్న భగత్‌సింగ్, సుఖదేవ్‌లు ఉరిశిక్షను ఎదుర్కొంటున్నప్పుడు భగత్‌సింగ్ ఒక సందర్భంలో మాట్లాడుతూ "తన కాలంలో మార్క్స్ కొత్త తరహాగా ఆలోచించబట్టే కాల చక్రాన్ని తన పద్ధతుల్లో త్వరిత గతిన ముందుకు నడిపించగలిగారు. అలాగే మన దేశంలో సామ్యవాద సిద్ధాంతాన్ని (సోషలిజం) నేను గాని, నువ్వు గాని (సుఖదేవ్‌తో సంభాషణ) ఆరంభించలేదు. నిజానికి కాలం, పరిస్థితులు కల్పించిన ప్రభావ ఫలితం అది. ఇంత కష్టమైన బాధ్యతను మనం చేపట్టినప్పుడు దాన్ని కొనసాగిస్తూ ముందుకు తీసుకుపోవాలే గాని కష్టాలు ఎదురయ్యాయని చెప్పి, ఆత్మహత్య చేసుకుంటే అది ప్రజలకు మార్గదర్శకం కాజాలదు." ఈ మాటలు భగత్‌సింగ్ ఏ సందర్భంలో అన్నాడు? ఉవ్వెత్తున ప్రజాందోళన వల్ల మన ఉరిశిక్షలు ఆగిపోయి, యావజ్జీవ కారాగార శిక్షగా మారిపోవచ్చు. కానీ, 14 ఏళ్లపాటు ద్వీపాంతరవాస శిక్ష అనుభవించాక మనం జీవచ్ఛవాలుగా మారిపోతాం. అలాంటప్పుడు బతకడం కన్నా ఆత్మహత్య చేసుకోవడం మేలు కదా... ఇలా ఆలోచిస్తూ సుఖదేవ్ తన అభిప్రాయాల్ని భగత్‌సింగ్‌కు ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరానికి జవాబుగా భగత్‌సింగ్ రాసిన ఆశావహమైన లేఖే 'కాలం అవసరం నుంచి పుట్టుకొచ్చిన వాళ్ళం' అన్న ప్రత్యుత్తరం.

కాగా, నేటి తరం పాలకులకు రాజ్యాంగ విలువలూ తెలియవు. కనుకనే పాలనా వ్యవస్థల నుంచి, విద్యా వ్యవస్థలు, ప్రజాస్వామ్య వ్యవస్థల దాకా ఇష్టం వచ్చినట్లు మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. అందుకే బహుశా, 'ఒడువని ముచ్చట' అనే కవితలో కందుకూరి అంజయ్య ఆవేదనను మనమూ పంచుకుందాం:

**శంకరా!
ఇప్పుడు మనుషులను
కూడగట్టే మానిసి లేడు
మంచి చెడ్డలను విప్పిచెప్పే
సాత్వికుడూ లేడు
అంతా...
వద్లూ – పెరుగూ కలిసినట్టుంది
ఈనగాస్తే నక్కలపాలయింది
అంతా మొదటికొచ్చింది
ఒడువని ముచ్చటై కూసుంది!!**

abkprasad2006@yahoo.co.in

క్లుప్తంగా...

నేడు కలెక్టర్లతో ధరణి కమిటీ భేటీ

రెవెన్యూ మంత్రి పొంగులేటిని కలిసిన కమిటీ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ పునర్నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ బుధవారం జిల్లాల కలెక్టర్లతో సమావేశం కానుంది. ఉదయం 10:30 గంటలకు సచివాలయంలో సిద్దిపేట, రంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల కలెక్టర్లతో కమిటీ సభ్యులు సమావేశం కానున్నారు. ధరణి పోర్టల్ ద్వారా వస్తున్న దరఖాస్తుల వివరాలు, వాటి పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలు, అనుభవాలపై కలెక్టర్లతో కమిటీ సభ్యులు చర్చించనున్నారు. కాగా, ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి, సునీల్ కుమార్‌లు మంగళవారం సచివాలయంలో రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీ పనితీరు గురించి వివరించారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ధరణి పోర్టల్‌పై సూచనలు, సలహాలను కమిటీ సభ్యులకు అందజేశారు.

రావి నారాయణరెడ్డి త్యాగాలు చిరస్మరణీయం

- కోమటిరెడ్డి, పొంగులేటితో కుటుంబ సభ్యుల భేటీ
- భువనగిరి కలెక్టరేట్‌కు రావి పేరు పెట్టాలని విన్నపం
- సానుకూలంగా స్పందించిన మంత్రులు



మంత్రులు కోమటిరెడ్డి, పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న ప్రతిభారెడ్డి దంపతులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సేనాని, నల్లగొండ తొలి లోక్‌సభ సభ్యుడు రావి నారాయణరెడ్డి త్యాగాలు, పోరాటాలు నేటి తరానికి తెలియచేసి ఆయన స్ఫూర్తిని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకువెళుతుందని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రావి నారాయణరెడ్డి మనుమరాలు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరుల స్మారక ట్రస్ట్ సభ్యురాలు రావి ప్రతిభారెడ్డి ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం మంగళవారం సచివాలయంలో మంత్రులతో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌కు రావి నారాయణరెడ్డి పేరు పెట్టాలని, ఏటా జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని, భువనగిరి, హైదరాబాద్‌లలో రావి విగ్రహాలను నెలకొల్పాలని, తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రులు స్పందిస్తూ సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి వీలైనంత త్వరగా రావి స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు.

'కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టండి'



మాట్లాడుతున్న అభ్యర్థులు

పంజగుట్ట (హైదరాబాద్): పంచాయతీరాజ్ శాఖలో ఎనిమిది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టి తమను ఆదుకోవాలని వివిధ జిల్లాలకు చెందిన జిల్లా పరిషత్ కారుణ్య నియామక అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అభ్యర్థులు మాట్లాడుతూ, తాము రాష్ట్రంలోని జిల్లా పరిషత్‌లలో కారుణ్య నియామకాల ద్వారా జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకోసం 2016లో దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం 2023 జూలై 20న జీవో 79తో ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసి, ఆ పోస్టుల నియామక బాధ్యతలు జిల్లా కలెక్టర్లకు అప్పగించిందన్నారు. పంచాయతీరాజ్ శాఖలోని ఇతర శాఖల్లో అందరికీ ఉద్యోగాలు ఇచ్చారని కేవలం జిల్లా పరిషత్ డిపార్ట్‌మెంట్ వారికి మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 79 ద్వారా ఇతర శాఖల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఎలా ఇచ్చారో జిల్లా పరిషత్ డిపార్ట్‌మెంట్ కారుణ్య నియామక అభ్యర్థులకు కూడా వెంటనే ఉద్యోగాలు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ బిల్లులను చెల్లించాలి: టీఎస్‌జీఆర్‌ఈఏ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులను సకాలంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టీఎస్‌జీఆర్‌ఈఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందించారు. ప్రతి నెలా ఒకటిన పెన్షన్ చెల్లించాలని, రిటైర్డ్ ఉద్యోగుల మూల పెన్షన్ నుంచి 1 శాతం సొమ్మును మినహాయించి వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

- 12.3 లక్షల మంది పరీక్షకు
- బయోమెట్రిక్ తప్పనిసరి
- బీఆర్క్‌కు అడ్మిట్ కార్డులు జారీ
- ఫిబ్రవరి 12న ఫలితాలు
- నిమిషం ఆలస్యమైనా పరీక్షకు నో చాన్స్



సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశపరీక్ష జేఈఈ మెయిన్స్–2024 తొలి విడత దేశవ్యాప్తంగా బుధవారం నుంచి మొదలవుతుంది. జాతీయ స్థాయిలో ఈ పరీక్షకు 12.3 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తెలిపింది. పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేశామని, ఇప్పటికే అడ్మిట్ కార్డులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొంది. తొలి మూడు రోజులు బీఆర్క్ (పేపర్–1) నిర్వహిస్తారు. తర్వాత రోజుల్లో ఇంజనీరింగ్ విభాగానికి పరీక్ష ఉంటుంది. ఈసారి పరీక్ష కేంద్రాల వివరాలను ముందే వెల్లడించారు. దీంతో విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకుంటే బాగుంటుందని ఎన్‌టీఏ సూచించింది. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఒక సెషన్, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు మరో సెషన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష చేపడుతున్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రానికి అనుమతించరు. ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అనుసరిస్తున్నారు. మధ్యలో బయటకు వెళ్లి వచ్చినా ఇది తప్పనిసరి. విద్యార్థులు ముందే డిజి లాకర్‌లో రిజిస్టర్ అవ్వాలి. ఈ సందర్భంగా ఎన్‌టీఏ విద్యార్థుల కోసం కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది.

అభ్యర్థులు గుర్తుంచుకోవాల్సిన అంశాలు

- ఎ–4 సైజులో అడ్మిట్ కార్డును కలర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. అప్లికేషన్‌లో అంటించిన పాస్‌పోర్టు ఫొటో ఒకటి పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లాలి. పాన్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, రేషన్ కార్డు, ఆధార్, గుర్తింపు పొందిన విద్యాసంస్థలు జారీ చేసిన గుర్తింపు కార్డుతో పరీక్ష కేంద్రానికి వెళ్లాలి. గుర్తింపు కార్డు లేకుంటే కేంద్రంలోకి అనుమతించరు. దివ్యాంగులు విధిగా సంబంధిత అధికారి జారీ చేసిన పత్రాలను వెంట తెచ్చుకోవాలి. వీరికి అదనంగా 20 నిమిషాలు పరీక్ష రాసేందుకు కేటాయిస్తారు.
- మీడియం, సబ్జెక్టుతో కూడిన ప్రశ్నపత్రంలో తప్పులుంటే తక్షణమే ఇన్విజిలేటర్ దృష్టికి తేవాలి. బీఆర్క్ పరీక్ష రాసే వారు అవసరమైన జామెట్రీ బాక్స్, పెన్సిల్స్, ఎరేజర్, కలర్ పెన్సిల్స్, క్రెయాన్స్‌ను సొంతంగా సమకూర్చుకోవాలి.
- ఎలాంటి టెక్స్ట్ మెటీరియల్, పెన్సిల్స్‌ను భద్రపరిచే బాక్సులు, హ్యాండ్‌బ్యాగ్, పర్సు, తెల్ల పేపర్లు అనుమతించరు. సెల్‌ఫోన్లు, మైక్రో ఫోన్లు, ఇయర్ ఫోన్లు, క్యాలిక్యులేటర్, వాచీలను హాళ్లలోకి తీసుకెళ్లే వీల్లేదు. పరీక్ష గదిలో అవసరమైన తెల్ల పేపర్‌ను కేంద్రం నిర్వాహకులే అందజేస్తారు. దీనిపై అభ్యర్థి రోల్ నంబర్ వేయాలి. పరీక్ష పూర్తయిన తర్వాత దీన్ని చెత్త బుట్టలో పడేయాల్సి ఉంటుంది. డయాబెటిక్ సహా అత్యవసర వైద్యానికి వాడే మందులను వెంట తెచ్చుకొనేందుకు మాత్రం అనుమతి ఉంది.

హైదరాబాద్‌లో కాస్మొటిక్ మాన్యుఫాక్చరింగ్ హబ్

- ముందుకొచ్చిన దక్షిణ కొరియా సంస్థ దూసన్: మంత్రి కోమటిరెడ్డి
- రూ. 5 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుందని వెల్లడి
- సచివాలయంలో మంత్రితో దూసన్ ప్రతినిధుల భేటీ
- ప్రతిపాదనలపై విజువల్ ప్రజెంటేషన్.. డీపీఆర్ అందజేత



సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డితో దూసన్ ప్రతినిధుల బృందం

సాక్షి, హైదరాబాద్: దక్షిణ కొరియాకు చెందిన ప్రఖ్యాత కాస్మొటిక్ తయారీ సంస్థ దూసన్ హైదరాబాద్‌లో కాస్మొటిక్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినట్టు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. దేశంలోనే తొలి కాస్మొటిక్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌ను దాదాపు రూ. 5 వేల కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన ఆ సంస్థకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో దూసన్ ప్రతినిధులు సమావేశమై తమ పెట్టుబడుల గురించి ప్రభుత్వానికి సవివరమైన నివేదిక (డీపీఆర్)ను అందజేశారు. తాము కల్పించే ఉద్యోగాలు, పెట్టుబడుల ద్వారా స్థానికులకు కలిగే ప్రయోజనాల గురించి మంత్రికి విజువల్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తమ సంస్థ చైనా, వియత్నాం, కంబోడియా తదితర దేశాల్లో 46 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టిందని, తమ ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు అవసరమైన అనుమతులు, కంపెనీ ఏర్పాటుకు భూకేటాయింపులు, రాయితీల గురించి మంత్రితో దూసన్ ప్రతినిధులు చర్చించారు.

వేల మందికి ఉపాధి కల్పిస్తాం: దూసన్ ప్రతినిధి

తమ సంస్థ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే కాస్మొటిక్ హబ్ ద్వారా ప్రత్యక్షంగా దాదాపు 3 వేల మందికి... పరోక్షంగా మరో 4 వేల మందికి ఉపాధి కల్పిస్తామని దూసన్ ప్రతినిధి మూన్ కీ జూ తెలిపారు. ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ (ఓఈఎం), ఒరిజినల్ డిజైన్ మాన్యుఫాక్చరర్స్ (ఓడీఎం) పద్ధతిలో తమ సంస్థ కార్యకలాపాలు ఉంటాయన్నారు. సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కలను ఉత్పత్తి చేసే రైతుల నుంచే కొనుగోళ్లు చేస్తామని... తద్వారా స్థానిక రైతులు, ఉత్పత్తిదారులకు మరింత ఉపాధి పెరుగుతుందని మంత్రికి వివరించారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన వివిధ ఉత్పత్తులను స్థానికంగా వ్యాపారం చేయడంతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేస్తామని తెలియజేశారు.

అనుమతుల మంజూరుకు మంత్రి హామీ

దేశంలోకెల్లా తెలంగాణ సులభతర వాణిజ్యంలో మొదటిస్థానంలో ఉందని, పరిశ్రమలకు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులను మంజూరు చేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వారికి తెలియజేశారు. దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాయని, హైదరాబాద్ పారిశ్రామిక వాతావరణం, పారిశ్రామిక విధానం ఇతర దేశాలు, వ్యాపార సంస్థలకు స్వర్గధామంగా ఉందని దూసన్ ప్రతినిధులకు వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో సమావేశం ఏర్పాటు చేసి కంపెనీ ఏర్పాటు చేయడానికి కావల్సిన అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

హైదరాబాద్‌లో ఏసీఈ ల్యాబ్ ఫోరెన్సిక్ సెంటర్

ముందుకు వచ్చిన రష్యా సంస్థ.. ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో సంస్థ ప్రతినిధుల భేటీ



మంత్రి శ్రీధర్‌బాబుతో ఏసీఈ ల్యాబ్ ప్రతినిధుల బృందం

సాక్షి, హైదరాబాద్: డిజిటల్ ఫోరెన్సిక్, డేటా రికవరీలో పేరొందిన రష్యా సంస్థ 'ఏసీఈ ల్యాబ్' మరో కంపెనీ 'జూమ్ టెక్నాలజీస్'తో కలిసి హైదరాబాద్‌లో ఫోరెన్సిక్ సెంటర్, మాన్యుఫాక్చరింగ్ హబ్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. మంగళవారం ఏసీఈ ల్యాబ్ సీఈవో మ్యాక్స్ పుతివ్ సేవ్, జూమ్ టెక్నాలజీస్ సీఈవోతోపాటు ఆయా సంస్థల ప్రతినిధులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. సంబంధిత ప్రతిపాదనలు, ప్రభుత్వపరంగా అందించాల్సిన సహాయ సహకారాల గురించి వివరించారు. 129 దేశాల్లో తమ సంస్థ కార్యకలాపాలు ఉన్నాయని, సైబర్ సెక్యూరిటీ రంగంలో ఆయా దేశాల దర్యాప్తు సంస్థలతో కలిసి పనిచేస్తున్న అనుభవం తమకు ఉందని వివరించారు. డేటాలాస్, డిజిటల్ ఇన్వెస్టిగేషన్ సవాళ్లను అధిగమించడానికి భారతీయ వ్యాపారాలు, బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు, దర్యాప్తు సంస్థలకు సహకరిస్తామని పేర్కొన్నారు. తెలంగాణలో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ డేటా సెంటర్ ఏర్పాటు కోసం ముందుకు రావడంపట్ల మంత్రి శ్రీధర్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. కాగా 'టిబెటన్ పార్లమెంట్ ఇన్ ఎక్సైల్' ప్రతినిధులు మంగళవారం శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. టిబెట్‌కు సార్వభౌమాధికారాన్ని కల్పించేందుకు భారత ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతినిధి బృందంలో మాంక్ గేశే అతుక్ సెతాన్, ఎంపీ సెరింగ్ యంఫ్హెల్, దొండప్ తాషి తదితరులు ఉన్నారు.

బయో ఆసియా 2024లో 'ఫ్లాండర్స్' భాగస్వామ్యం

ఆసియాలోనే జీవ శాస్త్ర, ఆరోగ్య సాంకేతిక రంగాల వేదికగా పనిచేస్తున్న 'బయో ఆసియా' 21వ వార్షిక సదస్సుకు బెల్జియంలో లైఫ్‌సైన్సెస్, ఆరోగ్య రంగాలకు కేంద్రంగా ఉన్న ఫ్లాండర్స్ రీజియన్ భాగస్వామ్యం వహించనుంది. త్వరలో హైదరాబాద్ వేదికగా జరిగే 'బయో ఆసియా–2024'లో ఫ్లాండర్స్ రీజియన్ భాగస్వామ్యంపై మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం కీలక ప్రకటన చేశారు. లైఫ్‌సైన్సెస్ పరిశ్రమకు కేంద్రంగా ఉన్న తెలంగాణలో ఫార్మా, బయో టెక్నాలజీ, వైద్య పరిశోధన రంగాల వృద్ధికి అనువైన వాతావరణం ఉందని శ్రీధర్‌బాబు అన్నారు. శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలో ఘనమైన చరిత్ర కలిగిన ఫ్లాండర్స్ రీజియన్ బయో ఆసియాలో భాగస్వామ్యం వహించడం ఇరు ప్రాంతాల నడుమ పరిశోధన ఫలాల మార్పిడికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. భాగస్వామ్య పెట్టుబడులు, జాయింట్ వెంచర్లు, పరిశోధన, అభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు ఈ భాగస్వామ్యం దోహదం చేస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. ప్రస్తుత భాగస్వామ్యం ద్వారా వాణిజ్యవేత్తలు, పరిశోధకులు, విధాన నిర్ణేతలు ఒకే వేదికపైకి వచ్చి ఇరు ప్రాంతాల నడుమ భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలపై చర్చిస్తారని ఫ్లాండర్స్ తరపున దక్షిణ భారతదేశంలో పెట్టుబడులు, వాణిజ్య వ్యవహారాల పర్యవేక్షకులు జయంత్ నాడిగర్ వెల్లడించారు.

ఆన్ డ్యూటీ ఇవ్వండి..

- ప్రభుత్వంపై ఉపాధ్యాయ సంఘాల నేతల ఒత్తిడి

సాక్షి, హైదరాబాద్ : ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆన్‌డ్యూటీ (ఓడీ) కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. ఆయా సంఘాల నేతలు వేర్వేరుగా ప్రభుత్వ పెద్దలను కలిసి ఓడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తొమ్మిది సంఘాలు ఓడీ కోసం వినతి పత్రాలు ఇచ్చాయి. సాధారణంగా సంఘ కార్యకలాపాలు నిర్వహిస్తున్న గుర్తింపు సంఘాల్లోని ఇద్దరి చొప్పున ఓడీ ఇస్తుంటారు. 2022లో ఏకంగా 12 సంఘాలకు ఓడీ దక్కింది. అయితే దీని కాలపరిమితి అదే ఏడాది డిసెంబర్‌తో ముగిసింది. తిరిగి ఓడీ ఇవ్వాలని పట్టుబట్టినా కేవలం ఒకే ఒక సంఘమే ఓడీని దక్కించుకుంది. అయితే గుర్తింపు ఉన్న అన్ని సంఘాలకు ఓడీ ఇవ్వాల్సిందేనని కోరుతున్నాయి. గతంలో ఎవరికి ఓడీ ఇచ్చారు? ఇప్పుడు ఎవరికి ఇవ్వాల్సిన అర్హత ఉంది వంటి వివరాలతో నివేదిక ఇవ్వాలని విద్యాశాఖను సీఎం ఆదేశించారు.

కలిసి పనిచేద్దాం!

- ఎన్టీపీసీతో జత కట్టనున్న సింగరేణి.. బొగ్గు ఉత్పత్తిలో సింగరేణిది వందేళ్ల చరిత్ర
- ఎన్టీపీసీ బ్లాక్‌లలో మైనింగ్‌కు సింగరేణి అడుగులు
- రెండు సంస్థల మధ్య చర్చలు ప్రారంభం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ రంగ సంస్థలైన సింగరేణి, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) సంస్థలు బొగ్గు ఉత్పత్తి రంగంలో కలిసి అడుగులు వేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు ఇరు సంస్థల మధ్య సంప్రదింపులు జరుగుతున్నాయి. ఈ చర్చలు సఫలమైతే రాబోయే రోజుల్లో రెండు సంస్థలు కలిసి పనిచేసే అవకాశం ఉంది.

కోల్‌మైన్స్ విభాగం ఏర్పాటు..

సింగరేణి సంస్థ వందేళ్లకు పైగా బొగ్గు ఉత్పత్తి రంగంలో ఉంది. దక్షిణ భారతదేశంలో పారిశ్రామిక, విద్యుత్‌రంగ అవసరాలను సింగరేణి తీరుస్తోంది. కాగా పదేళ్ల కిందట సింగరేణి సంస్థ ప్రయోగాత్మకంగా బొగ్గు ఉత్పత్తితో పాటు థర్మల్ పవర్ విభాగంలోకి కూడా అడుగు పెట్టింది. మరోవైపు దేశంలో విద్యుత్ రంగంలో ఎన్టీపీసీ అగ్రగామిగా ఉంది. 1975 నుంచి పనిచేస్తున్న ఈ సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 22 థర్మల్ పవర్ స్టేషన్లు ఉన్నాయి. అయితే గత కొన్నేళ్లుగా బొగ్గు బ్లాకులను ప్రభుత్వరంగ సంస్థలకే కట్టబెట్టకుండా కేంద్రం వేలం వేస్తోంది. ఈ విధానంలో ఇప్పటికే దేశవ్యాప్తంగా ఎన్టీపీసీకి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఏడు బొగ్గు బ్లాకులు దక్కాయి. బొగ్గు ఉత్పత్తికి ఎన్టీపీసీ కోల్‌మైన్స్ అనే విభాగాన్ని నెలకొల్పింది. సింగరేణి సైతం తెలంగాణ సరిహద్దులు దాటి ఒడిశాలోని నైనీ, మహాపాత్ర దగ్గర బొగ్గు బ్లాక్‌లను దక్కించుకుంది.

చర్చల దశలో..

దేశవ్యాప్తంగా థర్మల్ పవర్‌కు డిమాండ్ పెరుగుతోంది. అయితే నాలుగేళ్ల నుంచి ఎన్టీపీసీ బొగ్గు ఉత్పత్తి రంగంలో ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో కోల్ మైనింగ్ చేయలేకపోతోంది. దీంతో బొగ్గు ఉత్పత్తి రంగంలో అపార అనుభవం ఉన్న సింగరేణితో చేతులు కలిపే అంశాన్ని ఎన్టీపీసీ పరిశీలిస్తోంది. మరోవైపు బొగ్గు ఉత్పత్తితో మొదలైన సింగరేణి, ఇప్పుడు సోలార్, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో దూసుకుపోతోంది. దీంతో సింగరేణి సైతం ఎన్టీపీసీతో కలిసి పని చేసేందుకు సుముఖంగానే ఉంది. ఈ మేరకు ఎలా కలిసి పని చేయాలనే అంశంపై ఇరు సంస్థల మధ్య ప్రాథమిక స్థాయిలో చర్చలు మొదలయ్యాయి. రాబోయే రోజుల్లో ఈ అంశంపై మరింత స్పష్టత రానుంది.

అవగాహన లేమితోనే రోడ్డు ప్రమాదాలు

- 2022లో 7500 మంది మృత్యువాత
- రోడ్డు భద్రత మాసం సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ రవిగుప్తా



మాట్లాడుతున్న డీజీపీ రవిగుప్తా

సాక్షి, హైదరాబాద్: వాహనదారుల్లో అవగాహన లేమితోనే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అవగాహన పెంచే కార్యక్రమాలపై అధికారులు దృష్టి పెట్టాలని డీజీపీ రవిగుప్తా సూచించారు. రోడ్డు ప్రమాదంలో ఎక్కువగా యువత చనిపోతున్నందున ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎడ్యుకేషన్, ఎమర్జెన్సీ, రోడ్ ఇంజనీరింగ్ వ్యూహాలతో రోడ్డు ప్రమాదాలను నియంత్రించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. జనవరి 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు రోడ్డు భద్రత మాసంగా కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ ప్రకటించిన నేపథ్యంలో రోడ్డు భద్రత మాసం నిర్వహణపై రవిగుప్తా మంగళవారం డీజీపీ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు ఇచ్చారు. ఈ కాన్ఫరెన్స్‌లో రవాణాశాఖ కమిషనర్ బుద్ధ ప్రకాష్, రోడ్డు భద్రత, రైల్వేల విభాగపు అడిషనల్ డీజీపీ మహేష్‌భగవత్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డీఐజీ రంగనాథ్, రోడ్ సేఫ్టీ ఎస్పీ సందీప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ 2022లో తెలంగాణలో 7,500 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోగా, దేశవ్యాప్తంగా 1,68,000 మంది మృత్యువాత పడినట్టు గణాంకాలు చెబుతున్నాయన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం, ఓవర్ స్పీడ్, డేంజరస్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం తదితర కారణాలతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఈ ఉల్లంఘనలపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. రహదారులు ఉండే ప్రాంతాల్లో రోడ్ సేఫ్టీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని, పోలీస్ కార్యాలయంలో డిస్ట్రిక్ రోడ్ సేఫ్టీ బ్యూరో, కమిషనరేట్ రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అవసరమైతే ఈ–చలాన్ నిధుల ద్వారా స్పీడ్‌గన్స్ బ్రీత్ అనలైజర్స్ కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడే వారికి 'గుడ్ సమారిటన్' పేరిట సన్మానం చేయాలని డీజీపీ అన్నారు. ఈ చర్యలు ఈ నెలకే పరిమితం కాకుండా దీర్ఘకాలంలోనూ అనుసరించాలని పోలీసు అధికారులకు డీజీపీ రవిగుప్తా స్పష్టం చేశారు.

'అవిశ్వాసం'పై మీ వాదనేంటో చెప్పండి?

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీల్లో చైర్మన్ల అవిశ్వాసంపై వాదనలేంటో చెప్పాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కమిషనర్‌తో పాటు సంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి భువనగిరి, జనగాం జిల్లాల కలెక్టర్లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను 29కి వాయిదా వేసింది. అవిశ్వాసాలకు సంబంధించి ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ పలు మున్సిపాలిటీలకు చెందిన చైర్మన్లు, వైస్ చైర్మన్లు హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. అవిశ్వాస ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరారు. వీటిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. పిటిషన్లను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్ జయమ్మ, జోగిపేట్ చైర్‌పర్సన్ మల్లయ్య, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కావ్య, ఆలేర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ శంకరయ్య రిట్ అప్పీల్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు వివేక్‌రెడ్డి, మయూర్‌రెడ్డి వాదనలు వినిపించారు. తెలంగాణ మున్సిపాలిటీ చట్టం – 2019 సెక్షన్ 37 ప్రకారం పిటిషనర్లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం లేదన్నారు. అవిశ్వాస నోటీసులను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

బీసీలకు 'ప్రత్యేక అభివృద్ధి' నిధులు కేటాయించాలి

డిప్యూటీ సీఎంను కోరిన జాజుల బృందం



భట్టికి వినతిపత్రం ఇస్తున్న జాజుల బృందం

సాక్షి, హైదరాబాద్: జనాభా దామాషా ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు 'ప్రత్యేక అభివృద్ధి' నిధులు కేటాయించాలని, బీసీలకు ఏ పథకానికి ఎంత ఖర్చు చేయాలనే దానిపై బీసీ సంక్షేమ శాఖకే పూర్తి అధికారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ బృందం కలిసి వినతి పత్రం సమర్పించింది. అనంతరం విలేకరులతో జాజుల మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ పేరుతో రూ. 30 వేల కోట్లు కేటాయించాలని కోరారు. బీసీ, ఎంబీసీ కార్పొరేషన్‌లకు పాలక మండళ్లు నియమించాలని, రూ. 2 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి బీసీల స్వయం ఉపాధికి 100 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని వివరించారు. బీసీ కులాల ఫెడరేషన్లను 'ఫైనాన్స్ కో ఆపరేటివ్' బ్యాంక్‌లుగా మార్చాలని, ఫెడరేషన్లు లేని కులాలకు తక్షణమే ఫెడరేషన్లు ఏర్పాటు చేయాలన్నారు.

ఆ దివ్య దరహాసం వెనుక..

బాలరాముని రూపకల్పనకు శిల్పి అరుణ్ తపస్సు • స్కూళ్లకు వెళ్లి బాలల ముఖ కవళికల అధ్యయనం • శిల్పశాస్త్ర పరిజ్ఞానమంతా రంగరించిన వైనం

రెండు రోజులుగా దేశమంతా ఎటు చూసినా బాలరాముడే. ఎక్కడ విన్నా అతన్ని గురించిన చర్చే. సోషల్ మీడియాలోనూ అయోధ్యలో కొలువుదీరిన రామ్ లల్లా ముచ్చట్లే. అతని ఫొటోలే. అందరినీ అమితంగా ఆకట్టుకుంటున్నది బాలరాముని మందస్మిత వదనం. సమ్మోహనమైన ఆ నవ్వుకు సెలబ్రిటీలు మొదలుకుని సామాన్యుల దాకా అందరూ ముగ్ధులవుతున్నారు. అమితమైన కరుణతోపాటు అంతులేని దివ్యత్వాన్ని వర్షిస్తున్న ఆ కళ్లు నిజంగా అద్భుతమంటూ కొనియాడుతున్నారు. అదే సమయంలో బాలలకు సహజమైన అమాయకత్వంతో చూస్తున్న ఆ నయనాల సొగసు వర్ణనాతీతమని ముక్త కంఠంతో చెప్తున్నారందరూ. బాలరాముని కళ్లను అంత అందంగా తీర్చిదిద్దినందుకు మైసూరుకు చెందిన ప్రఖ్యాత శిల్పి అరుణ్ యోగిరాజ్ ప్రతిభను ఎంత పొడిగినా తక్కువేనంటున్నారు. విగ్రహ రూపకల్పనకు, ముఖ్యంగా కళ్లను అంతలా తీర్చిదిద్దేందుకు ఆయన అక్షరాలా తపస్సే చేశారు. చిన్నపిల్లల ముఖ కవళికలను దగ్గరగా ఒడిసిపట్టేందుకు ఎన్నోసార్లు స్కూళ్లకు వెళ్లారు. శిల్పశాస్త్రాన్ని ఆమూలాగ్రం పదేపదే అధ్యయనం చేశారు. అరుణ్ దీక్ష, శ్రమ, పట్టుదలకు రాముని కరుణ తోడైందని భార్య విజేత చెబుతున్నారు. విగ్రహ రూపకల్పనకు అనువైన కృష్ణ శిలను ఎంచుకోవడం వంటివాటి వెనక దాగున్న సాంకేతికత మొదలుకుని దాన్ని అత్యంత అందంగా చెక్కేదాకా ప్రతి దశలోనూ అరుణ్ ఎదుర్కొన్న సవాళ్లు తదితరాలను ఆమె మీడియాతో వివరంగా పంచుకున్నారు.

శాస్త్ర ప్రమాణాల మేరకు...

విగ్రహ తయారీలో అరుణ్ పూర్తిగా శిల్ప శాస్త్ర ప్రమాణాలను అనుసరించారు. ఆ మేరకే బాల రాముని ముఖారవిందపు స్వరూప స్వభావాలను ఖరారు చేశారు. ముఖ్యంగా కళ్లు, ముక్కు, చుబుకం, పెదాలు, చెంపల నిష్పత్తి తదితరాలను శాస్త్రంలో నిర్దేశించిన మేరకు నిర్ణయించారు. ''అరుణ్ చేతిలో నిజంగా అద్భుతమైన కళ దాగుంది. విగ్రహం ఎలా ఉండాలో రామ జన్మభూమి ట్రస్టు ప్రతినిధులు క్లుప్తంగా చెప్పారు. నవ్వుతున్న ముఖం, దివ్యత్వం, ఐదేళ్ల స్వరూపం, రాకుమారుని రాజసం... ఇవీ అరుణ్‌తో పాటు మరో ఇద్దరు శిల్పులు జీఎల్‌భట్, సత్యనారాయణ పాండేకు వాళ్లు నిర్దేశించిన ప్రాతిపదికలు. అవి మినహా మిగతాదంతా అరుణ్ ఊహ, భావుకతల ఫలమే. ఇందుకోసం చిన్నపిల్లల స్కూళ్లకు వెళ్లి గంటల కొద్దీ గడిపాడు. వాళ్ల ముఖ కవళికలు, అవి పలికించే భావాలను లోతుగా పరిశీలించాడు. వాటిని పేపర్‌పై ఎప్పటికప్పుడు స్కెచ్‌లుగా గీసుకున్నాడు. అవయవాల పొందిక నిమిత్తం శరీర నిర్మాణ శాస్త్ర పుస్తకాలు తిరగేశాడు. అందుకే విగ్రహం అంత వాస్తవికంగానూ, అదే సమయంలో ఎంతో ముగ్ధ మనోహరంగానూ రూపుదిద్దుకుంది'' అని విజేత వివరించారు. ''అరుణ్ నిజంగా అత్యంత అదృష్టశాలి. మా ఆయనతో రాముడే ఇంతటి మహత్కార్యం చేయించుకున్నాడు'' అంటూ మురిసిపోయారు.


శిల్పి అరుణ్ యోగిరాజ్


అరుణ్ భార్య విజేత

గుండ్రని ముఖమండలం...

ఉత్తరాది సంప్రదాయంలో రూపొందే శిల్పాల ముఖం, ముఖ లక్షణాలు కాస్త కొనదేరి ఉంటాయి. అయోధ్య బాలరాముని ముఖమండలం గుండ్రని రూపుతో కనువిందు చేస్తోంది. ఇది దక్షిణాదిలో శిల్పాల రూపకల్పనలో ఎక్కువగా కన్పిస్తుందని ఢిల్లీలోని ప్రముఖ చరిత్రకారుడు, రచయిత విక్రం సంపత్ అన్నారు. ''కానీ కాస్త చక్కని చుబుకం, ఉబ్బెత్తు చెంపలు, బుల్లి పెదాలు, వాటిపైనే గాక ముఖమంతటా పరుచుకున్న మార్మిక మందహాసం ... ఇలాంటి దివ్య లక్షణాలన్నీ బాలరాముని ముఖంలో ప్రస్ఫుటమవుతున్న తీరు మాత్రం నిజంగా అద్భుతమేనని చెప్పారాయన. ఈ విషయంలో శిల్పిగా అరుణ్ పనితనాన్ని ఎంత పొగిడినా తక్కువేనన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

51 అంగుళాల వెనక...

రామ్ లల్లా విగ్రహం ఎత్తును 51 అంగుళాలుగా నిర్ణయించడం వెనక కూడా శాస్త్రీయ కారణాలున్నట్టు విజేత చెప్పారు. ''ఏటా రామనవమి రోజున సూర్య కిరణాలు సరిగ్గా బాల రాముని నుదిటిపై పడాలన్నది ట్రస్టు నిర్ణయం. ఆలయ నిర్మాణం తదితరాల దృష్ట్యా విగ్రహం సరిగ్గా 51 అంగుళాల ఎత్తుంటేనే అది సాధ్యం'' అన్నారు. అవసరమైన మేరకు పలు విషయాల్లో పలురకాల సాఫ్ట్‌వేర్ల సాయమూ తీసుకున్నా అంతిమంగా కేవలం సుత్తి, ఉలి ఉపయోగించి విగ్రహాన్ని ఆసాంతం అరుణ్ తన చేతులతోనే చెక్కారని వివరించారు.


బాలరాముని మందస్మిత వదనం

కృష్ణ శిలే ఎందుకు?

విగ్రహ రూపకల్పనకు కృష్ణ శిలనే ఎంచుకోవడం వెనక శాస్త్రీయ కారణాలున్నాయి. ఆమ్లాలతో ఈ శిల ప్రతి చర్య జరపదు. వేడి, తీవ్ర వాతావరణ చర్యలకు కూడా స్పందించదు. ''కనుక పాలు తదితరాలతో అభిషేకం చేసినప్పుడు వాటితో చర్య జరపదు. దాంతో రెండు లాభాలు. వాటిని ప్రసాదంగా తీసుకున్నా ఆరోగ్యంపై ఎలాంటి దుష్ప్రభావమూ ఉండదు. ఈ లక్షణం వల్ల విగ్రహం కనీసం వెయ్యేళ్ల దాకా చెక్కుచెదరదు. దానిపై కనీసం గీత కూడా పడదు'' అని విజేత వివరించారు. అత్యున్నత నాణ్యతతో కూడిన కృష్ణ శిలలు కొన్నిచోట్ల మాత్రమే దొరుకుతాయి. బాలరామున్ని రూపొందించేందుకు వాడిన కృష్ణ శిల ఆ కోవలోదేనని విజేత చెప్పారు. ఇది మైసూరు సమీపంలోని హెచ్‌డీ కోటె దగ్గర లభ్యమైంది.

మూడు కూనలకు జన్మనిచ్చిన చీతా

భోపాల్/న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కు(కేఎన్‌పీ)లో జ్వాల అనే చీతా ఈ నెల 20న మూడు కూనలకు జన్మనిచ్చింది. గత ఏడాది మార్చిలో కూడా జ్వాలకు మూడు కూనలు పుట్టాయి. అయితే, వీటిలో ఒకటి మాత్రమే బతికింది. జనవరి 3వ తేదీన ఆషా అనే చీతా కూడా మూడు కూనలకు జన్మనిచ్చిన విషయాన్ని కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ మంగళవారం 'ఎక్స్'లో గుర్తు చేశారు. దీంతో, కేఎన్‌పీలో ఉన్న మొత్తం కూనలు ఏడుకు చేరాయని చెప్పారు. అదేవిధంగా, 2023 మార్చి నుంచి ఇప్పటి వరకు వివిధ కారణాలతో మూడు కూనలు సహా మొత్తం 10 చీతాలు చనిపోయాయని కూడా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కేఎన్‌పీ ఏడు కూనలు, ఆరు మగ, ఏడు ఆడ చీతాలు కలిపి మొత్తం 20 ఉన్నాయన్నారు. దేశంలో అంతరించిపోయిన చీతాల సంఖ్యను పెంచేందుకు కేంద్రం 2022, 2023 సంవత్సరాల్లో నమీబియా, దక్షిణాఫ్రికాల నుంచి 20 చీతాలను తీసుకువచ్చిన విషయం తెలిసిందే.

పార్లమెంట్ భద్రత విధుల్లో సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది


న్యూఢిల్లీ: పార్లమెంట్ భవన సముదాయం భద్రత కోసం కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్‌ఎఫ్)నకు చెందిన 140 మంది సిబ్బందిని మోహరించారు. ఈ నెల 31వ తేదీ నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. గత డిసెంబర్ 13వ తేదీన పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో అయిదుగురు వ్యక్తులు లోపలికి ప్రవేశించి ఎంపీలపైకి రంగుల పొగను వదిలిన ఘటన కలకలం రేపిన నేపథ్యంలో కేంద్ర హోం శాఖ ఈ మేరకు చర్యలు తీసుకుంది. సోమవారం సీఐఎస్‌ఎఫ్‌కు చెందిన 140 సిబ్బంది పార్లమెంట్ సముదాయం భద్రతా విధుల్లో చేరారు. వీరికి అసిస్టెంట్ కమాండెంట్ స్థాయి అధికారి సారథ్యం వహిస్తున్నారు. ఇందులో అగ్నిమాపక విభాగానికి చెందిన 36 మంది సిబ్బంది కూడా ఉన్నారు. వీరంతా ఎక్స్ రే యంత్రాలు, డిటెక్టర్లతో సందర్శకుల షూలు, భారీ జాకెట్లు, బెల్టులను స్కాన్ చేయనున్నారు.

21 మంది ఇజ్రాయెల్ సైనికులు మృతి

జెరూసలేం: గాజాలో ఇజ్రాయెల్ రక్షణ దళా(ఐడీఎఫ్)నికి తొలిసారి ఎదురుదెబ్బ తగిలింది. ఒకే ఘటనలో 27 మంది సైనికులు మృతి చెందారు. అక్టోబర్ 7వ తేదీన హమాస్‌పై యుద్ధం మొదలయ్యాక ఇంతమంది సైనికులు ఒకేసారి ప్రాణాలు కోల్పోవడం ఇదే మొదటిసారి. యుద్ధం నిలిపేసి, బందీలను విడుదలయ్యేలా చూడాలంటూ నెతన్యాహు ప్రభుత్వంపై ఒత్తిళ్లు పెరుగుతున్న సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనను ఇజ్రాయెల్‌కు ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. ఈ పరిణామంపై ప్రధాని నెతన్యాహు స్పందిస్తూ.. పూర్తి స్థాయి విజయం సిద్ధించే దాకా యుద్ధం కొనసాగుతుందని ప్రకటించారు.

విద్యార్థి వీసాల్లో కెనడా భారీ కోత

ఒట్టావా: అంతర్జాతీయ విద్యార్థి వీసాలపై కెనడా ప్రభుత్వం భారీ కోతలు ప్రకటించింది. విద్యార్థులకు ఇళ్ల కొరతను నివారించడం, వ్యవస్థాపరమైన లోపాలను సవరించడమే తమ నూతన విధాన లక్ష్యమని తెలిపింది. కెనడా ప్రభుత్వ నిర్ణయం భారత నుంచి వచ్చే విద్యార్థులపై గణనీయంగా ప్రభావం చూపనుంది. 2024లో కొత్తగా జారీ చేసే విద్యార్థి వీసాల్లో 35 శాతం వరకు తగ్గుదల ఉంటుందని ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ తెలిపారు. దీనివల్ల గత ఏడాది సుమారు 5.60 లక్షల విద్యార్థి వీసాలను జారీ చేసిన కెనడా ప్రభుత్వం ఈడాది 3.64 లక్షల వీసాలకు మాత్రమే ఆమోదం తెలపనుంది. ఈ పరిమితి రెండేళ్లు అమల్లో ఉంటుందని మంత్రి మిల్లర్ చెప్పారు. దీని ప్రభావం ఉన్నత చదువుల కోసం కెనడా రావాలనుకునే భారతీయ విద్యార్థులపై పడనుంది. తాజా మార్పులు జస్టిన్ ట్రూడో ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమని ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీ నేత జెన్నీ క్వాన్ మండిపడ్డారు. కెనడాకు వచ్చే ప్రతిభావంతులైన విద్యార్థులకు అడ్డంకిగా మారుతాయని అన్నారు.


మంగళవారం ఉదయం అయోధ్య రామమందిరం వద్ద రామ్‌లల్లా దర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులు

పోటెత్తిన భక్తజనం

- అయోధ్యలో తెల్లవారుజాము నుంచే క్యూ లైన్లు
- 5 లక్షల మందికి పైగా దర్శనం
- 30 కిలోమీటర్ల దాకా ట్రాఫిక్ జామ్

అయోధ్య: అయోధ్య అక్షరాలా భక్తజన సంద్రంగా మారుతోంది. అంగరంగ వైభవంగా కొలువుదీరిన బాలరామున్ని కళ్లారా దర్శించుకునేందుకు దేశ నలుమూలల నుంచీ భక్తులు సరయూ తీరానికి పోటెత్తుతున్నారు. సోమవారం ప్రాణప్రతిష్ఠ వేడుక ప్రధానంగా వీఐపీలకు మాత్రమే పరిమితమైన విషయం తెలిసిందే. సాధారణ భక్తులకు మంగళవారం నుంచి అనుమతిస్తామని ముందుగానే ప్రకటించారు. దాంతో తెల్లవారుజాము మూడింటి నుంచే భారీ క్యూ లైన్లు మొదలయ్యాయి. ఉదయానికల్లా అవి విపరీతంగా పెరిగిపోయాయి. ఆలయానికి దారితీసే ప్రధాన రహదారి రామ్ పథ్ భక్తుల వరదతో నిండిపోయింది. వారి జై శ్రీరాం నినాదాలతో పరిసరాలన్నీ ప్రతిధ్వనించాయి. పోలీసు సిబ్బంది కష్టమ్మీద వాటిని నియంత్రించారు. ఉదయం ఆరింటి నుంచి 11.30 దాకా దర్శనాలను అనుమతించారు. ఆ సమయంలో ఏకంగా 2.5 లక్షల నుంచి 3 లక్షల మంది దర్శనం చేసుకున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఏడింటికి రెండో విడతలో మరో 2 లక్షల పై చిలుకు భక్తులకు దర్శనం జరిగినట్టు అయోధ్య డివిజనల్ కమిషనర్ గౌరవ్ దయాల్ తెలిపారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ మంగళవారం అయోధ్యను సందర్శించి భక్తులకు దర్శన ఏర్పాట్లు తదితరాలను స్వయంగా పర్యవేక్షించారు.

దేశ నలుమూలల నుంచీ...

అయోధ్యకు తరలివస్తున్న భక్తుల్లో మహారాష్ట్ర, తెలంగాణ మొదలుకుని అటు పశ్చిమబెంగాల్, అసోం దాకా పలు రాష్ట్రాల వారున్నారు. వీరిలో చాలామందికి అయోధ్య సందర్శన ఇదే తొలిసారి. వీరిలో చాలామంది కనీసం రెండు మూడు రోజుల పాటు ఉండి నగరాన్ని పూర్తిగా సందర్శించేలా ప్లాన్ చేసుకున్నవారే. పలువురు భక్తులు రైల్వేస్టేషన్, బస్టాండ్ల నుంచి నేరుగా లగేజీతో సహా ఆలయానికి వచ్చేస్తున్నారు! సోమవారం మాదిరిగానే మంగళవారం కూడా తెల్లవారుజామునే ఆలయ పరిసరాల్లో రామ్ ధున్ మారుమోగింది. అయోధ్యకు వాహనాల ట్రాఫిక్ కూడా ఊహాతీతంగా పెరిగిపోయింది. దాంతో నగరానికి 30 కిలోమీటర్ల దూరం దాకా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి.

మనందరి జ్ఞాపకాల్లో శాశ్వతం: మోదీ

అయోధ్య భవ్య మందిరంలో సోమవారం బాల రాముని ప్రాణప్రతిష్ఠ మహోత్సవం జరిగిన తీరు మనందరి జ్ఞాపకాల్లో శాశ్వతంగా ఉండిపోతుందని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. వేడుకకు సంబంధించిన వీడియోలను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రాణప్రతిష్ఠ క్రతువులో ముఖ్య యజమానులుగా పాల్గొన్న 14 మంది దంపతుల్లోనూ ఇదే భావన వ్యక్తమైంది. దాన్ని సాటిలేని దివ్యానుభూతిగా అభివర్ణించారు. దాన్ని ఎన్నటికీ మర్చిపోలేమని వారణాసిలోని మణికర్ణిక ఘాట్ శ్మశానవాటిక కాటికాపరి కుటుంబానికి చెందిన అనిల్ చౌదరి, సప్నాదేవి దంపతులు అన్నారు. వీరందరినీ దేశ నలుమూలల నుంచీ ప్రత్యేకంగా ఎంపిక చేయడం తెలిసిందే.

అయోధ్య రామయ్య ఇకపై బాలక్ రామ్

అయోధ్య మందిరంలో కొలువుదీరిన రామ్ లల్లాను ఇకపై బాలక్ రామ్‌గా పిలవనున్నారు. స్వామి ఐదేళ్ల బాలుని రూపులో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆలయ పూజారి అరుణ్ దీక్షిత్ తెలిపారు. ఆలయాన్ని బాలక్ రామ్ మందిర్‌గా పిలవనున్నట్టు ప్రకటించారు. వారణాసికి చెందిన ఆయన సోమవారం బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ''ఇప్పటిదాకా దాదాపు 60 దాకా ఆలయాల ప్రాణప్రతిష్ఠల్లో పాలుపంచుకున్నా. వాటన్నింట్లోనూ అయోధ్య ప్రాణప్రతిష్ఠ సర్వోత్తమం. ఆ సందర్భంగా అత్యంత అలౌకికానుభూతికి లోనయ్యా'' అని దీక్షిత్ చెప్పుకొచ్చారు.

ఆరు హారతులు, నైవేద్యాలు

బాలక్ రామ్ రోజూ ఆరు హారతులు అందుకోనున్నాడు. స్వామికి ఉదయం మంగళారతితో మొదలు పెట్టి శృంగార, భోగ, ఉపతన, సంధ్యా హారతుల అనంతరం చివరగా శయనారతితో నిద్ర పుచ్చుతారు. బాలక్ రాముడు సోమవారం తెలుపు వస్త్రాల్లో, మంగళవారం ఎరుపు, బుధవారం ఆకుపచ్చ, గురువారం పసుపు, శుక్రవారం గోధుమ, శనివారం నీలం, ఆదివారం గులాబీ రంగు వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమిస్తాడు. రబ్డీ, ఖీర్, పళ్లు, పాలతో పాటు పలురకాల నైవేద్యాలు అందుకుంటాడు.

శాశ్వత సభ్యత్వం లేకపోవడం అర్ధరహితం

భద్రతా మండలిలో భారత ప్రాతినిధ్యంపై కుబేరుడు ఎలాన్ మస్క్

న్యూయార్క్: విశ్వమానవాళిలో అత్యధిక జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న భారత్‌కు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ప్రాతినిధ్యం లేకపోవడాన్ని కుబేరుడు ఎలాన్ మస్క్ తీవ్రంగా తప్పుబట్టారు. భద్రతా మండలి వంటి ఐరాస అనుబంధ విభాగాల్లో తక్షణం సంస్కరణలు అవసరమని వ్యాఖ్యానించారు. ఐరాస భద్రతా మండలిలో కనీసం ఒక్క ఆఫ్రికన్ దేశానికి చోటు దక్కకపోవడాన్ని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ఇటీవల సామాజిక మాధ్యమాల వేదికగా ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై అమెరికాలో పుట్టిన ఇజ్రాయెల్ పెట్టుబడిదారుడు మైఖేల్ ఐసన్‌బర్గ్ స్పందించారు. 'ఆఫ్రికా దేశాల పరిస్థితి తెల్సిందే. మరి భారత్ సంగతేంటి?' అని ప్రశ్నించారు. దీనిపై ఎలాన్ మస్క్ 'ఎక్స్'లో ట్వీట్లు చేశారు. ''ప్రపంచంలోని అత్యధిక జనాభా ఉన్న దేశాలకు ఐరాస సరైన ప్రాతినిధ్యం కల్పించట్లేదు. ఐరాస అనుబంధ విభాగాల్లో వెంటనే సంస్కరణలు తేవాలి. అసాధారణ అధికారాలను అనుభవిస్తున్న దేశాలు తమ అపరిమిత అధికారాలను వదులుకోవడానికి సిద్ధంగా లేకపోవడమే ఇక్కడ అసలు సమస్య. ప్రపంచంలోనే అత్యధిక జనాభాతో జనభారత్‌గా కీర్తింపబడుతున్న ఇండియాకు ఐరాస భద్రతా మండలిలో ఇన్నేళ్లయినా సభ్యత్వం లేకపోవడం అర్ధరహితం, హాస్యాస్పదం'' అని మస్క్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ''భద్రతా మండలిలో సంస్కరణలాభిలాషిగా, విశ్వశ్రేయస్సు కోరే దేశంగా భారత్ ఏనాడో పేరొందింది. అలాంటి భారత్‌కు మెంబర్‌షిప్ దక్కాల్సిందే. 21వ శతాబ్దపు భౌగోళిక, రాజకీయ అవసరాలకు అనుగుణంగా భద్రతా మండలి కూర్పు లేదు' అని మస్క్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం చైనా, ఫ్రాన్స్, రష్యా, బ్రిటన్, అమెరికాలకు మాత్రమే భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఉంది.

బంధుప్రీతి, అవినీతి నుంచి దేశానికి విముక్తి కల్పించాలి

మహిళలు, యువతకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం సిద్ధించాక దేశాభివృద్ధికి వారసత్వ రాజకీయాలు, అవినీతి, ఆశ్రిత పక్షపాతం అడ్డంకులుగా మారాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. దేశాన్ని ఇటువంటి దుష్ట శక్తుల నుంచి విముక్తం చేయాలని ప్రజలకు ముఖ్యంగా మహిళలు, యువతకు ఆయన పిలుపునిచ్చారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వారసత్వ రాజకీయాలు, ఆశ్రిత పక్షపాత అనే రెండు దుష్ట శక్తులు దేశ ప్రజాస్వామ్యాన్ని శాసించడం మొదలుపెట్టాయని పేర్కొన్నారు. 'మన దేశాన్ని గొప్పగా మార్చాలంటే రాజకీయ ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక సమాజం అనే పునాదులు గట్టిగా ఉండాలని నేతాజీ అనేవారు. కానీ, దురదృష్టవశాత్తూ, ఆయన ఆదర్శాలపై తీవ్రంగా దాడి జరిగింది'అని ప్రధాని పేర్కొన్నారు. 'దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను గురించి నేతాజీకి బాగా తెలుసు. వాటి గురించి ప్రతి ఒక్కరినీ ఆయన హెచ్చరించేవారు. దేశ ప్రజాస్వామ్యాన్ని బంధుప్రీతి, వారసత్వ రాజకీయాలు శాసించడం మొదలు పెట్టాక దేశం వెనుకబాటుకు గురైంది. వీటి నుంచి విముక్తి కల్పించే శక్తి యువత, మహిళలకు ఉంది'అని ప్రధాని పేర్కొన్నారు.

నేతాజీ స్ఫూర్తి కొనసాగుతుంది

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ప్రధాని మోదీ ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం ఆయన సాగించిన అలుపెరగని పోరాటం ఇప్పటికీ మనలో స్ఫూర్తిని రగిలిస్తోందని పేర్కొన్నారు. నేతాజీ జయంతిని ఏటా పరాక్రమ్ దివస్‌గా జరుపుకుంటారు.

బహిరంగంగా దండించే అధికారం ఎవరిచ్చారు?

గుజరాత్ పోలీసులను మందలించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: 2022లో గుజరాత్‌లోని ఖేడాలో ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన అయిదుగురిని బహిరంగంగా కొట్టిన ఘటనపై సుప్రీంకోర్టు ఆ రాష్ట్ర పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. స్తంభానికి కట్టేసి కొట్టే అధికారం ఎవరిచ్చారని నిలదీసింది. నిర్బంధం, అనుమానితుల విచారణలకు సంబంధించి సుప్రీంకోర్టు 1996లో ఇచ్చిన మార్గదర్శకాలను పట్టించుకోనందుకు కోర్టు ధిక్కారంగా పరిగణిస్తూ గుజరాత్ హైకోర్టు నలుగురు పోలీసులకు 14 రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. ఇన్‌స్పెక్టర్ ఏవీ పర్మార్, సబ్ ఇన్‌స్పెక్టర్ డీబీ కుమావత్, హెడ్ కానిస్టేబుల్ కేఎల్ దభి, కానిస్టేబుల్ ఆర్‌ఆర్ దభీలు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'ఈ అఘాయిత్యాలను ఏమనాలి? అందరూ చూస్తుండగానే ప్రజలను స్తంభానికి కట్టేసి కొడతారా. అలా చేసే అధికారం మీకుందా? కోర్టు జోక్యం చేసుకోవాలంటూ మళ్లీ మీరే వస్తారు. అయితే, వెళ్లండి, కస్టడీని అనుభవించండి. మీరు పనిచేసే చోట మీరే అతిథులుగా ఉండండి. అక్కడ మీకు ప్రత్యేక ఆతిథ్యం కూడా దొరుకుతుంది'అని ధర్మాసనం తీవ్రస్వరంతో పేర్కొంది. పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే పదేపదే కోరడంతో 14 రోజుల జైలు శిక్షపై ధర్మాసనం స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అడ్డుకుని..మంచి ప్రచారం ఇచ్చారు!

- అస్సాం సీఎంపై రాహుల్ వ్యంగ్య బాణం
- ఆయనపై కేసు పెట్టాలని హిమంత బిశ్వ శర్మ ఆదేశం

గువాహటి: అస్సాంలో భారత్ జోడో న్యాయ్ యాత్రతో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తుతున్నాయి. అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ తమ భారత్ జోడో న్యాయ్ యాత్రకు అడ్డంకులు కల్పిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపిస్తుండగా, రాహుల్ ప్రజలను రెచ్చగొడుతున్నారని సీఎం శర్మ అంటున్నారు. మంగళవారం అస్సాంలోని గువాహటిలో భారత్ జోడో న్యాయ్ యాత్రను పోలీసులు అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై రాహుల్ గాంధీ డొమ్‌డొమాలో మీడియాతో మాట్లాడారు. అస్సాంలోని బీజేపీ ప్రభుత్వం తమ యాత్రకు అవరోధాలు కల్పిస్తోందని ఆయన ఆరోపించారు. ఇటువంటి చర్యలతో తమ యాత్రకు లాభమే తప్ప నష్టం లేదన్నారు. యాత్రకు మరింత ప్రచారం వస్తుందని చెప్పారు. ఇప్పటికే యాత్ర ఇక్కడ ప్రధాన చర్చనీయాంశంగా మారిందన్నారు. సీఎం శర్మ దేశంలోని అత్యంత అవినీతి పరులైన సీఎంలలో ఒకరు. మేం వెళ్లిన ప్రతిచోటా జనం ఇదే చెబుతున్నారన్నారు.


గువాహటిలో జరిగిన ర్యాలీలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

హోం మంత్రి అడ్డుకుంటున్నారు

భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా మేఘాలయలోని ప్రైవేట్ వర్సిటీ విద్యార్థులతో తాను మాట్లాడకుండా కేంద్ర హోంశాఖ నుంచి అందిన ఆదేశాల మేరకు అధికారులు అడ్డుకున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. అస్సాం సరిహద్దుల్లో ఉన్న మేఘాలయలోని రి భోయ్ జిల్లాలో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో విద్యార్థులు, పౌర సంఘాల నేతలతో మంగళవారం ఉదయం మాట్లాడాల్సి ఉందన్నారు. అయితే, హోం శాఖ, అస్సాం సీఎం శర్మ నుంచి అందిన ఆదేశాల మేరకు నిర్వాహకులు అనుమతి నిరాకరించారని చెప్పారు. దీంతో, కార్యక్రమ వేదికను ఓ హోటల్‌కు మార్చుకోవాల్సి వచ్చిందని అనంతరం న్యాయ్ యాత్రలో భాగంగా జరిగిన ర్యాలీలో రాహుల్ ప్రకటించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బారికేడ్లను విరగొట్టాలంటూ ప్రజలను రెచ్చగొట్టి నక్సలైట్ల మాదిరి చర్యలకు దిగుతున్నారని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు. ప్రజలను రెచ్చగొడుతున్న రాహుల్‌పై కేసు నమోదు చేయాలంటూ రాష్ట్ర డీజీపీని ఆదేశించారు. ఈ మేరకు పోలీసులు రాహుల్‌తో పాటు కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్ కన్హయ్య కుమార్‌లపై కేసులు నమోదు చేశారు.

గణతంత్ర వేడుకల్లో అయోధ్య రాముడు

సాక్షి, న్యూఢిల్లీ: ఆధ్యాత్మిక ధామం అయోధ్యలో రామమందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ వైభవోపేతంగా జరిగిన మరుసటి రోజే ఆయనను మరోసారి గుర్తుచేస్తూ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో బాలరాముని దివ్యప్రతిమతో రాష్ట్ర శకటాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూపొందించింది. దీంతో ఈ ఏడాది ఢిల్లీలో కర్తవ్యపథ్‌లో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో అయోధ్య బాలరాముడు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. యూపీ సర్కార్ అయోధ్య రామాలయం, మహాకుంభమేళ ఇతివృత్తంతో శకటానికి తుదిరూపునిచ్చింది. త్వరలో ప్రయాగ్‌రాజ్ నగరంలో జరగబోయే మాఘ్ మేళా, 2025లో జరగబోయే మహాకుంభ మేళాలను ప్రతిబింబించేలా ఈ శకటాన్ని రూపొందించారు. శకటంలో ఇద్దరు సాధువులు, భారీ కలశాల ప్రతిమలకు చోటు కల్పించారు. ఈసారి రిపబ్లిక్ డే పరేడ్‌లో మొత్తం 30 శకటాలు ప్రదర్శించనున్నారు. గణతంత్ర దినోత్సవం తర్వాత జనవరి 26 నుంచి 31వ తేదీ వరకు ఎర్రకోట సమీపంలో 'భారత్ పర్వ్'లో ప్రజల సందర్శనార్థం ఈ శకటాలను ప్రదర్శనకు ఉంచుతారు.



ఏసీబీ, విజిలెన్స్ అధికారులతో మాట్లాడుతున్న ఎన్.బలరాం

మెడికల్ బోర్డు దందాపై ఏసీబీ నిఘా

సింగరేణి సీఎండీ బలరాం

గోదావరిఖని: సింగరేణి మెడికల్ బోర్డు మరింత పారదర్శకంగా పనిచేసేందుకు చర్యలు తీసుకుంటు న్నామని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరాం స్పష్టం చేశారు. మంగళవారం ఏసీబీ, విజిలెన్స్ అధికారు లతో తన కార్యాలయంలో ఆయన సమీక్షించారు. మెడికల్ బోర్డు పనితీరుపై సింగరేణి విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారుల నిఘా ఉంటుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులను పరీక్షించి ఇన్వాలిడేషన్ చేసే మెడికల్ బోర్డు ప్రక్రియను మరింత కట్టుదిట్టంగా, పారద ర్శకంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ మేరకు ఇటీవల ఏసీబీ డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసి మెడికల్ బోర్డుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరామన్నారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డీఎస్పీ రమేశ్ నేతృత్వంలో అధికారుల బృందం మంగళవారం ప్రత్యేకంగా భేటీ అయినట్లు తెలిపారు. మెడికల్ బోర్డులో పైరవీల కోసం డబ్బు తీసుకున్న కొందరు ఉద్యోగులను ఇప్పటికే డిస్మిస్ చేశామని వివరిం చారు. కార్మికుల నుంచి ఎవరైనా డబ్బు వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అనుమానాస్పద ఉద్యోగులపై నిఘా

అనుమానాస్పద ఉద్యోగులపై ఏసీబీ నిఘా కొనసా గుతుందని ఏసీబీ అధికారులు తెలిపారు. అన్‌ఫిట్ చేయిస్తామని డబ్బులు అడిగితే, తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పారదర్శకంగా సింగరేణి మెడికల్ బోర్డు ప్రక్రియ జరగాలనే యాజమాన్యం ఆలోచనను సాకారం చేసేందుకు సహాయ సహకా రాలు అందిస్తామన్నారు.

ఎస్‌సీఈఆర్‌టీలో డిప్యుటేషన్లు రద్దు

సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్య పరిశోధన, శిక్ష ణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) పరిధిలో పనిచేస్తున్న డిప్యుటేషన్లను రద్దు చేస్తున్నట్లు విద్యాశాఖ తెలిపిం ది. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీచేసిం ది. ఎస్‌సీఈఆర్‌టీలో వివిధ పాఠశాలల నుంచి డిప్యుటేషన్‌పై టీచర్లను తీసుకుంటారు. ఇది రెండే ళ్లకు పరిమితంగా ఉంటుంది. అయితే కాలపరిమితి పూర్తయినా మళ్లీ వారినే నియమిస్తున్నారు. దీని వె నుక పైరవీలు జరుగుతున్నాయని టీచర్ల సంఘా లు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డిప్యుటేషన్ల ను రద్దు చేస్తున్నట్లు విద్యాశాఖ తెలిపింది. తిరిగి తీసుకునేందుకు నోటిఫికేషన్ ఇవ్వాల్సింటుంది.

యూరియా సరఫరాలో కోత

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

- అధిక వాడకంతో భూసారం తగ్గుతోందని, ప్రజల ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతోందని భావిస్తున్న కేంద్రం
- రైతులు వినియోగం తగ్గించేలా చూడాలని రాష్ట్రాలకు ఆదేశం
- యూరియా ఎంత తగ్గిస్తే అంత ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటన
- సేంద్రీయ ఎరువుల వాడకం పెంచాలని సూచన

సాక్షి, హైదరాబాద్: రైతులు పంట పొలాల్లో అవసరానికి మించి యూరియా వాడుతు న్నారని, దానివల్ల భూసారం తగ్గుతోందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అందువల్ల సరఫరాలో కోతలు విధించాలని నిర్ణయిం చింది. యూరియా వినియోగం వీలైనంత మేరకు తగ్గించేలా చూడాలని అన్ని రాష్ట్రాలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. యూరియా ఎంత తగ్గిస్తే, అంతే స్థాయిలో ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ వర్గాలు వెల్లడిం చాయి. యూరియా అధిక వాడకం వల్ల భూసారం తగ్గ డమే కాకుండా, పంటలు కూడా విషపూరితమవుతు న్నాయి. ఆయా ఆహార పదార్థాలు తింటున్న ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తు న్నాయి. ఈ నేపథ్యంలోనే యూరియా సహా ఇతరత్రా అన్ని రకాల ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని కేం ద్రం సూచించింది. రసాయన ఎరువుల స్థానంలో సేంద్రీయ ఎరువులు, పురుగు మందులు వాడాలని తెలిపింది. కాగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో యూరియా వాడకాలను తగ్గించేలా చూస్తామని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి.



సాగు తగ్గినా పెరిగిన యూరియా వాడకం

రైతులు పంట పొలాల్లో యూరియాను కుమ్మరిస్తున్నారు. దీని వినియోగం ఏటా పెరుగుతోందని వ్యవసాయ శాఖ అధికా రులు చెబుతున్నారు. అవసరమున్నా లేకున్నా కొందరు రైతులు అధిక దిగుబడి వస్తుందనే ఆశతో యూరియాను విరివిగా వాడుతున్నారని అంటున్నారు. రైతులు గత ఏడాది వానాకాలం సీజన్‌లో 10.34 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంట పొలాల్లో వాడారని వ్యవసాయ శాఖ వెల్ల డించింది. 2022–23 వానాకాలం సీజన్‌లో 9.05 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వినియోగించగా, 2023–24 వానాకాలం సీజన్లో 1.29 లక్షల మెట్రిక్ టన్నులు అద నంగా వాడటం గమనార్హం. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనే అధికంగా యూరి యాను వినియోగించారు. వాస్తవానికి గత వానాకాలం సీజన్‌లో యూరియా వాడకం తగ్గుతుందని భావించారు. కానీ పెరిగింది. దీంతో కేంద్ర కేటాయింపుల కంటే ఎక్కు వగా యూరియాను రాష్ట్ర వ్యవసాయశాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే అంతకుముందు వానాకాలం సీజన్ కంటే గత ఏడాది వానాకాలం సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం తగ్గడం గమనార్హం. 2022–23 ఏడాది వానాకాలం సీజన్‌లో 1.47 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో అన్ని రకాల పంటలు సాగు కాగా, 2023–24 వానాకాలం సీజ న్‌లో 1.26 కోట్ల ఎకరాల్లోనే పంటలు సాగ య్యాయి. అంటే 21 లక్షల ఎకరాల్లో పం టల సాగు విస్తీర్ణం తగ్గింది. కానీ యూరియా వాడకం మాత్రం 1.29 లక్షల మెట్రిక్ టన్నులు పెరగడం గమనార్హం.

పలుమార్లు వర్షంతోనూ పెరుగుతున్న వాడకం

గత ఏడాది రుతుపవనాలు ఆల స్యమయ్యాయి. కీలకమైన సమయంలో వర్షాలు లేకపోవడంతో పత్తి, ఆరుతడి పం టల సాగు ఆలస్యమైంది. కొన్నిచోట్ల మాత్రం వర్షాలు కురవడంతో రైతులు పత్తి లాంటివి వేశారు. కానీ ఆ తర్వాత వర్షాలు రాకపోవడంతో వేసిన పంటలు ఎండిపో యాయి. మొక్కలు భూమిలోనే మాడిపో యాయి. తర్వాత వర్షాలు కురిశాక మళ్లీ దున్ని విత్తనాలు చల్లారు. ఇలా పలు మార్లు విత్తనాలు చల్లడం వల్ల యూరియా కూడా రెండు మూడుసార్లు వేయాల్సి వచ్చిందని రైతులు అంటున్నారు. దీంతో రెం డు బస్తాలకు బదులు మూడు, నాలుగు బస్తాల వినియోగం జరిగిందని వ్యవసా యశాఖ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఆ తర్వాత భారీ వర్షాలు కురవడంతో అనే కచోట్ల పంటలు కొట్టుకుపోయాయి. పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. పంట చేలల్లో నీరు నిలిచిపోయింది. అటువంటి చోట్ల మళ్లీ విత్తనాలు వేయడం, కొన్నిచోట్ల నీటిని తొలగించడం చేశారు. దీనివల్ల కూడా యూరియాను మరోసారి విని యోగించాల్సి వచ్చింది. పైగా సబ్సిడీ వల్ల యూరియా ధర కూడా తక్కువగా ఉండ టంతో రైతులు విరివిగా వినియోగిం చారని చెబుతున్నారు. ఈ అదనపు విని యోగాన్ని తగ్గించడమే లక్ష్యమని వ్యవ సాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

ఓవరాక్షన్ చేస్తే సహించేది లేదు

- అటవీ శాఖ అధికారులకు మంత్రి సీతక్క వార్నింగ్
- ఉట్నూర్‌లో ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష



కైలాస్‌నగర్: అటవీ హక్కులు, కేంద్ర చట్టా లంటూ ఓవర్ యాక్షన్ చేస్తే సహించేది లేద ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృ ద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అటవీ శాఖ అధికారులను హెచ్చరిం చారు. అమాయక ఆదివాసీలను హక్కుల పేరిట టార్గెట్ చేస్తామంటే ప్రభుత్వపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాష్ట్ర బడ్జె ట్ రూపకల్పన నేపథ్యంలో మంగళవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని సమావేశ మం దిరంలో ఉమ్మడి ఆదిలాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధిపై ఉమ్మడి జిల్లా అధికా రులతో సమీక్ష నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూ ఎస్, ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో వం టి కీలక శాఖలపై రాత్రి 7.30 గంటల వరకు సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సం దర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గత ప్రభు త్వం ఆదివాసీ ప్రాంతాలపై సవతి ప్రేమ చూపిందని, అటవీ హక్కుల పేరిట ఆదివా సీలపై అక్రమ కేసులు పెట్టిందని మం డిపడ్డారు. జంగుబాయి క్షేత్రం వంటి పవిత్ర ప్రాంతాలకు ఇప్పటికీ కనీసం రోడ్డు సౌక ర్యం కల్పించలేదన్నారు. అటవీ అధికారులు అమాయక ఆదివాసీలపై పెత్తనం చెలాయి స్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరిం చారు. బీజేపీ ఎమ్మెల్యేలు కేంద్రంలో ఉన్న తమ ప్రభుత్వానికి నచ్చజెప్పి తెలంగాణ లోని అటవీ పరిధిలో గల గ్రామాల అభివృ ద్ధికి సహకరించాలని కోరారు. ఉమ్మడి జిల్లా ఆదిలాబాద్ ఇంకా సమస్యల వలయంలోనే ఉందన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క ఆధ్వర్యంలో బడ్జెట్ కూర్పులో ఉమ్మ డి ఆదిలాబాద్ జిల్లాకు నిధుల కేటాయిం పులో ప్రథమ స్థానం దక్కేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం జిల్లా కలెక్టర్లు రాహుల్‌రాజ్, సంతోష్ బదావత్, ఆశిష్ సంగ్వాన్, హేమంత్ బొర్కడే, అదనపు కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మెస్రం వంశీయులను కలిసిన సీతక్క

నార్నూర్: ఆదివాసీ గిరిజన సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్య త ప్రతి ఒక్కరి పైనా ఉందని మంత్రి సీతక్క అన్నారు. గంగాజలం కోసం పాదయాత్రగా బయలుదేరిన మెస్రం వంశీయులను మండలంలోని గుం జాల గ్రామంలో ఆమె మంగళవారం కలిసి సంప్రదాయ ప్రకారం పూజలు నిర్వహించారు. అనంతరం జం గుబాయి దర్శనానికి బయలుదేరారు. ఆమె వెంట ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కాంగ్రెస్ నాయకుడు అజ్మీరా శ్యామ్‌నాయక్ తదితరులున్నారు.

ఆ సీఎంఆర్‌కు ఈనెలాఖరే డెడ్‌లైన్

- గత వానాకాలం సీఎంఆర్‌కు వారమే గడువు
- దాంతో మిల్లర్లు, అధికారులు.. ఉరుకులు పరుగులు
- వారం రోజుల్లో ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన బియ్యం 5.20 ఎల్ఎంటీ
- ఈనెల 31 తరువాత సీఎంఆర్ తీసుకునేది లేదని పౌరసరఫరాల కమిషనర్ స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: పౌరసరఫరాల శాఖ గత వానా కాలం సీఎంఆర్‌కు ఈనెలాఖరు వరకే డెడ్‌లైన్ విధించడంతో మిల్లర్లు ఉరుకులు పరుగులు పెడు తున్నారు. రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చే సిన ధాన్యాన్ని సకాలంలో కస్టమ్ మిల్లింగ్ చేసి బి య్యం (సీఎంఆర్)గా ఇవ్వాల్సిన మిల్లర్లు గత మూ డేళ్లుగా 'తామిచ్చినప్పుడే బియ్యం తీసుకో వాలి' అన్నట్లుగా వ్యవహరిస్తూ వచ్చారు. తాజాగా పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ విధానానికి స్వస్తి పలకాలని అధికారులను ఆదేశిం చారు. ఈనెలాఖరులోగా 2022–23 వానా కాలం ధాన్యం సీఎంఆర్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు కొత్త కమిషనర్‌గా నియమితులైన ఐపీఎస్ అధికారి డీఎస్ చౌహాన్‌ను ఆదేశించారు.

మిల్లర్ల ఆగడాలకు చెక్

మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని ఆరు నెలల్లోపు బియ్యంగా మార్చి మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి అప్పగిం చాలి. కానీ ఏడాదిన్నర కాలం దాటినా ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగించకుండా బకాయి పడడం మిల్లర్లకు సర్వసాధారణమైంది. సీఎంఆర్ గడువు ముగిసిన తరువాత ఆ బియ్యాన్ని రాష్ట్ర అవసరాల కోసం వినియోగించుకునేలా పౌరసరఫరాల సం స్థకు మిల్లర్లు సరఫరా చేయడం రివాజుగా మారిం ది. ఈ బియ్యం నాణ్యత లేకపోయినా, రీ సైక్లింగ్ బియ్యం అని తెలిసినా పౌరసరఫరాల సంస్థ చూసీచూడనట్టుగా వ్యవహరించి, వాటినే తిరిగి ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పేదలకు పంపడం జరుగుతోంది. అయితే కాంగ్రెస్ ప్రభు త్వం కొలువు దీరిన తరువాత మంత్రి ఉత్తమ్‌కు మార్ రెడ్డి ఇదే విషయాన్ని ప్రధానంగా ప్రస్తావిం చి, మిల్లర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని నిర్ణ యించారు. మిల్లులకు పంపిన ప్రతి ధాన్యం గింజ సీఎంఆర్ కింద ఎఫ్‌సీఐ గోడౌన్‌లకు చేరాల్సిందేన ని స్పష్టం చేశారు. ఎఫ్‌సీఐకి పంపకుండా నేరుగా పౌరసరఫరాల సంస్థకు బియ్యం ఇవ్వాలనుకుంటే కుదరదని, ఆ బియ్యంకు బదులు డబ్బులు వసూలు చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగానే 2022–23 వానాకాలం (సుమారు 18 నెలల క్రితం)లో మిల్లులకు కేటాయించిన ధాన్యం ఈనెలాఖరు కల్లా పూర్తిస్థాయిలో బియ్యంగా ఎఫ్‌సీఐకి చేరాలని స్పష్టం చేశారు. ఈ మేరకు కమిషనర్ చౌహాన్ అన్ని జిల్లాల అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు.

కొత్త సర్కారు వచ్చాక 8 ఎల్ఎంటీ బియ్యం సేకరణ

2022–23 వానాకాలంలో 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేయడం ద్వారా వచ్చే 44 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి ఆరునెలల్లో అప్పగించాలి. కానీ 18 నెలల తర్వాత కూడా గత డిసెంబర్ మొదటి వారానికి కేవలం 31 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ఎఫ్‌సీఐకి అప్పగించారు. ఇంకా 13 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బకాయి ఉంది. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలు, కమిషనర్ చౌహాన్ చొరవతో మంగళవారం నాటికి 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ కింద ఎఫ్‌సీఐకి అప్పగించారు. ఈనెలాఖరు కల్లా మరో 5.20 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ ఇవ్వకపోతే కిలోకు రూ. 39 చొప్పున బియ్యం ధరను ప్రభుత్వం వసూలు చేయనుంది. ఈ నేపథ్యంలో సీఎంఆర్‌కు గడువు వారం రోజులే ఉండడంతో ఒకవైపు మిల్లర్లు, మరోవైపు జిల్లాల అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. పెండింగ్ ఉన్న బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించేందుకు మిల్లర్లు నిర్విరామంగా మిల్లింగ్ చేస్తుండగా, జిల్లాల్లో అదనపు కలెక్టర్లు , డీఎస్ఓలు, డీఎంలు మిల్లర్లపై ఒత్తిడి పెంచుతున్నారు.



రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన సోదరుడు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నేత ప్రసాద్‌రెడ్డి తనయుడు లోహిత్‌రెడ్డి వివాహం, రిసెప్షన్‌కు ముఖ్యమంత్రి ఎనుముల రేవం త్‌రెడ్డి దంపతులను ఆహ్వానించారు. మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి– మాధురి దంపతులు, ప్రసాద్‌రెడ్డి–శ్రీలక్ష్మి దంపతులు కుటుంబ సమేతంగా సీఎం నివాసానికి వెళ్లి శుభలేఖ అందజేశారు.
– హైదరాబాద్

మేడ్చల్ వెటర్నరీ ఏడీ పిటిషన్ కొట్టివేత

- గొర్రెల పెంపకం పథకంలో అవినీతిపై నమోదైన కేసును కొట్టివేయాలన్న ఏడీ ఆదిత్య
- 22న ఏసీబీకి కేసు అప్పగింత.. ఈ దశలో క్వాష్ పిటిషన్‌పై విచారణ జరపలేం: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: గొర్రెల పెంపకానికి సంబంధించిన అవినీతి ఆరోపణలపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ నిందితుడు, మేడ్చల్ జిల్లా పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన ముంత ఆదిత్య కేశవసాయి దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు కొట్టివేసింది. గొర్రెల పెంపకం పథకంలో అక్రమంగా తప్పుడు ఖాతాల్లోకి నిధులు మళ్లింపు ఆరోపణలపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో గతేడాది కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని, గొర్రెల ఫిట్‌నెస్ పరిశీలించి సర్టిఫికెట్ల జారీ అంశాల విధులనే నిర్వహించానని..తనపై కేసు కొట్టివేయాలని కోరుతూ ఆదిత్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీ నిపై జస్టిస్ మాధవీదేవి విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయ మూర్తి..ఈ నెల 22నే ఈ కేసును ఏసీబీకి అప్పగించారని, ఇందులో ఏ–4 పాత్ర ఉందా లేదా అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కోరుతూ పిటిషనర్ దాఖలు చేసిన పిటిషన్ 31న విచారణకు రానుందని చెప్పారు. వాస్తవాలు బయటపడకుండా క్వాష్ పిటిషన్‌పై విచారణ జరపలేమని స్పష్టం చేశారు. ఈ దశలో జోక్యం చేసుకోలేంటూ పిటిషన్‌ను కొట్టివేశారు.

మళ్లీ బాటసింగారంలోనే..

- మామిడి సీజన్ కోసం తాత్కాలిక షెడ్ల నిర్మాణం
- వచ్చే నెల చివరిలోగా ఏర్పాట్లు పూర్తి చేయాలని లక్ష్యం

సాక్షి, హైదరాబాద్: మామిడి కొనుగోళ్ల విక్రయాలు ఈ ఏడాది కూడా బాటసింగారంలోనే నిర్వహిం చాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. మార్చి నెల నుంచి మామిడి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యం లో ఇప్పటి నుంచే బాటసింగారం మార్కెట్‌లో అవస రమైన ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ స్థలం సరిపోనందున గత ఏడాది మాదిరిగానే మార్కెట్ పక్కన ఉన్న స్థలాన్ని అద్దెకు తీసుకుని తాత్కలిక షెడ్లు ఏర్పాటు చేయాలని మార్కెటింగ్ శా అధికారులకు ఆదేశించింది. ఇం దుకు సంబంధించిన వివరాలపై ఇంజినీరింగ్ విభాగం పూర్తి స్థాయి నివేదిక కూడా రూపొందించిం ది. మార్కెట్ పక్క స్థలంలో మూడు షెడ్లను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఫిబ్రవరి నెలా ఖరులోగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఉన్నతాధికా రులు సూచించారు. కాగా ఏడాది మామిడి ఎక్కు వగా దిగుమతి అయ్యే అవకాశం ఉందని వ్యాపారుల అంచనా. గత ఏడాది అకాల వర్షాల కారణంగా మామిడి రైతులు, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సారి మెరుగైన ఏర్పాట్లు చేయాలని, మామిడి దిగుమతులు పెరిగే అవకాశం ఉన్నందున అందుకు తగిన చర్యలు తీసు కోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

ప్రస్తుత మార్కెట్ సరిపోదు

మార్కెటింగ్‌శాఖ అనాలోచిత చర్యలతో మామిడి రైతులు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పేరిట ఆగమేఘాలపై గడ్డిఅ న్నారం మార్కెట్‌ను నేలమట్టం చేసిన మార్కెటింగ్ శాఖ.. తాత్కాలికంగా బాటసింగారంలోని హెచ్ఎం డీఏ లాజిస్టిక్ పార్కుకు తరలించింది. రెండేళ్లలో కోహెడలో శాశ్వత ప్రాతిపదికన మార్కెట్‌ను నిర్మి స్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ ప్రతిపాదన ఇంకా కార్యరూపం దాల్చలేదు. అటు కోహెడలో మార్కెట్ నిర్మించడం లేదు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ సరిపోకపోవడంతో గత ఏడాది మామిడి సీజన్‌లో వర్షాల కారణంగా రైతులు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మామిడి పండ్ల క్రయ విక్రయాలకు బాటసింగారం లాజిస్టిక్ పార్కు పక్కనే ఉన్న ప్రైవేటు స్థలంలో తాత్కాలిక షెడ్లను నిర్మించారు. దీనికోసం రూ.50–70 లక్షల వరకు వెచ్చించారు. వీటికి నెలవారీ అద్దె అదనం. అయితే, సీజన్‌లో వర్షాలు కురిసినా.. గాలి దుమారం వచ్చినా పండ్ల ఉత్ప త్తులు దెబ్బతింటున్నాయి. వర్షాలకు సరుకు కూడా కొట్టుకుపోయింది. మామిడి సీజన్ వస్తుందంటే కమీషన్ ఏజెంట్లు , వ్యాపారులకు భయం భయం గా వ్యాపారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సౌక ర్యాలు లేని మార్కెట్‌కు రైతులు సరుకులు కూడా తీసుకురావడం లేదని కమీషన్ ఏజెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బాలిక ప్రసవానికి కారణమైన

యువకుడిపై పోక్సో కేసు

మంచిర్యాల క్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని(14) ప్రసవానికి కారణమైన యువకుడిపై మం గళవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల సీఐ రాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు కేంద్రంలో బాలిక సోమవారం ప్రసవించింది. ఈ ఘటనపై 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసులు స్పందించి విచారణ చేపట్టారు. బాధితురాలిని కలిసి వివరాలు సేకరించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కాంపౌం డర్‌గా పనిచేస్తున్న బెల్లంపల్లికి చెందిన ఫర్హాన్ అనే యువకుడు తరచూ బాలికను కలిసేవాడని పేర్కొన్నారు. మాయమాటలు చెప్పి ఆమెను లోబర్చుకున్నట్లు చెప్పారు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఫర్హాన్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఫర్హాన్ చిరునామా బాధిత బాలికకు కూడా తెలియదని, అతడి గోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు. శిశువును బాలిక కుటుంబసభ్యులు చేరదీసే పరిస్థితి లేకపోవడం తో అధికారులు శిశు కేంద్రానికి తరలించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.



సాక్షి ఎఫెక్ట్

పోచంపల్లిలో వస్త్ర దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం

ఆ షాపులపై రంగు పడింది

- పోచంపల్లిలో వస్త్ర దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు
- ప్రింటెడ్ ఇక్కత్ వస్త్రాలు విక్రయిస్తున్న వ్యాపారులకు నోటీసులు
- సాక్షి కథనానికి స్పందించిన అధికారులు

భూదాన్ పోచంపల్లి: పేటెంట్ హక్కు కలిగి ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన పోచంపల్లి ఇక్కత్‌ను నిబంధనలకు విరుద్ధంగా ప్రింట్ చేసి విక్రయిస్తున్న పలు వస్త్ర దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ నెల 8న సాక్షి దినపత్రికలో 'ఇక్కత్‌కు ఇక్కట్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో 12 చేనేత వస్త్రాల షోరూంలలో ఏకకాలంలో దాడులు నిర్వహిం చారు. అక్కడి షాపుల్లో విక్రయిస్తున్న ఇక్కత్ ప్రింటెడ్, పవర్‌లూమ్‌లపై తయారైన వస్త్రాలను సీజ్ చేసి సంబంధిత షాపు యజమానులకు నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత, జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.వెంకటేశం మీడియాతో మాట్లాడుతూ.. దినపత్రికలలో వచ్చిన కథనానికి స్పందించి క్షేత్రస్థాయిలో ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పోచంపల్లిలో సీజ్ చేసిన వస్త్రాలను చెన్నైలోని ల్యాబ్‌టెస్టింగ్‌కు పంపిస్తామని, ప్రింటెడ్ వస్త్రాలు అని తేలితే నిందితులు స్థానికులైతే కేసు నమోదు చేస్తామని, లేదా ఇతర రాష్ట్రాలలో తయారైనవిగా తేలితే అక్కడి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు నివేదిస్తామని వెల్లడించారు.

హ్యాండ్లూమ్ మార్కు తప్పనిసరి

స్వచ్ఛతకు నిదర్శనమైన హ్యాండ్లూమ్ మార్కు, సిల్క్‌మార్క్‌తో పాటు ఇండియా హ్యాండ్లూమ్ బ్రాండ్ లోగో ట్యాగ్ చేసిన చేనేత వస్త్రాలను మాత్రమే పోచంపల్లి వస్త్ర వ్యాపారులు అమ్మాలని వెంకటేశం కోరారు. దాడుల్లో జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్, డీఓలు ప్రసాద్, సంధ్యారాణి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు

తెలంగాణ ఆత్మగౌరవానికి

ప్రతీక సర్వాయి పాపన్న

గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మంత్రులు జూపల్లి, పొన్నం



మంత్రులకు సర్వాయి పాపన్న జ్ఞాపికను అందజేస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలిచారని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృ ష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మం గళవారం రంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్ జిల్లాల కల్లు సొసైటీల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో నిర్వహించిన గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యఅతిథులుగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు విచ్చేశారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. పాపన్న గొప్పతనాన్ని స్మరించుకునేందుకు ఏటా ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని చెప్పారు. కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గౌడ కులస్తులకు సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, భవిష్యత్‌లో సంక్షేమ పథకాలను అమలు చేస్తామని జూపల్లి వెల్లడించారు. ప్రజలకు కల్తీలేని కల్లు అందించడానికి ప్రభుత్వం ఈత, తాటి వనాల పెంపకాన్ని ప్రోత్సహించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, కార్యనిర్వాహకులు ప్రేమ్‌దాస్‌గౌడ్, హరిచరణ్‌గౌడ్, కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి కాంగ్రెస్ ఘన నివాళి

సాక్షి, హైదరాబాద్: ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం ఉదయం గాంధీభవన్‌లో మంత్రి కోమటిరెడ్డి తదితరులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా ఆయన దేశభక్తిని, నిస్వార్థ ప్రజాసేవను స్మరించుకున్నారు. కార్యక్ర మంలో కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల ఆలోచనలు గుర్తించాలి

ఏజీవర్సిటీ: వ్యవసాయ విద్యార్థులు (వ్యవసాయ స్టార్టప్) లు రైతుల ఆలోచనలు గుర్తించాలని ముఖ్యంగా గ్రామీణ ప్రాంత సన్న, చిన్నకారు రైతులకు అనుగుణం గా ఆచరణాత్మకమైన ఆలోచనలతో ముందుకు రావాలని నాబార్డ్ మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్స్‌లో) 2వ అగ్రి–స్టార్ట ప్‌ల రెండో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశానికి అభివృద్ధి చెందిన దేశంగా గుర్తింపు తెచ్చేందుకు ఇది సరైన తరుణమన్నారు. చెరకు, బొప్పాయిసాగులలో అధిక ఉత్పత్తి, లాభాదా యకతకు అవసరమైన వ్యూహాలపై ఆయన వివరించారు. గ్రామ పాఠశాల సహ వ్యవస్థాపకుడు డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థులు ఉద్యో గాల కోసం పరితపించకుండా ఉద్యోగ ప్రధాతలుగా మారాలని సూచించారు. రైతులకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వచ్చేలా అధునాతన వ్యవసాయ పద్ధతులను రూపొందించాలన్నారు. అనంతరం డిగ్రీ పూర్తి చేసిన వారికి సర్టిఫి కెట్లు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో నార్మ్స్ డైరెక్టర్ జనరల్ శ్రీనివాస్ రావు, జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, దాదాపు రెండు వందల మంది అగ్రి–స్టా ర్టప్‌లు, రైతులు, పర్యావరణ వ్యవస్థ భాగస్వాములు, బ్యాంకింగ్ అధికారులు, ఇంక్యుబేషన్ మేనేజర్లు, పెట్టుబడిదారులు, నార్మ్స్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

మాడ్రిడ్ టూరిజం ఫెయిర్‌కు మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టూరిజం ట్రేడ్ ఫెయిర్‌లో పాల్గొనేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో అధికారుల బృందం స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ వెళ్లింది. ఈ నెల 24 నుంచి 28 వరకు ఈ ఫెయిర్ కొనసాగనుంది. పర్యాటకపరంగా తెలంగాణలో ఉన్న అవకాశాలను అధికారుల బృందం ఆ ప్రదర్శనలో వివరించనుంది. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకరంగంలో చోటు చేసుకుంటున్న మార్పులు, నూతన ఆవిష్కరణలపై అధ్యయనం చేయనుంది. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలు తెలంగాణ వైపు దృష్టి సారించేలా మంత్రి జూపల్లి కృష్ణారావు వివిధ అంతర్జాతీయ సంస్థలతో చర్చించనున్నారు. మంత్రి వెంట పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యాటక శాఖ డైరెక్టర్ నిఖిల, ఎండీ రమేశ్‌నాయుడు ఉన్నారు.

'మార్గదర్శి కేసుల' విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై సుప్రీంకోర్టులో దాఖలైన వేర్వేరు పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. మార్గదర్శిపై కేసులు ఉమ్మడి హైకోర్టు క్వాష్ చేయడం తగదంటూ ఉండవల్లి అరుణ్‌కుమార్, ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లతో పాటు మార్గదర్శి ఫైనాన్షియర్స్ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సతీష్‌చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. అయితే మంగళవారం రాజ్యాంగ ధర్మాసనం అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ మైనారిటీ హోదాపై విచారణ చేపట్టింది. జస్టిస్ సూర్యకాంత్ రాజ్యాంగ ధర్మాసనంలో సభ్యుడు కావడంతో మార్గదర్శిపై కేసులు విచారణకు రాలేదు. ఆయా కేసుల తదుపరి విచారణ తేదీని ధర్మాసనం నిర్ణయించాల్సి ఉంది.

మీపై చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వండి..

ఫిరాయించిన నలుగురు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు ఏపీ స్పీకర్ నోటీసులు



సాక్షి, అమరావతి: శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదేశాల మేరకు పార్టీ ఫిరాయించిన నలుగురు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు రాష్ట్ర లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులు మంగళవారం నోటీసులిచ్చారు. ఫిరాయింపు నిరోధక చట్టం కింద చర్యలు ఎందుకు తీసుకోకూడదో ఈ నెల 25లోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా పోటీచేసి శాసనసభకు ఎన్నికైన ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవిలు పార్టీ ఫిరాయించారు. వారిపై చట్ట ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులుకు ఈ నెల 8న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన స్పీకర్ తమ్మినేని సీతారాం ఫిరాయించిన ఎమ్మెల్యేలకు చట్ట ప్రకారం నోటీసులివ్వాలని లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్‌ను ఆదేశించారు.

గంటా రాజీనామా ఆమోదం



సాక్షి, అమరావతి: విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామాను అసెంబ్లీ స్పీకర్ ఆమోదించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాసన వ్యవహారాల సెక్రటరీ జనరల్ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. కొద్దికాలం క్రితం అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాంకి ఆయన స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా సమర్పించారు. దాన్ని పరిశీలించిన స్పీకర్ ఆమోదముద్ర వేశారు. విశాఖ్ నార్త్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

గణతంత్ర దినోత్సవం కోసం మంగళవారం ఢిల్లీలో జరిగిన ఫుల్ డ్రస్ రిహార్సల్స్‌లో తెలుగు రాష్ట్రాల శకటాలు



తెలంగాణ (ఇతివృత్తం: ప్రజాస్వామ్య మట్టి పరిమళాలు- జన సామాన్య ప్రజాస్వామ్య యోధులు)



ఆంధ్రప్రదేశ్ (ఇతివృత్తం: ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యను మార్చడం - విద్యార్థులను ప్రపంచవ్యాప్తంగా పోటీపడేలా చేయడం)

బడి పిల్లలు.. బలహీనం

ప్రతి ఐదుగురిలో ఇద్దరికి జీర్ణక్రియ సమస్యలు

- ఛాతీ, ఉదరం, కండరాల పనితీరు వీక్
- ప్రైవేట్‌తో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే హెల్తీ
- దేశవ్యాప్తంగా 73 వేల మంది విద్యార్థులపై సర్వే..
- స్పోర్ట్స్ విలేజ్ 12వ వార్షిక ఆరోగ్య నివేదిక విడుదల



సాక్షి, హైదరాబాద్: పోషకాహారలోపం, శారీరక శ్రమ లేకపోవడంతో జీవనశైలిలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా బడి పిల్లలు బలహీనంగా తయారవుతున్నారు. దేశంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల్లో ఆరోగ్యం, ఫిట్‌నెస్ సామర్థ్యం తెలుసుకునేందుకు ప్రపంచంలోనే అతిపెద్ద యూత్ స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్ స్పోర్ట్స్ విలేజ్ సర్వే చేసింది. 250 నగరాలు, పట్టణాల్లో 7 -17 ఏళ్ల వయసు ఉన్న 73 వేల మంది విద్యార్థులపై సర్వే చేసి, 12వ వార్షిక ఆరోగ్య నివేదిక విడుదల చేసింది.

నివేదికలోని ముఖ్యాంశాలు

- ప్రతీ ఐదుగురు పిల్లల్లో ఇద్దరి శరీరంలో ఆరోగ్యకరమైన కొవ్వు (బాడీ మాస్ ఇండెక్స్- బీఎంఐ), వాయు రహిత జీర్ణక్రియ (యాన్‌ఏరోబిక్ కెపాసిటీ) ప్రక్రియ సరిగ్గా లేదు.
- ఐదుగురిలో ఒకరికి స్వేచ్ఛగా కీళ్లు కదిలే సామర్థ్యం లేదు.
- ముగ్గురికి గుండె, ఊపిరితిత్తుల కండరాలకు ఆక్సిజన్ సరిగ్గా అందడం లేదు.
- ముగ్గురిలో ఒకరికి ఉదర కండరాలు బలహీనంగా ఉన్నాయి.
- ప్రతి ఐదుగురిలో ముగ్గురికి ఛాతీ భాగం బలహీనంగా ఉంది.

అమ్మాయిలే ఆరోగ్యంగా..

అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలే ఆరోగ్యంగా ఉన్నారు. 62 శాతం ఆడపిల్లల బీఎంఐ సూచీ ఆరోగ్యకరంగా ఉంది. 47 శాతం అమ్మాయిల్లో బలమైన ఛాతీభాగం, 70 శాతం మందికి కీళ్లు, శరీర కదలికల్లోనూ ఫ్లెక్సిబుల్‌గా ఉన్నాయి. అయితే 20 శాతం బాలికల్లో ఏరోబిక్ కెపాసిటీ, 37 శాతం మందిలో శరీర కింది భాగం బలంగా లేదు.

ప్రభుత్వ పాఠశాల పిల్లలే బెటర్

ప్రైవేట్‌తో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఆరోగ్యంగా ఉన్నారు. వీరిలో బీఎంఐ, ఏరోబిక్ కెపాసిటీ, కీళ్ల కదలికలు ఫ్లెక్సిబుల్‌గా ఉన్నాయి. అయితే 43 శాతం ప్రైవేట్ స్కూల్ పిల్లల్లో మాత్రం ఛాతీ భాగం సౌష్టవంగా ఉంది. గవర్నమెంట్ స్కూళ్ల విద్యార్థులలో 62 శాతం మందికి ఆరోగ్యకరమైన బీఎంఐ, 70 శాతం మందికి ఫ్లెక్సిబుల్ కీళ్లు, 73 శాతం పిల్లల్లో యాన్‌ఏరోబిక్ కెపాసిటీ, 31 శాతం మంది బలమైన ఛాతీ ఉంది. అదే ప్రైవేట్ పాఠశాలల పిల్లల్లో 58 శాతం మందికి బీఎంఐ, 64 శాతం ఫ్లెక్సిబుల్ కండరాలు, 55% యాన్‌ఏరోబిక్ కెపాసిటీ, 43 శాతం మంది విద్యార్థులకు ఛాతీభాగం బలంగా ఉంది.

దక్షిణాది విద్యార్థులు బలంగానే..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాల్లోని విద్యార్థులు ఆరోగ్యకరంగా ఉన్నారు. ఈ రాష్ట్రాల్లోని పిల్లల్లో ఛాతీ, శరీర కింది భాగం బలంగా ఉన్నాయి. ఉత్తర రాష్ట్రాల పిల్లల్లో బలహీనమైన బీఎంఐ, కీళ్లు, ఉదర కండరాలు సమస్యలున్నాయి. తూర్పు రాష్ట్రాల్లో బీఎంఐ, ఫ్లెక్సిబులిటీ, ఛాతీభాగం ఆరోగ్యకరంగా ఉన్నాయి. ఇక పశ్చిమాది రాష్ట్రాల విద్యార్థులలో ఏరోబిక్ కెపాసిటీ, శరీర కింది భాగం, కీళ్ల కదలికలు మెరుగ్గా ఉన్నాయి.

హైదరాబాద్ విద్యార్థులు హెల్తీ

ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోని పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యం మెరుగ్గానే ఉంది. నగరంలోని 58 శాతం విద్యార్థుల శరీరంలో ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలుండగా, 49 శాతం మందికి బలమైన ఛాతీ, 84 శాతం సమర్థమైన ఉదర భాగాలున్నాయి. 46 శాతం మందిలో శరీర కింది భాగం బలంగా ఉండగా.. 64 శాతం పిల్లల్లో కీళ్ల కదలికలు చురుగ్గా ఉన్నాయి. 41 శాతం మందికి మెరుగైన ఏరోబిక్ సామర్థ్యం, 58 శాతం విద్యార్థుల్లో వాయురహిత జీర్ణక్రియ సమర్థంగా ఉంది. వారంలో రెండు ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీఈ) తరగతులు ఉన్న స్కూళ్ల విద్యార్థుల్లో బలమైన ఛాతీ, ఉదర భాగంతో పాటు కండరాల కదలికలలో చురుకుదనం, గుండె, ఊపిరితిత్తుల పనితీరు మెరుగ్గా ఉన్నాయి.

అయోధ్య ప్రసాదం.. వీఐపీ దర్శనం!

సాక్షి, హైదరాబాద్: అయోధ్య రామమందిరం పేరును సైబర్ నేరగాళ్లు కొత్త మోసాలకు ఉపయోగించుకుంటున్నట్లు తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) హెచ్చరించింది. అయోధ్య ప్రసాదం పంపిణీ పేరిట, విరాళాల సేకరణ పేరిట, వీఐపీ దర్శనం టికెట్ల విక్రయం పేరిట సైబర్ నేరగాళ్లు వాట్సాప్‌లలో సందేశాలు పంపుతున్నట్లు పేర్కొంది. అయోధ్య రామమందిరం పేరుతో సైబర్ నేరస్తులు పంపే క్యూఆర్ కోడ్‌లు, ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజ్ (ఏపీకే) ఫైల్స్‌ను నమ్మి మోసపోవద్దని టీఎస్‌సీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రామమందిరం పేరిట సైబర్ నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్‌లు సృష్టించినట్లు తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. డబ్బు పంపాలంటూ వాట్సాప్ సందేశాల్లో నకిలీ లింక్‌లు పంపుతున్నారని, ఆ లింక్‌లు క్లిక్ చేసిన వారి నుంచి బ్యాంకుల వివరాలు, ఫోన్ నంబర్లను సేకరిస్తున్నారని తెలిపారు. అలాగే వివిధ మొబైల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసి ఓటీపీలు చెప్పాలని కోరుతున్నారని, అలా చేస్తే ఫోన్ల పనితీరు సైబర్ నేరగాళ్ల అధీనంలోకి వెళ్తుందని హెచ్చరించారు. ఈ డిజిటల్ ముప్పును ఎదుర్కోవడానికి వాట్సాప్ లేదా ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో వచ్చే అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దని శిఖా గోయల్ సూచించారు. ఈ తరహా మెసేజ్‌లు వస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. అదేవిధంగా www. cybercrime. gov. in ద్వారా లేదా వాట్సాప్‌లో సైబర్ ఫ్రాడ్ రిజిస్ట్రీ నంబర్ 87126 72222కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అయోధ్య రామమందిరం పేరిట సైబర్ నేరగాళ్ల కొత్త మోసం

- డబ్బు పంపాలంటూ వాట్సాప్‌లో ఫేక్ లింకులు పంపుతున్న వైనం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరిక



పాత నాణేలిస్తే లక్షలిస్తామని బురిడీ

పాత నాణేలు తమకు ఇస్తే బదులుగా రూ. లక్షలు చెల్లిస్తామంటూ సైబర్ నేరగాళ్లు మోసగిస్తున్నారని... ఇందిరా గాంధీ, భారతదేశ మ్యాప్ చిత్రాలున్న పాత రూ. 2 లేదా రూ. 5 నాణేలు పంపిస్తే రూ. లక్షల్లో ఆదాయం వస్తుందని మోసపూరిత ప్రకటనలు ఇస్తున్నట్లు తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరగాళ్ల మాయలో చిక్కే అమాయకులకు డబ్బు చెల్లిస్తామని... అందుకోసం ముందుగా టీడీఎస్, సర్వీస్ చార్జీలు చెల్లించాలంటూ కేటుగాళ్లు డబ్బు దండుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి మోసాలపట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ఇక గోల్కొండ రాత్రిళ్లు వెలుగులీనుతుంది

- ఆధునీకరించిన ఇల్యుమినేషన్‌ను నేడు ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గోల్కొండ కోటలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరించిన ఇల్యుమినేషన్, సౌండ్ అండ్ లైట్ షోను బుధవారం కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా సినీనటుడు చిరంజీవి, సినీదర్శకుడు, ఎంపీ విజయేంద్రప్రసాద్ హాజరుకానున్నారు. పదకొండవ శతాబ్దపు చారిత్రక గోల్కొండ కోట చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసేలా, కాకతీయుల కాలం నుంచి నేటి వరకు చారిత్రక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఈ షోను ఏర్పాటుచేశారు. దీంతో పాటుగా ఇకపై రాత్రిళ్లు కూడా దేదీప్యమానంగా కనిపించేలా 'ఇల్యుమినేట్' చేయనున్నారు. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ ఆధునీకరణ పనులు చేపట్టారు.

ఇవీ కొత్త వెలుగుల విశేషాలు: గోల్కొండ కోటలో ప్రస్తుతం ఉన్న సౌండ్ అండ్ లైట్ షోను 1993లో ఏర్పాటుచేశారు. ప్రీ-రికార్డెడ్ సౌండ్ ట్రాక్స్, ఫిక్స్‌డ్ లైట్స్ పై ఆధారపడి ఈ షో నిర్వహిస్తూ వస్తున్నారు. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో.. గోల్కొండ చరిత్రను మరింత గొప్పగా చూపించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 3డీ మ్యాపింగ్ ప్రొజెక్షన్, హై-రెజల్యూషన్ ప్రొజెక్టర్లు, లేజర్ లైట్లు, మూవింగ్ హెడ్స్ వంటి అధునాతన సాంకేతికతను సమకూర్చింది. ఆ సాంకేతికత కలబోతతో వినూత్నంగా రూపొందించిన ఈ షో సందర్శకులను ఆకట్టుకోనుంది. ఈ షో సమయం: 30 నిమిషాల 20 సెకండ్లు కాగా తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఉంటుంది. ఇక గోల్కొండ కోట బయటి గోడల ఇల్యుమినేషన్ వామ్ వైట్ (తెలుపు) రంగులో ఉంటుంది. ముఖద్వారం, భద్రాద్రి హాల్ త్రివర్ణ పతాకంతో వెలుగులీననున్నాయి. మొత్తం లక్ష చదరపు అడుగుల వైశాల్యం గల బయటి గోడలకు (ఫసాడ్ ఏరియా) వెలుగులు అందించేందుకు 1400 ఎనర్జీ ఎఫిషియంట్ ఎల్‌ఈడీ లైట్లు అమర్చారు.

అడవే చెంచులకు అమ్మ

▶ మొదటి పేజీ తరువాయి

మన్ననూర్ వెళ్లి తెచ్చుకున్న సరుకులతోనే సరిపెట్టుకుంటున్నారు. ఏమీ దొరక్కపోతే పప్పులు, తొక్కులు, చింత పులుసుతోనే రోజులు గడుపుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యమే వీరికి ప్రధాన ఆహారం. అడవిలో లభించే చెంచుగడ్డలు, చింతపులుసు, చింతచిగురు, నెమలినార, ఆకుకూరలు, యార్లగడ్డ, మూలగడ్డ, శాదగడ్డ తదితర గడ్డలు, కందమూలాలను చెంచులు ఆహారంగా తీసుకుంటారు. అయితే ఇవి సీజన్‌లోనే లభిస్తాయి. చెంచుగడ్డలు, ఇతర గడ్డలను ఎండాకాలంలో గడ్డి ఎండిపోయాక మాత్రమే సేకరించేందుకు వీలుంటుంది. దీంతో మిగతా సమయాల్లో వీరికి పోషకాహారం దొరకడం లేదు.

బడికి దూరం....

చెంచు చిన్నారులు బడికి దూరంగా ఉంటున్నారు. అటవీ ప్రాంతంలోని ఫర్హాబాద్ గేటు నుంచి మల్లాపూర్, రాంపూర్, మేడిమలకల, సంగిడిగుండాల తదితర చెంచు పెంటలకు అప్పాపూర్‌లోని ఒక్క గిరిజన పాఠశాలే దిక్కు. ఇందులో ఐదో తరగతి వరకు ఉండటంతో చిన్నారుల చదువు అక్కడికే పరిమితమవుతోంది. అడవి నుంచి బయటకు వెళ్లి విద్యాబోధన సాగించేందుకు చెంచులు ఇష్టపడడం లేదు. అప్పాపూర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేస్తే కనీసం పదోతరగతి వరకైనా చదువుతారు. ఇంటర్, డిగ్రీ వరకు చదివే వారు పదుల సంఖ్యలోనే ఉంది.

ఉపాధి హామీ పథకమే ఆదాయ వనరు

చెంచులు ప్రధానంగా తేనె, చింతకాయలు, చీపుర్లు, ఇతర అటవీ ఉత్పత్తులు సేకరించి జీవనోపాధి పొందుతున్నారు. అటవీ అధికారుల ఆంక్షల నేపథ్యంలో ఉపాధి సైతం కరువైందని చెంచులు వాపోతున్నారు. ఉపాధి హామీ కూలీ డబ్బులే ప్రధాన ఆర్థిక వనరుగా మారింది.

గిరిపోషణ అంతంతే...

చెంచు చిన్నారులు, మహిళలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం నివారించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన గిరిపోషణ తూతూమంత్రమే అయ్యింది. జొన్నలు, రాగులు, సజ్జలు తదితర తృణధాన్యాలతో పౌష్టికాహారాన్ని అందించేలా హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, ఇక్రిశాట్ సంయుక్తంగా పోషకాహార ప్రణాళిక రూపొందించాయి. ఈ మేరకు మన్ననూర్ ఐటీడీఏ పరిధిలో 3,900 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. ఐటీడీఏతో పాటు ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలుకు శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ లేని చెంచు పెంటల్లో మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా తృణధాన్యాలతో ఉదయం, సాయంత్రం మల్టీగ్రెయిన్ మీల్, స్వీట్ మీట్, రాగులు, జొన్నలతో చేసిన చిక్కీలు, పట్టీలు, జవార్ బైట్స్ వంటి బలవర్థక ఆహారం అందజేశారు. కానీ ఈ కార్యక్రమం 2,3 నెలలకే పరిమితమైంది.



చీపుర్లు అమ్ముకునేందుకు అప్పాపూర్ నుంచి 30 కి.మీ. దూరంలోని మన్ననూర్‌కు కాలినడకన వస్తున్న చెంచులు

దెబ్బ తాకినా, చేయివిరిగినా నాటు వైద్యమే

రెండు నెలల కిందట చెట్టు నుంచి జారి కింద పడ్డ. చేయి విరిగింది. డిండికి పోయి కట్టు కట్టించుకున్న. సుస్తీ అయితే ఆస్పత్రికి పోము. ఆస్పత్రికి వెళ్లాలంటే మన్ననూర్ లేకుంటే వటవర్లపల్లికి పోవాలి. అటు ఎటు పోవాలన్నా దూరం 50 కిలోమీటర్లు ఉంటది. అక్కడ మందులు మాత్రమే ఇస్తారు. మళ్లీ జిల్లా కేంద్రానికి వెళ్లమంటారు. అటు 80 కిలోమీటర్ల బదులు డిండికి వెళ్తా. ఇక్కడ అందరికి నాటువైద్యమే.



నాగయ్య, అప్పాపూర్

ఐదో తరగతి వరకే...



అప్పాపూర్‌లో ఐదోతరగతి వరకు బడి ఉంది. అంతవరకే చదువుకున్నా. తర్వాత పైచదువుల కోసం బయటకు వెళ్లలేదు. నాతో పాటు చాలా మంది ఇక్కడితోనే ఆపేశారు. ఇప్పటికీ ఇదే పరిస్థితి.

– తోకల గురువయ్య, అప్పాపూర్

సార్లు వస్తేనే సౌకర్యాలు



గిరిపోషణ కింద ఇంతకు ముందు జొన్నలు, సజ్జలతో ఉదయం, సాయంత్రం ఉప్మా ఇచ్చారు. ఏడాది కాలంగా ఏమీ ఇవ్వడం లేదు. గవర్నర్ మేడం, సార్లు వస్తున్నప్పుడు మాత్రమే సౌకర్యాలు చేస్తున్నారు. ఆ తర్వాత మమ్మల్ని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

– నాగమ్మ, మల్లాపూర్ పెంట, నాగర్‌కర్నూల్

'భారత్ గౌరవ్' రైలు ప్రారంభం




సాక్షి, హైదరాబాద్: జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'భారత్ గౌరవ్'రైలు మంగళవారం సికింద్రాబాద్ స్టేషన్ నుంచి యాత్రికులతో బయల్దేరింది. ఈ పర్యటనలో తిరువణ్ణామలై (అరుణాచలం), రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు తదితర ప్రాంతాలను సందర్శించనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో 10 స్టేషన్‌ల మీదుగా ఈ రైలు వెళ్లనుంది. హైదరాబాద్‌కు చెందిన యాత్రికుడు రఘుమా రెడ్డి భారత్ గౌరవ్ రైలును మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఐఆర్‌సీటీసీ గ్రూప్ జనరల్ మేనేజర్ రాజ్ కుమార్, దక్షిణమధ్య రైల్వే అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో మాత్రమే ప్రయాణికులకు హాల్టింగ్ సదుపాయం ఉంటుంది. భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలుకు ప్రయాణికుల నుంచి విశేషమైన స్పందన లభిస్తుందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సంతోషం వ్యక్తం చేశారు.

గుర్రమే జోడెద్దు..



చెన్నారావుపేట: ఉన్న ఒక్క ఎద్దుకు పెంచుకున్న గుర్రం తోడైంది. పొలంలో కాడెత్తి రైతుకు ఆసరాగా నిలిచింది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన మేరుగు రాములు అనే రైతు ఆరేళ్ల కిందట ఓ గుర్రం పిల్లను తెచ్చుకుని పెంచుకున్నాడు. అతనికున్న కొద్దిపాటి వ్యవసాయంతో 3 ఎకరాల వరకు భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. నాటు వేసే ముందు పొలం మడిలో గొర్రు కొట్టాల్సి ఉంది. దీంతో అతనికున్న ఎద్దుకు గుర్రం జతకట్టి మంగళవారం గొర్రు కొట్టాడు.

టుడేస్ గ్రాఫిక్



నార్కో టెర్రరిజంపై శిక్షణకు టీఎస్-నాబ్

- ఘజియాబాద్‌లోని సీడీటీఐలో నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అధీనంలోని సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ స్కూల్(సీడీటీఐ) తొలిసారిగా నార్కో టెర్రరిజంపై వివిధ పోలీసు విభాగాలు, ఏజెన్సీలకు శిక్షణ ఇస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఉన్న ఈ సంస్థ సోమవారం నుంచి మూడురోజులపాటు నిర్వహించే ఈ శిక్షణకు తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీఎస్-నాబ్)కు చెందిన బృందం హాజరవుతోంది. ఇందులో కేంద్ర నిఘా వర్గాలు సైతం పాల్గొననున్నాయి. ఉగ్రవాదం-మాదకద్రవ్యాల దందా మధ్య ఉన్న సంబంధాలను సీడీటీఐ నిపుణులు వివరించనున్నారు. ఉగ్రవాదానికి డ్రగ్స్ దందా ద్వారా నిధులు అందుతున్నాయని ఏళ్లుగా అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. ఇటీవల చోటుచేసుకున్న ఉదంతాలు, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) నమోదు చేసిన కేసులు, వివిధ రాష్ట్రాల్లో అరెస్టులతో అనుమానాలకు ఆధారాలుగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో యువత నిర్వీర్యం కాకుండా కాపాడటంతోపాటు ఉగ్రవాదం విస్తరణను అడ్డుకోవడానికి మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపడం అనివార్యంగా మారింది. ఈ కోణంలోనే పోలీసులు, ప్రత్యేక బలగాలను సమాయత్తం చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ శిక్షణ ఇస్తోంది.

కమిషనర్ చాంబర్‌లో కోడి వేలాడదీసి..

కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మున్సిపాలిటీలో వినూత్న నిరసన



కరీంనగర్: కుక్కల దాడిలో చనిపోయిన ఓ కోడిని కమిషనర్ చాంబర్‌లో వేలాడదీసి నిరసన తెలిపాడో వ్యక్తి. ఈ ఘటన కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మున్సిపాలిటీలో సంచలనం కలిగించింది. కొత్తపల్లికి చెందిన అజీజొద్దీన్ కోడిని పెంచుకుంటున్నాడు. సోమవారం సాయంత్రం సమయంలో వీధి కుక్కలు వెంటాడి కోడిని చంపాయి. దీంతో ఆగ్రహానికి గురైన అజీజొద్దీన్ చనిపోయిన కోడితో కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని కమిషనర్ వేణుమాధవ్ చాంబర్ ఎదుట వేలాడదీశాడు. కుక్కలు లేకుండా చూడాలని మున్సిపాలిటీ అధికారులకు పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశాడు.

కాంగ్రెస్ పార్టీ నకిలీ వెబ్‌సైట్ సృష్టించిన నిందితుడి అరెస్ట్



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): కాంగ్రెస్ పార్టీ పేరుతో నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించి, ఆ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విరాళాలు సేకరిస్తున్న నిందితుడిని నగర సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజస్తాన్ జైపూర్‌కి చెందిన సురేంద్ర చౌదరి(22) ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన www.donateinc.net వెబ్‌సైట్‌కు నకిలీగా www.donateinc.co.in పేరుతో వెబ్‌సైట్‌ను సృష్టించాడు. ఈ వెబ్‌సైట్‌ను వివిధ సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ చేస్తూ ఆన్‌లైన్ ద్వారా రూ.లక్షల్లో విరాళాలు సేకరించాడు. దీనిపై ఈ నెల 10న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని జైపూర్‌కి చెందిన సురేంద్ర చౌదరిగా గుర్తించడంతో పాటు అక్కడ్నుంచే ఈ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్నారు. సురేంద్ర చౌదరిపై ఐపీసీ 66సీ, 66డీ ఐటీ యాక్ట్, ఐపీసీ 420ల కింద కేసు నమోదు చేశారు. అనంతరం సైబర్ క్రైమ్ పోలీసుల ప్రత్యేక బృందం జైపూర్ వెళ్లి నిందితుడిని ట్రాన్సిట్ వారెంట్‌పై తీసుకువచ్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

సాక్షి
కరీంనగర్
బుధవారం । 24 । జనవరి । 2024



భక్తులకు చలువ పందిళ్లు

వేములవాడ: సమ్మక్క జాతర, మహాశివరాత్రి సమీపిస్తుండటంతో రాజన్న దర్శనానికి భక్తులు తరలివస్తున్నారు. దీంతో ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు వేయిస్తున్నారు.



బోనం మొక్కులు

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకునేందుకు బారులుతీరారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

గరిష్టం/కనిష్టం
31.0/18.0

వాతావరణం

జిల్లాలో ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలి తీవ్రత ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సమాన విద్య అందించాలి



కరీంనగర్: సమాన విద్య, సమాన అవకాశాలు అందించినప్పుడే రాజ్యాంగం ఆశించిన సమసమాజ నిర్మాణం జరుగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అన్నారు. జెడ్పీ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో ఫిబ్రవరి 11,12వ తేదీల్లో జరిగే విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంకల్పబలం ద్వారానే మంచి సమాజం నిర్మాణం అవుతుందని అన్నారు. ఉపాధ్యాయులపై ఎంతో బాధ్యత ఉందని, ఆ బాధ్యతను నెరవేర్చినప్పుడే ఉపాధ్యాయుడు సంతృప్తిగా ఉండగలుగుతాడని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కనుమల్ల గణేశ్, టీపీటీఎఫ్ నాయకులు రాములు, దామోదర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రామస్వామి, వెంకటేశ్వర్లు, సంధ్యారాణి, రాధికారాణి, భాగ్యలక్ష్మి, ప్రమీల, స్వాతి, రామస్వామి, తిరుపతి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కరీంనగర్‌రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఎస్.మల్లేశ్ అన్నారు. కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ ఉన్నత విద్యామండలి సౌజన్యంతో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ, పర్యవేక్షణ పద్ధతులపై జాతీయ సదస్సును మంగళవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ.. విద్యార్థి దశనుంచే పర్యావరణపై అవగాహన కల్పించాలన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఉన్నత విద్యామండలి సంయుక్త కార్యదర్శి జి.నిరూప మాట్లాడుతూ పర్యావరణంపై అందరికి అవగాహన ఉన్నప్పుడే కాపాడేందుకు కృషి చేస్తారన్నారు. ప్రొఫెసర్ డి.కాశీనాథ్ పర్యావరణ పరిరక్షణలో గ్రీన్ కెమిస్ట్రీ అవశ్యకతను వివరించారు. సిద్దిపేట డిగ్రీ కళాశాల లెక్చరర్ మదన్‌మోహన్ భూగర్భల జలకాలుష్యం-భారత్ ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు. రిమోట్‌సెన్సింగ్ ఫర్ ఓసియన్ మానిటరింగ్‌పై డాక్టర్ స్వప్న వివరించారు. మొదటిరోజు సదస్సులో 150 మంది లెక్చరర్లు, 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ జి.సమత, సదస్సు కన్వీనర్ ఎస్.సుష్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గీతారాణి, కో- కన్వీనర్ జి.స్వప్న, స్వాతి, మనీషా తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే పోషక విలువలు



చొప్పదండి: ప్రస్తుతకాలంలో ప్రతి విద్యార్థి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జాతీయ ఉత్తమ రైతు అవార్డు గ్రహీత మావురం మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ గురుకుల బాలికల విద్యాలయంలో వ్యవసాయం, విద్యార్థులు అనే అంశంపై మాట్లాడారు. ప్రతి వ్యక్తి ఉద్యోగంలో స్థిరపడాలనే ఆలోచనతో వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రసాయన ఎరువులస్థానంలో సేంద్రియ ఎరువులు వాడితేనే పోషక విలువలు పెరుగుతాయని, వ్యవసాయ కుటుంబాల విద్యార్థులు భూసార పరీక్షల ఆవశ్యతను తమ తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. సాఫ్ట్‌వేర్ రంగంలో తొమ్మిదేళ్లు సేవలు అందించిన తాను, పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తన వ్యవసాయ విధానం గుర్తించి జాతీయ ఉత్తమ రైతు అవార్డు అందించినందని, ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో మాట్లాడటం జీవితంలో మర్చిపోలేనిదన్నారు. ప్రిన్సిపాల్ స్వాతి, వెంకటేశ్, శంకర్, అజయ్‌కుమార్, శంకర్ రెడ్డి, సదానందం పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ సమావేశం

కరీంనగర్: బీఆర్‌ఎస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం సోషల్ మీడియా వారియర్స్ సమావేశం బుధవారం రేకుర్తిలోని రాజశ్రీ కన్వెన్షన్‌లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో జరుగుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, ఒడితెల సతీశ్ కుమార్, సుంకె రవిశంకర్, చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరవుతారని ఈ సందర్భంగా వివరించారు.

‘దళితబంధు’ అందని ద్రాక్షేనా?

- 1,020 మందికి పూర్తిస్థాయిలో అందని నిధులు
- హుజూరాబాద్‌లో 8వేల మందికిపైగా ఎదురుచూపులు
- రూ.290 కోట్లు ఖాతాల్లో ఉన్నా డ్రా చేసుకోలేని వైనం
- వెంటనే మంజూరు చేయాలని లబ్ధిదారుల డిమాండ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

రాష్ట్రంలో దళితుల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి మార్చేందుకు గత ప్రభుత్వం ప్రారంభించిన దళితబంధు పథకం నిలిచిపోయింది. లబ్ధిదారుల ఖాతాల్లో పథకానికి సంబంధించిన రూ.లక్షల్లో డబ్బులు ఉన్నా.. వాటిని డ్రా చేసుకోలేని విచిత్ర పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పథకం కోసం లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.290 కోట్లు వేసినా.. ఆ డబ్బులు ఎండమావులవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2021 ఆగస్టు 16వ తేదీన హుజూరాబాద్ మండలం శాలపల్లి గ్రామంలో అప్పటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ప్రతిష్టాత్మకంగా పథకాన్ని ప్రారంభించారు. ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా దళిత ప్రభుత్వ ఉద్యోగులకు సైతం ఈ పథకాన్ని వర్తింపజేశారు. హుజూరాబాద్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించి, నియోజకవర్గంలో సర్వేచేసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. దాదాపు 18,031 మందికి పథకాన్ని వర్తింపజేశారు. లబ్ధిదారులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే క్రమంలో రిటైల్, డెయిరీ, చిన్న పరిశ్రమలు, షాపులు, ప్రింటింగ్, బ్యాగుల తయారీ తదితర స్వయం ఉపాధి కార్యక్రమాలకు వేదికగా మారింది.

రెండు రకాలుగా పథకం అమలు

రాష్ట్రంలో దళితబంధు పథకాన్ని రెండు రకాలుగా అమలు చేశారు. మొదట హుజూరాబాద్ తరహాలో కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకుని ఆ ప్రాంతంలో ఉండే దళితులందరికీ పూర్తిస్థాయిలో పథకాన్ని అమలు చేయడం. దీన్ని సారురేషన్ మోడ్ అంటారు. రెండోది రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ప్రతీ నియోజకవర్గాల్లో 1,100 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి రూ.10 లక్షలు అందించి వారితో వ్యాపారాలు చేయించడం. దీన్ని టార్గెట్ మోడ్ అంటారు. పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో టార్గెట్ మోడ్, కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్‌లో సాచురేషన్ మోడ్‌లో, మిగిలిన నియోజకవర్గాల్లో టార్గెట్ మోడ్ అమలు చేశారు.

నిధులకు కటకట

హుజూరాబాద్‌లో 18వేలమందిలో మెజారిటీ లబ్ధిదారులకు రూ.10లక్షలకు మించి అందజేశారు. వీరిలో అత్యధికంగా జేసీబీ, లారీ, ట్రక్కు, వరినాటు యంత్రాలు, ఆటోలు, కార్లు ఎంపిక చేసుకున్నారు. తరువాత పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా వర్తింపజేశారు. వాహనాలకు ప్రాధాన్యం తగ్గించి వ్యాపారాలను ప్రోత్సహించారు. అందులో రూ.5లక్షలు తొలుత ఇచ్చి, అవసరాన్ని బట్టి వ్యాపార విస్తరణకు తగిన కారణాలు చూపించిన వారికి ఇస్తూ పోయారు. ఇప్పటివరకు హుజూరాబాద్‌లోని ఇల్లందకుంట, హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక మండలాల్లో 6,868మంది, కమలాపూర్ మండలంలో 1,280 మందికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదు. మొత్తంగా హుజూరాబాద్‌లో 8,148 మందికి, మిగిలిన ఉమ్మడి జిల్లాలో 1,020 మందిని కలిపితే.. 9,168 మంది ఇంకా పథకంలో రెండో విడత కింద ఉన్న రూ.290 నిధుల విడుదల అనుమతి కోసం చకోర పక్షుల్లా ఎదురుచూస్తున్నారు.

పథకంపై నీలి నీడలు

ఎన్నికల సమయానికి ప్రభుత్వం వద్ద నిధులకు కటకట ఏర్పడింది. దీంతో లబ్ధిదారులకు రూ.2 లక్షలు, రూ.3 లక్షల చొప్పున ఇచ్చి సర్ది చెప్పారు. కొన్నిచోట్ల రూ.10లక్షలను ఐదుగురికి పంచిన సందర్భాలున్నాయని పలువురు వాపోతున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వీరందరికీ ఖాతాల్లో వేసిన డబ్బులు డ్రా చేసుకునేందుకు అనుమతివ్వలేదు. ఎన్నికల అనంతరం అనుమతి వస్తుంది అనుకున్నా ఇంతవరకూ ఈ పరిస్థితి లేకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. అసలు పథకం అమలు అవుతుందా? లేదా అన్న సందిగ్ధం నెలకొంది.



కరీంనగర్‌లో దళితబంధు యూనిట్లు అందిస్తున్న అప్పటి మంత్రి గంగుల కమలాకర్, తదితరులు(ఫైల్)

	లబ్ధిదారులు	నిలిచిపోయింది	ఫ్రీజైనవి(రూ.లక్షల్లో)
కరీంనగర్	210	04	3.50
జగిత్యాల	345	24	46.37
పెద్దపల్లి	259	14	60.28
రాజన్నసిరిసిల్ల	206	55	80.48
హుజూరాబాద్	18,031	8,194	273.59 (కోట్లు)

రెండో విడత ఇవ్వలేదు



మేము అరుగురం కలిసి ఒకఫర్మ్‌గా ఏర్పడి కోళ్ల ఫారం పెట్టుకున్నాం. మొదటి విడతలో ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున వచ్చాయి. రెండో విడుత డబ్బులు ఇవ్వలేదు. ఇప్పటికీ రేకుల షెడ్డు పూర్తి అయ్యింది. అప్పటి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ కూడా వచ్చి పరిశీలించారు. రెండో విడుతా తొందరగా విడుదల చేయాలి. ఈ విషయంపై అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– శ్రవణ్, చల్లూర్, వీణవంక

దళితబంధు ఇవ్వాలి



దళిత బంధ్ కోసం దరఖాస్తు చేసుకున్నాం. మంజూరైనట్లుగా బుక్, మెసేజ్ వచ్చింది. బుక్ లో అమౌంట్ క్రెడిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. కానీ బ్యాంకుకు వెళ్లి అధికారులను అడిగితే అమౌంటున్ హోల్డ్‌లో ఉందని తెలిపారు. దళితబంధు డబ్బులు అందించాలని కోరుతున్నాను.

– రాచపల్లి రాజశేఖర్, విలాసాగర్, జమ్మికుంట

బల్దియా గరం గరం

‘నగరపాలకసంస్థలో ఇంజినీరింగ్ విభాగానికి ఉన్నతాధికారి, ఎస్ఈ నాగమల్లేశ్వరరావును ఈఎన్‌సీకి సరెండర్ చేస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఎల్‌పీసీ ఇవ్వకుండానే రెండేళ్లుగా ఇక్కడ విధులు నిర్వహిస్తుండడం, బల్దియాలోని ఇంజినీరింగ్ విభాగంపై వస్తున్న అవినీతి, ఆరోపణలు పట్టించుకోకపోవడంతో ఈ వేటు పడింది.’

‘నగరపాలకసంస్థలో సీనియర్ అధికారిగా ‘ప్రత్యేక’ గుర్తింపు పొందిన డీఈ మసూద్ అలీపై ఇటీవల ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. స్మార్ట్‌సిటీపనుల్లో వివిధ ఆరోపణల నేపథ్యంలో పలువురు కార్పొరేటర్లు వరుసగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మసూద్‌ను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు’.

- ఫిర్యాదులు, విచారణలు, చర్యలు
- పరిపాలనలో కాస్త మారిన తీరు
- కొనసాగించాలని నగరవాసుల డిమాండ్



కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థలో పరిపాలనా పరంగా ఇటీవల చోటుచేసుకొంటున్న పరిణామాల్లో ప్రధాన ఘట్టాలు ఇవీ. వీటితో పాటు ఆరోపణలు, ఫిర్యాదులు, మీడియా కథనాలపై ప్రభుత్వం వేగంగా స్పందిస్తూ విచారణ చేపడుతోంది. బాధ్యులుగా తేలితే వేటు వేస్తోంది. గతంలో లేని విధంగా నగరపాలకసంస్థ వ్యవహారాలపై ఉన్నతాధికారుల తీరులో మార్పు కనిపిస్తోంది. ఏళ్ల కాలంగా నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినప్పటికీ, చర్యలు కాదుకదా కనీసం విచారణకు కూడా నోచుకోలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫిర్యాదులపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుండడంతో, ఇదే అదనుగా గతంలో ఫిర్యాదు చేసిన చాలా మంది మళ్లీ సమస్యలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ప్రారంభించారు.

ఫిర్యాదులపై విచారణ

నగరపాలకసంస్థలోని పలువురు అధికారులపై ఇటీవల వరుసగా ఫిర్యాదులు వస్తుండడం తెలిసిందే. ప్రధానంగా అభివృద్ధి పనులు పర్యవేక్షించే ఇంజనీరింగ్ విభాగంతో పాటు, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, పారిశుధ్య విభాగాలు ఇందులో ఉన్నాయి. రెండు సంవత్సరాలుగా ఎల్‌పీసీ ఇవ్వకుండానే విధులు నిర్వహిస్తున్న ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, పలు ఆరోపణలు ఎదుర్కొన్న డీఈ మసూద్ అలీపై ప్రభుత్వ సత్వర విచారణ చేపట్టింది. వీటితో పాటు డీజిల్ కుంభకోణం ఆరోపణలు, ఫిర్యాదులపై కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్ విచారణపై దృష్టిపెట్టారు. ఇటీవల ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు ఆర్డీవోను విచారణాధికారిగా నియమించారు. ఒకటి రెండు రోజుల్లో ఆయన పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, నివేదిక ఇచ్చే అవకాశం ఉంది. ఇక ప్రజాపాలన దరఖాస్తులు కొన్ని ఆన్‌లైన్ చేయకపోవడంపైనా అంతర్గతంగా ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో అనుమతులు, ఆరోపణలు, ఫిర్యాదులపైనా దృష్టి సారించినట్లు సమాచారం.

చర్యలు కూడా

ఆరోపణలు, ఫిర్యాదులపై విచారణ చేపట్టడంతోనే సరిపెట్టకుండా చర్యలు తీసుకుంటుండడం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. గతానికి భిన్నంగా విచారణ చేయడం...పగడ్బందీగా చర్యలు తీసుకోవడం చకచకా జరిగిపోతున్నాయి. ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డీఈ మసూద్‌అలీలపై చర్యలే ఇందుకు నిదర్శనం. ఇదిలా ఉంటే భూ కబ్జాల ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు కార్పొరేటర్లపై విచారణ కొనసాగుతుండడం గమనార్హం. బల్దియాకు నేరుగా సంబంధం లేకున్నా, కబ్జాలకు అధికారుల సహకారం తీసుకుంటున్న కొంతమంది కార్పొరేటర్ల వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టడం చర్చనీయాంశం అయింది.

కొనసాగించాల్సిందే

నగరపాలకసంస్థ పరిధిలో ప్రస్తుతం కొనసాగుతున్న పరిణామాలను మూణ్నాళ్ల ముచ్చటగానే కాకుండా, ప్రక్షాళన సాగేలా కొనసాగించాలని నగరవాసులు కోరుతున్నారు. కొంతమంది అవినీతి అధికారులు, ఉద్యోగుల మూలంగా బల్దియా అప్రతిష్టను మూటకట్టుకొంటోందని, అలాంటి వారిని గుర్తించి చర్యలు చేపట్టే ప్రస్తుత విధానాన్ని తప్పకుండా కొనసాగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఏదేమైనా గతంలో లేని విధంగా నగరపాలకసంస్థలో ఇటీవల వరుసగా చోటుచేసుకొంటున్న పరిణామాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

నేడు పోలీసు కస్టడీకి కార్పొరేటర్

కరీంనగర్‌క్రైం: నగరంలోని భగత్‌నగర్‌లో నివాసం ఉండే కొత్త రాజిరెడ్డికి చెందిన భూమి విషయంలో ఇబ్బందులకు గురిచేసిన కేసులో జిల్లాజైలులో రిమాండ్‌లో ఉన్న కార్పొరేటర్ తోటరాములు, చీటీ రామారావును కస్టడీ కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. పరిశీలించిన కోర్టు ఇద్దరి కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇరువురిని పోలీసులు కస్టడీకి తీసుకొని విచారణ చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు తెలిసింది. భూ దందాలకు పాల్పడుతున్న మరో ఇద్దరు కార్పొరేటర్ల అరెస్టుకు రంగం సిద్ధం అవుతున్నట్లు సమాచారం.

నెగ్గేనా?.. వీగేనా?

- రేపు జమ్మికుంట మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం
- అవిశ్వాసంపై సర్వత్రా ఉత్కంఠ
- 26 రోజులుగా క్యాంపు రాజకీయాలు



జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం

జమ్మికుంట: జమ్మికుంటలో రోజురోజుకు ఉత్కంఠ పెరుగుతోంది. మున్సిపల్ చైర్మన్‌పై నెలకొన్న అవిశ్వాస రగడ రోజుకో మలుపు తిరుగుతోంది. 26 రోజుల క్యాంపు రాజకీయాలకు ఈనెల 25న జరిగే కౌన్సిల్ సమావేశంతో తెరపడనుందని భావిస్తుండగా చైర్మన్‌పై అవిశ్వాసం వీగేనా..? నెగ్గేనా..? అనే ఉత్కంఠ నెలకొంది. మున్సిపల్ కౌన్సిల్‌లో 30మంది సభ్యులు ఉండగా అవిశ్వాస సమావేశానికి 2/3 అంటే 20మంది హాజరు కావాలనే నిబంధన ఉంది. ఈ క్రమంలో పొనగంటి మల్లయ్య వర్గం క్యాంపులో 16, చైర్మన్ రాజేశ్వర్‌రావు వర్గం క్యాంపులో 14మంది కౌన్సిలర్లు ఉన్నట్లు సమాచారం.

26 రోజులుగా క్యాంపులోనే..

జమ్మికుంట మున్సిపల్‌లో 30మంది కౌన్సిల్ సభ్యులు ఉన్నారు. వీరిలో 29మంది బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన వారే. సాయిని రమ మాత్రమే కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు చైర్మన్‌గా నాలుగేళ్లుగా పాలన సాగిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 23వ వార్డు కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత చైర్మన్‌పదవిపై మల్లయ్య కన్నేశారు. కొంతమంది కౌన్సిలర్లతో అవిశ్వాసానికి సిద్ధం అయ్యారు. ఈ క్రమంలోనే 20 మంది కౌన్సిలర్ల సంతకాలతో చైర్మన్ రాజేశ్వర్‌రావుపై అవిశ్వాసం ప్రకటిస్తున్నట్లు గత డిసెంబర్ 29న డీఆర్‌వోకు లేఖ అందించారు. 24 గంటలు గడవకముందే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రంగంలోకి దిగారు. చైర్మన్ రాజేశ్వర్‌రావుకు మద్దతు ఇస్తున్నట్లు 23మంది కౌన్సిలర్ల సంతకాలతో కలెక్టర్ పమేలా సత్పతికి లేఖ అందించారు. అనంతరం ఇరువర్గాల వారు కౌన్సిలర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. క్యాంపు రాజకీయాలు, నజరానాలతో ఆకర్షించే పనిలో నిమగ్నమయ్యారు. 26 రోజులుగా ఇరువర్గాల కౌన్సిలర్లు వేర్వేరుగా క్యాంపుల్లో ఉన్నారు.

25న కౌన్సిల్ సమావేశం

జమ్మికుంట మున్సిపల్ అవిశ్వాసంపై ఈ నెల 25న కౌన్సిల్ సమావేశం ఉంటుందని కలెక్టర్ పమేలా సత్పతి కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశారు. అవిశ్వాస సమావేశానికి 2/3 సభ్యులు అంటే 20మంది హాజరు తప్పనిసరి. ఈ క్రమంలో చైర్మన్ రాజేశ్వర్‌రావు క్యాంపులో ఉన్న 14మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాకూడదని నిర్ణయించుకున్నట్లు సమాచారం. మల్లయ్యవర్గంలోని 16మంది కౌన్సిలర్లు హాజరైన కూడా ప్రయోజనం ఉండదనేది వినికిడి. దీంతో ఇరువర్గాలు మెజారిటీ కౌన్సిలర్ల మద్దతు కూడబెట్టుకునే పనిలో పడ్డారు.

క్వింటాల్ పత్తి ధర రూ.6,750

జమ్మికుంట: జమ్మికుంట పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి రూ.6,750 పలికింది. మంగళవారం మార్కెట్‌కు 84వాహనాల్లో 676 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు.మోడల్ ధర రూ.6,700, కనిష్ట ధర రూ.6,100 పలికింది. గన్నీ సంచుల్లో 8మంది రైతులు 17క్వింటాళ్ల పత్తిని తీసుకొచ్చారు. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,300, మోడల్ ధర రూ.6,000, కనిష్ట ధర రూ.5,800కు వ్యాపారులు కొనుగోలు చేశారు. క్రయ విక్రయాలను కార్యదర్శి గగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

వెనకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం రెవెన్యూ గార్డెన్స్‌లో 10వ తరగతి పరీక్షలపై ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గత విద్యా సంవత్సరాల్లో పదోతరగతి పరీక్షలు రాసి ఫెయిలైన 151మందిని గుర్తించినట్లు తెలిపారు. వారు చాలా రోజులుగా చదువుకు దూరంగా ఉన్నారని, అలాంటివారిపై టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుత విద్యాసంవత్సంలోని విద్యార్థులతో పాటుగా వారికి కూడా పాఠాలు చెప్పాలని తెలిపారు. అవసరమైతే వారికోసం జిల్లా పరిపాలన నుంచి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఒక్క సబ్జెక్టులో ఫెయిలైనంత మాత్రాన అంతా అయిపోయిందని భావించకూడదని, మరోసారి ప్రయత్నించి విజయం సాధించాలని సూచించారు. జిల్లావిద్యాధికారి జనార్దన్‌రావు, సెక్టోరియల్ ఆఫీసర్ అశోక్ రెడ్డి, డీఈవో కార్యాలయ సూపరిండెంటెంట్ స్వామి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో అంధులకు ప్రత్యేక ఏర్పాట్లు

కరీంనగర్ కల్చరల్: జిల్లా గ్రంథాలయంలో దివ్యాంగుల కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. మంగళవారం జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. రీడింగ్ గదులను పరిశీలించారు. దివ్యాంగులు అనుకూలమైన వాతావరణంలో చదువుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా అంధులు చదువుకునేందుకు బ్రెయిలీ లిపిలో ఉన్న పుస్తకాలు ఆడియో ప్లేయర్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వయోవృద్ధుల డేకేర్ సెంటర్‌ను సందర్శించినారు. అక్కడి వృద్ధులతో మాట్లాడారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, డే కేర్ సెంటర్ ప్రధాన కార్యదర్శి పి కేశవరెడ్డి, ట్రెజరర్ సత్యనారాయణ ఉన్నారు.

త్వరితగతిన సీఎమ్మార్ దిగుమతి చేసుకోవాలి



జమ్మికుంట: సీఎమ్మార్ బియ్యాన్ని మిల్లర్లు ఈ నెల 31వ తేదీలోగా అప్పగించాలని, ఎఫ్‌సీఐ అధికారులు త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ సూచించారు. మంగళవారం జమ్మికుంటలోని ఎఫ్‌సీఐని సివిల్ సప్లై డీఎం రజినీకాంత్, డీఎస్‌వో సురేశ్, రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగరావులతో కలిసి సందర్శించారు. నాణ్యతతో కూడిన సీఎమ్మార్ 60 నుంచి 100 ఏసీకేలు పాస్ చేయాలన్నారు. ఇందుకోసం ఈనెల 31వ తేదీ వరకు గడువు ఉందని అన్నారు. తహశీల్దార్ రజనీ, డీటీలు సంతోష్‌కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

గెస్ట్‌హౌస్ పేరు మారింది



ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌గా ఏర్పాటు చేసిన అధికారులు

కరీంనగర్‌కార్పొరేషన్: జిల్లా కేంద్రంలోని కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్‌హౌస్ పేరు మారింది. మంగళవారం కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్‌హౌస్ పేరును ఆర్అండ్‌బీ అతిథిగృహంగా మారుస్తూ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. 50ఏళ్ల క్రితం నిర్మించిన ఈ గెస్ట్‌హౌస్‌ను గత బీఆర్‌ఎస్ హయాంలో ఆధునీకరించారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పేరు వచ్చేలా కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్‌హౌస్ (కేసీఆర్)అని నామకరణం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, కేసీఆర్ పేరుపై అభ్యంతరం వ్యక్తమైంది. ఆర్అండ్‌బీ అతిథిగృహంగా మార్చాలని పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించారు. రెండు రోజుల క్రితం కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్ అని గెస్ట్‌హౌస్‌కున్న అక్షరాలను తొలగించారు. దీనిపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల నడుమ విమర్శలు, ప్రతి విమర్శలు చోటుచేసుకొన్నాయి. తొలగించిన బోర్డు స్థానంలో మంగళవారం ఆర్అండ్‌బీ అతిథిగృహం అనే అక్షరాలు ఏర్పాటు చేశారు. మరోబోర్డుపై కూడా ఆర్అండ్‌బీ అతిథిగృహం అని మార్చారు.

క్లుప్తంగా

జాతీయ సదస్సుకు ఉపాధ్యాయుడి ఎంపిక


వినయధర్ రాజు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఢిల్లీలోని విశ్వ యువ కేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు చిగురుమామిడి మండలంలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వినయధర్ రాజు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన ఎల్ఎండీలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో సీపీడీ టీంలో పని చేస్తున్నారు. నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్‌షిప్ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీలో భాగంగా సదస్సు నిర్వహించనున్నారు. దీనికి దేశవ్యాప్తంగా 400 కేస్ స్టడీస్, 30 పరిశోధన పత్రాలు రాగా, మన రాష్ట్రం నుంచి 8 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వీరిలో వినయధర్ రాజు ఒకరు. ఈ సందర్భంగా ఆయనను డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మొండయ్య, అధ్యాపకులు మంగళవారం అభినందించారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు గిరిజన విద్యార్థిని..


యశస్విని

మల్లాపూర్(కోరుట్ల): ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు మల్లాపూర్ మండలంలోని వేంపల్లికి చెందిన గిరిజన విద్యార్థిని గుగ్లావత్ యశస్విని ఎంపికైంది. ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. గత అక్టోబర్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపూర్‌లో జరిగిన వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్‌కు హాజరై, ప్రతిభ కనబరిచింది. దీంతో ఆమె తల్లిదండ్రులు రమేశ్–లావణ్య, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీశ్, వేంపల్లి, వెంకట్రావ్‌పేట సర్పంచ్‌లు సరోజన, మమత తదితరులు మంగళవారం అభినందించారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ శివారు సాయిబాబా ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రమాకాంత్ కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తలుపులు బద్దలు కొట్టి, లోనికి ప్రవేశించారు. హుండీలోని రూ.10 వేలతోపాటు రెండు పంచలోహ, సాయిబాబా ఇత్తడి, ఆవుదూడ విగ్రహాలతోపాటు ఒక గంటను ఎత్తుకెళ్లారు. వీటి విలువ రూ.20 వేల వరకు ఉంటుంది. ఆలయ వాచ్‌మెన్ మరాఠి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కలపకు నిప్పు


కాలిపోయిన కలప

మానకొండూర్: మండల కేంద్రంలోని ఓం గణేశ్ సామిల్‌లో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కలపకు నిప్పంటించారు. మంటలు చెలరేగడంతో స్థానికులు, సామిల్ యజమాని శ్రీనివాస్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని, ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలు ఆర్పివేశారు. కలప కాలిపోవడంతో రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. దీనిపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఏడాదంతా కూరగాయలే

- కూరగాయల సాగుకు కేరాఫ్ శంకులపల్లె
- నేరుగా వినియోగదారులకు విక్రయం


శంకులపల్లెలో సాగు చేసిన వివిధ రకాల కూరగాయల పంటలు

జగిత్యాలఅగ్రికల్చర్: ఆ గ్రామం కూరగాయల సాగుకు పెట్టింది పేరు. తమకున్న కొద్ది పాటి భూమిలోనే ఆ గ్రామ రైతులు రకరకాల కూరగాయలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పండించిన కూరగాయలను దళారుల ప్రమేయం లేకుండా నేరుగా మార్కెట్‌లో వినియోగదారులకు విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. ఆ గ్రామమే జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని శంకులపల్లె.

అన్నీ వ్యవసాయ కుటుంబాలే

శంకులపల్లె జగిత్యాల జిల్లా కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఒకప్పుడు మండల పరిధిలో ఉన్నప్పటికీ ఇటీవల మున్సిపాలిటీ పరిధిలోకి మారింది. గ్రామంలో దాదాపు 250 కుటుంబాలు, 2,500 జనాభా ఉంటోంది. అన్ని కుటుంబాలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నాయి. ఏదో నలుగురైదుగురు రైతులకు రెండెకరాల వరకు భూమి ఉంటే, మిగతా రైతులు ఎకరం లోపువారే. ఆ గ్రామ రైతులు రోజూ వేకువజామునే నిద్ర లేస్తారు. మహిళా రైతులు గేదెల పాలు పిండి, వాటిని అమ్మడానికి జగిత్యాల జిల్లా కేంద్రానికి వెళ్తారు. పురుషులు అంతకు ముందు రోజు తెంపిన కూరగాయలను మార్కెట్‌కు తీసుకెళ్తారు. పాలు విక్రయించిన మహిళలు నేరుగా మార్కెట్ వద్దకు చేరుకుని ఉదయం 10 గంటల వరకు కూరగాయలు అమ్ముతారు. తర్వాత ఇంటికి వచ్చి భోజనం చేసి, మళ్లీ కూరగాయల తోటకు వెళ్లి పనులు చేస్తుంటారు.

కూరగాయల సాగుపైనే దృష్టి

శంకులపల్లె గ్రామంలోని ప్రతీ రైతు కుటుంబం తమకు ఉన్న భూమిలో 80 శాతం కూరగాయల సాగుకే కేటాయిస్తారు. ఇందులో వంగ, బెండ, బీర, సోరకాయ, ఉల్లిగడ్డ, కొత్తిమీర, పాల కూర, అలిసెంత, క్యారెట్, క్యాబేజీ, కాలీఫ్లవర్, పచ్చిమిర్చి, టమాట, బీట్‌రూట్ తదితర కూరగాయలు సాగు చేస్తారు. ఏ నెలలో ఏయే కూరగాయలకు రేటు ఉంటుందో వారికి బాగా తెలుసు. మార్కెట్ డిమాండ్‌ను బట్టి, భూమిని ఖాళీ ఉంచకుండా, రోజూ మార్కెట్‌లో కూరగాయలు విక్రయించేలా సాగు చేస్తారు. అధిక దిగుబడుల కోసం వివిధ కంపెనీల హైబ్రిడ్ విత్తనాలు సేకరిస్తారు. ఒక పంట మార్కెట్‌కు వస్తున్న దశలోనే మరో పంటకు నారు పోస్తారు. ఇలా ఏడాది పొడవునా ఏదో ఒక పంట వారి తోటల్లో కనిపిస్తూ పచ్చదనంతో కళకళలాడుతుంటాయి.

వేసవిలో పూల అమ్మకం

చివరకు వేసవిలో మల్లెపూలు, బంతి, చామంతి, కనకాంబరం, పండ్లు కూడా విక్రయిస్తుంటారు. పంటలకు పశువుల ఎరువుతో పాటు అవసరమైనప్పుడు రసాయన ఎరువులు వాడుతారు. కూరగాయలు ఎక్కువగా కావాల్సిన వినియోగదారులు నేరుగా రైతుల తోటల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తారు. ఇలా కూరగాయల ద్వారా ఒక్కో రైతు రోజుకు కనీసం రూ.500 నుంచి రూ.1000 వరకు సంపాదిస్తారు. అలాగే కూరగాయల సాగుతో పాటు ప్రతీ కుటుంబం కనీసం ఒక పాడి గేదెను పెంచుకుని దాని ద్వారా రోజుకు 4–5 లీటర్ల పాలు అమ్మకం చేస్తుంటారు.

కూరగాయలే ఆధారం



మాకు ఉన్న 20 గుంటల భూమిలో టమాట, గోపి గడ్డ, క్యారెట్ వంటి అన్ని రకాల కూరగాయలు సాగు చేస్తాం. జగిత్యాల మార్కెట్‌కు ఉదయం పూట తీసుకెళ్లి నేరుగా విక్రయిస్తాం. అవసరమున్నవారు తోటల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తారు.

– రామిడి వెంకన్న, రైతు

దళారులకు అమ్మం



మా తోటలో పండిన కూరగాయలను దళారులకు అమ్మం. సాయంత్రం కూరగాయలు తెంపి, ఉదయం మార్కెట్‌కు తీసుకెళ్లి, నేరుగా మార్కెట్‌లో కూర్చుని అమ్ముకుంటాం. డిమాండ్‌ను బట్టి రేటు వస్తుంది.

– ముద్దం అమృత, మహిళా రైతు

కూరగాయల ఊరుగా..



మా ఊళ్లో రైతులందరూ కూరగాయలు సాగు చేస్తుండటంతో కూరగాయల ఊరు అని పేరు వచ్చింది. పూలు, నిమ్మకాయలు, బొప్పాయి వంటి పండ్లను కూడా అమ్ముతాం. భూమి తక్కువగా ఉండటంతో ఇతర పంటల జోలికి వెళ్లం.

– బూస లక్ష్మి, మహిళా రైతు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- బైక్‌ను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం
- కొదురుపాక బ్రిడ్జి పరిసరాల్లో ఘటన


కార్తీక్ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణ పరిధిలోని రగుడు గ్రామానికి చెందిన కాసర్ల కార్తీక్ (21) ఇంటర్ వరకు చదివాడు. సిరిసిల్లలోని ఓ మెడికల్ ఏజెన్సీలో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి బావుపేటలో ఉన్న మేనత్త ఇంటికి వెళ్తానని చెప్పి, బైక్‌పై బయలుదేరాడు. అనంతరం కొదురుపాక ఫోర్‌లేన్ బ్రిడ్జి పరిసరాల్లో గాయాలతో పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న వేములవాడకు చెందిన సందీప్ 108 వాహనానికి సమాచారం అందించాడు. సిబ్బంది వచ్చి పరీక్షించి, కార్తీక్ మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయాన్ని పోలీసులకు తెలిపారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని, మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి బాలయ్య ఆటోడ్రైవర్‌గా, తల్లి బీడీ కార్మికురాలిగా పని చేస్తున్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్తీక్ మృతి చెందినట్లు అతని సోదరుడు శేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు.

అప్పు తిరిగి చెల్లించాలని గొడవ

- మనస్తాపంతో మహిళ ఆత్మహత్య


మణెమ్మ మృతదేహం

గోదావరిఖని(రామగుండం): అప్పు తిరిగి చెల్లించాలని గొడవ చేశారని మనస్తాపంతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుందని గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గోదావరిఖనిలోని తిలక్‌నగర్ చెందిన జంగ మణెమ్మ(39) తన చిన్న కూతురు వివాహం కోసం కొన్నేళ్ల క్రితం ఎన్టీపీసీ గౌతమినగర్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.10 లక్షలు అప్పు తీసుకుంది. అప్పటి నుంచి ప్రతినెలా వడ్డీ చెల్లిస్తోంది. అయితే, ఈ నెల 22న తాను అప్పుగా ఇచ్చిన డబ్బులు చెల్లించాలంటూ సదరు వ్యక్తి ఆమె ఇంటికి వచ్చి, గొడవ చేశాడు. దీంతో మనస్తాపానికి గురైన మణెమ్మ మంగళవారం క్రిమిసంహారక మందు తాగింది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒగ్గు కళాకారుడి మృతి


రాయమల్లు (ఫైల్)

గొల్లపల్లి (ధర్మపురి): చికిత్స పొందుతూ ఓ ఒగ్గు కళాకారుడు మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గొల్లపల్లి మండలంలోని ఆత్మకూర్‌కు చెందిన గంగౌతలి రాయమల్లు(70) 25 రోజుల క్రితం వెల్గటూర్ మండలంలోని కిషన్‌రావుపేటలో మల్లికార్జున స్వామి నాగవెల్లి పట్నం వేసేందుకు వెళ్లాడు. కార్యక్రమం పూర్తి చేసుకొని, రాత్రి 7 గంటల సమయంలో స్వగ్రామం వస్తుండగా గుల్లకోట వద్ద ద్విచక్రవాహనం పైనుంచి పడి, తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. కుటుంబసభ్యులు, బంధువులు సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతి


లక్ష్మి (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మండలంలోని కటికెనపల్లి గ్రామానికి చెందిన మస్కం లక్ష్మి(70) వ్యవసాయ బావిలో పడి మృతిచెందినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. లక్ష్మి మంగళవారం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో ఆమె కుమారుడు రమేశ్ పొలం వద్దకు వెళ్లి, వెతికాడు. కనిపించకపోవడంతో బావిలో చూడగా లక్ష్మి మృతదేహం కనిపించింది. ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిందని అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పొలం వద్ద రైతు..

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన తంగెళ్ల చంద్రయ్య(59) అనే రైతు తన వ్యవసాయ పొలం వద్ద మృతి చెందాడు. ఎస్సై విజేందర్, బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. చంద్రయ్య సోమవారం సాయంత్రం కదంబపూర్ శివారులోని తన పొలం వద్దకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో ఆయన కుమారుడు వెతుక్కుంటూ వెళ్లాడు. పొలం వద్ద అపస్మారక స్థితిలో ఉన్న తండ్రిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు. చంద్రయ్య నోటినుంచి నురగ రావడంతో విషపురుగు కుట్టిందా? లేదా క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో 'అల్లూరి'..


నర్సింహారెడ్డి (ఫైల్)

మల్యాల(చొప్పదండి): మండల ప్రజలు పెద్ద పటేల్ అంటూ ఆత్మీయంగా పిలుచుకునే మల్యాల మండల కేంద్రానికి చెందిన అల్లూరి నర్సింహారెడ్డి అనా రోగ్యంతో మంగళవారం మృతిచెందారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ ఆయన భౌతికకాయానికి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చా రు. మల్యాల పంచాయతీ సమితి అధ్యక్షుడి కాలం నుంచి నర్సింహారెడ్డితో నాలుగు దశాబ్దాల అనుబంధం ఉందని ఎమ్మెల్సీ గుర్తు చేసుకున్నారు. ఆపద సమయాల్లో అందరికీ తోడుగా నిలిచి, ఆదుకునేవారని స్థానికులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


సల్మాన్ (ఫైల్)

గోదావరిఖని(రామగుండం): మంచిర్యాల పట్టణానికి చెందిన సల్మాన్(30) ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై స్వామి కథనం ప్రకారం.. సల్మాన్ మంచిర్యాలకే చెందిన ఓ యువతిని ప్రేమించాడు. ఆమె నిరాకరించడంతో సోమవారం గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నాడు. కాసేపటికే క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన స్థానికులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జమ్మికుంటలో 'గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్' హాల్టింగ్

హుజూరాబాద్/కరీంనగర్ టౌన్: జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ ఇస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. వ్యాపార కేంద్రమైన జమ్మికుంటలో ప్రయాణికుల సౌకర్యార్థం గోరఖ్‌పూర్ టు యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రతీరోజు హాల్టింగ్ ఇవ్వాలని ఎంపీ బండి సంజయ్ ఇటీవల రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు విన్నవించారు. స్పందించిన ఆయన సాధ్యాసాధ్యాలను పరిశీలించి, రైలు నిలిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయం పట్ల బీజేపీ నాయకులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు రేషన్ దుకాణాలు సీజ్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రేగడిమద్దికుంటలో రెండు రేషన్ దుకాణాలను మంగళవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. డీలర్ రఘుపతి గ్రామంలో దుకాణం నిర్వహించడంతోపాటు మరో షాప్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు వచ్చాయి. తనిఖీ చేయగా రెండు దుకాణాల్లో కలిపి 44 క్వింటాళ్ల బియ్యం తేడా వచ్చింది. దీంతో ఆ షాపులను సీజ్ చేశామని తహసీల్దార్ పేర్కొన్నారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధిక వడ్డీ పేరిట సైబర్ మోసం

జగిత్యాల క్రైం: పెట్టుబడి పెడితే అధిక వడ్డీ ఇస్తామని చెబితే ఓ వ్యక్తి నమ్మి, సైబర్ మోసానికి గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల పట్టణ శివారులోని టీఆర్‌నగర్‌కు చెందిన అడ్డగురి అరుణ్‌కుమార్‌కు నాలుగు రోజుల క్రితం టెలిగ్రామ్ ద్వారా ఎల్‌టీ కన్‌స్ట్రక్షన్స్ పేరిట లింక్ రాగా, రూ.10 వేలు పెట్టుబడి పెట్టాడు. దానికి మరుసటి రోజు అతని ఖాతాలో రూ.11 వేలు జమయ్యాయి. దీంతో అరుణ్‌కుమార్ రెండు రోజుల క్రితం మళ్లీ రూ.22,648, రూ.49,944 పెట్టుబడి పెట్టాడు. డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు నిర్ధారించుకున్నాడు. దీనిపై మంగళవారం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో 'అల్ఫోర్స్' ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్: ఆంగ్ల భాషకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇది పలు పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు కీలకమని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచి, మంచి ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో వారిని అభినందించారు. ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయిన ఎస్‌ఓఎఫ్ వారు నిర్వహించిన అంతర్జాతీయ ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో తమ పాఠశాలకు చెందిన పి.గౌరి (మూడోతరగతి), సీహెచ్.ప్రజసాయి, కె.కీర్తన, ఎస్.వైశ్వంత్ చక్రి (నాలుగో తరగతి), లిఖిత్ మాణిక్యరావ్, కె.సుచిత్ రెడ్డి (ఐదోతరగతి), ఇ.లిఖిత్ కుమార్, ఇ.సుహాన్, పి.గోమిక (ఆరోతరగతి) తదితరులు గోల్డ్ మెడల్స్, ప్రశంసాపత్రాలు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాలిద్‌కు 'గిడుగు' జాతీయ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న ఖాలిద్

కరీంనగర్ కల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన రచయిత ఎండీ.ఖాలిద్ గిడుగు జాతీయ పురస్కారం అందుకున్నారు. గిడుగు రామమూర్తి పంతులు వర్ధంతి సందర్భంగా సోమవారం రాత్రి హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమురయ్య హాల్లో గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఇటీవల భవానీ సాహిత్య వేదిక సంస్థ ద్వారా ప్రచురించిన ఖాలిద్ రచన 'మనమంతా ఒక్కటే' పుస్తకానికి ఈ అవార్డు ప్రకటించారు. అతిథులుగా హాజరైన హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య, హైదరాబాద్ ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లవాడియా, సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కాంతి కృష్ణ, బిక్కి కృష్ణల చేతులమీదుగా పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా బిక్కి కృష్ణ మాట్లాడుతూ.. జీవనోపాధి కోసం ఆటో నడుపుతూ సమాజాన్ని, వర్తమాన సమస్యలను ఆకళింపు చేసుకొని, పుస్తకం తీసుకురావడం అభినందనీయమన్నారు. స్పందించే హృదయం, భావావేశ పూరిత ఆలోచలే కవిత్వంగా మారుతాయని పేర్కొన్నారు. అనంతరం రచయిత వైరాగ్యం ప్రభాకర్‌ను సన్మానించారు. ఖాలిద్‌కు కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

గాలన్న జీవితమంతా పోరాటమే

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


శోభక్కను పరామర్శిస్తున్న మంద కృష్ణ మాదిగ

సైదాపూర్(హుస్నాబాద్): రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబంలో పుట్టి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి గాలన్న తన జీవితమంతా పోరాడారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త గాలన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. స్వగ్రామం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలో మంగళవారం శోభను ఆయన పరామర్శించారు. గాలన్న అజ్ఞాతం వీడిన తర్వాత తాను ప్రారంభించిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిలో సలహాలు, సూచనలు ఇస్తూ ఉద్యమాన్ని ముందుకు నడిపించారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రస్థాయిలో కీలకంగా వ్యవహరించారని, భార్య శోభను జెడ్పీటీసీ సభ్యురాలిగా, ఎమ్మెల్యేగా గెలిపించి, పేదలకు సహాయపడ్డారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో గాలన్న కీలకంగా వ్యవహరించారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గుర్తు చేశారు. పరామర్శించిన వారిలో పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఓరుగంటి రమణారావు, అంబేద్కర్ యువజన సంఘం ప్లానింగ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ కంసాల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ ముల్కల గంగారాం, సర్పంచ్ పద్మజ తదితరులున్నారు.

కొండగట్టులో వ్యక్తి అదృశ్యం

- బాధితుడిది జయశంకర్ భూపాలపల్లి జిల్లా

మల్యాల(చొప్పదండి): మండలంలోని కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన చక్కినారపు ఎల్లయ్య మంగళవారం తన కుటుంబసభ్యులతో కలిసి కొండగట్టు వచ్చాడు. స్వామి వారి దర్శనానికి వెళ్తుండగా అదృశ్యమయ్యాడు. ఆయన కుమారుడు స్వర్ణకుమార్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మంచిర్యాల జిల్లాకు చెందిన మైనర్..

ఓ బాలుడు అదృశ్యమైనట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన పుల్ల విజయ్ మల్యాల మండలం తక్కళ్లపల్లిలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నాడు. మంగళవారం ఉదయం 6 గంటలకు బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

మామిడాలపల్లికి చెందిన యువతి..


వీణవంక(హుజూరాబాద్): మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఈ నెల 22న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, తిరిగిరాలేదన్నారు. బాధితురాలి సోదరుడు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గోదావరి నదిలో దూకిన యువకుడు

- గాలించినా లభించని ఆచూకీ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని తిలక్ నగర్‌కు చెందిన ఎండీ.అజీముద్దీన్ అనే యువకుడు గోదావరి నదిలో దూకగా గల్లంతయ్యాడు. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. అజీముద్దీన్ మంగళవారం మధ్యాహ్నం గోదావరి బ్రిడ్జి వద్దకు బైక్ వచ్చాడు. వంతెన పైనుంచి నదిలో దూకినట్లు డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. సీఐ అఫ్జలొద్దీన్, ఎస్సై మధుసూదన్ జాలర్ల సహాయంతో గాలించినా అజీముద్దీన్ ఆచూకీ లభించలేదు. కాగా, అతను కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

బైక్‌లు ఢీ : ముగ్గురికి తీవ్ర గాయాలు



గాయపడిన విజయ్, అభిలాష్, మల్లేశం

సిరిసిల్ల క్రైం: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సిరిసిల్ల పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని అనంతనగర్‌కు చెందిన మల్లేశం మంగళవారం రాత్రి పొలం పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో పెద్దూరు డబుల్ బెడ్‌రూం ఏరియాకు చెందిన విజయ్, అభిలాష్ బైక్‌పై వేములవాడ వెళ్తున్నారు. సిరిసిల్ల–వెంకటాపూర్ బైపాస్ రోడ్డుపై రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ, బైక్ ఢీకొని యువకుడికి...

వేములవాడరూరల్: లారీ, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వేములవాడ రూరల్ ఎస్సై మారుతి వివరాల ప్రకారం.. వేములవాడ పరిధిలోని నాంపల్లికి చెందిన నాగారపు ప్రశాంత్ మంగళవారం నల్లగొండ నుంచి వేములవాడకు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో ఫాజుల్‌నగర్ వద్ద వేములవాడ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

43 మంది కానిస్టేబుళ్ల బదిలీ

కరీంనగర్ క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 43 మంది సివిల్ కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. వివిధ పోలీస్‌స్టేషన్లు, ఇతర విభాగాల్లో పని చేస్తున్న కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ మంగళవారం పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

పౌర హక్కుల సంఘం సభ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): పౌర హక్కుల సంఘం 50 వసంతాల ముగింపు సభకు సంబంధించిన ఆహ్వాన కరపత్రాలను మంగళవారం కరీంనగర్ కోర్టు ఆవరణలో ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర నాయకులు మార్వాడి సుదర్శన్, సీనియర్ అడ్వకేట్ రాజేశం, వివిధ సంఘాల నాయకులు గసికంటి కుమార్, రాజయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ యూనివర్సిటీ చదరంగం పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: తమిళనాడులోని భారతిదాసన్ విశ్వవిద్యాలయంలో ఈనెల 25 నుంచి 29 వరకు జరుగనున్న సౌత్ జోన్ యూనివర్సిటీ చదరంగ పోటీలకు కరీంనగర్‌లోని జీనియస్ చెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు అకాడమీ డైరెక్టర్ కంకటి కనకయ్య, కోచ్ కంకటి అనూప్ కుమార్‌లు తెలిపారు. ఇటీవల జరిగిన ఇంటర్ యూనివర్సిటీ చదరంగం పోటీల్లో రాణించిన అభిరాం, వరుణ్ తేజ, రెవిక్ వర్ధన్, నితిన్ లు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పలువురు అభినందించారు.

గాండ్ల కులస్తులను ఆదుకోవాలి

కరీంనగర్‌రూరల్: గాండ్ల కులస్తుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని గాండ్ల కుల సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కం సంపత్, ప్రధాన కార్యదర్శి జక్కం పుల్లయ్య, కోశాధికారి గుజ్జేటి రవీందర్‌లు సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. పురాతన చేతివృత్తుదారులైన గాండ్ల కులస్తులు ఎద్దులను గానుగలకు కట్టి నువ్వులు, పల్లీల నూనె తీసుకుని జీవనోపాధి పొందామని తెలిపారు. ఆలయాల్లో పలు బీసీ కులాలకు జీవనోపాధి కల్పించిన ప్రభుత్వం గాండ్ల కులస్తులకు గండదీపం వెలిగించే నూనెను సరఫరా చేసే అవకాశం కల్పించాలని కోరారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



సప్తగిరికాలనీ: స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం నగరంలోని గణాంకభవనంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు ఆవిష్కరించారు. పెన్షనర్స్ యొక్క శక్తి, బలం చూపేలా ఐక్యంగా కలిసి మెలిసి ఉండాలన్నారు. పెన్షనర్స్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు చక్రపాణి, జగన్మోహన్, పద్మారావు, పురుషోత్తం, కాంచనపల్లి మహేందర్ రాజు, భద్రయ్య, డేనియల్, సత్యనారాయణ, రిటైర్డ్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ బాట యువతకు ఆదర్శం



సుభాష్ చంద్రబోస్‌కు నివాళి అర్పిస్తున్న మేయర్, కార్పొరేటర్లు తదితరులు



హౌసింగ్‌బోర్డులోని నేతాజీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



నివాళి అర్పిస్తున్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు

కరీంనగర్/కరీంనగర్ కార్పొరేషన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. సుభాష్‌చంద్రబోస్ విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

- సుభాష్‌నగర్‌లోని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నేతాజీ చూపిన బాటలో యువత నడవాలని అన్నారు. కార్పొరేటర్లు అర్ష కిరణ్మయి, గంట కల్యాణి, గుగ్గిళ్ల జయశ్రీ, కంసాల శ్రీనివాస్, ఈఈ మహేందర్, గంట శ్రీనివాస్, అర్ష మల్లేశం తదితరులు పాల్గొన్నారు.
- డీసీసీ కార్యాలయం, సుభాష్‌నగర్‌లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ ఆశయాలు కొనసాగిస్తామని అన్నారు. కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, మడుపు మోహన్, రహమత్ హుస్సేన్ పాల్గొన్నారు.
- హౌసింగ్‌బోర్డు కాలనీలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద వెలుగు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేటర్ ఆకుల పద్మ ప్రకాశ్ విగ్రహానికి నివాళి అర్పించారు. కుమార్‌వాడీ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కాలనీవాసులు గర్రెపల్లి సత్యనారాయణరావు, రాజయ్య, రాజ్‌కుమార్, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.
- భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సుభాష్‌నగర్‌లోని నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో అందరికీ విద్యా, వైద్యం అందించాలనే నినాదంతో ముందుకు పోతామని అన్నారు.యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి, జిల్లా అధ్యక్షుడు సంద గణేశ్, నాయకులు పాల్గొన్నారు.
- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నేతాజీ ఆలోచన విధానంతో నేటి తరం యువత ముందుకు వెళ్లాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

బల్దియాకు రూ.200 కోట్లు కేటాయించాలి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని విలీన గ్రామాలు, శివారు ప్రాంతాలు, నూతన కాలనీల సమస్యలు పరిష్కారం కావాలంటే వచ్చే బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించాలని మేయర్ సునీల్‌రావు కోరారు. మంగళవారం నగరంలోని 14వ డివిజన్‌లో రూ.39 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, ఎస్‌డబ్ల్యూజీ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు భూమిపూజ చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం కేసీఆర్ రూ.500 కోట్లు కేటాయించినట్లుగానే, ఈ ప్రభుత్వం కూడా రూ.200 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే నిధులతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. నగరం మొత్తంగా అభివృద్ధి కావాలంటే అదనపు నిధులు అవసరమన్నారు. కార్పొరేటర్ దిండిగాల మహేశ్, డీఈ లచ్చిరెడ్డి, ఏఈ నిఖిత, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

కేసీఆర్ పేరు వింటేనే కాంగ్రెస్ నేతలకు వణుకు



మాట్లాడుతున్న చల్ల హరిశంకర్

కరీంనగర్: కేసీఆర్ పేరు వింటేనే కాంగ్రెస్ నాయకులకు వణుకు మొదలవుతుందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. మీసేవ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఎలాగైనా అధికారంలోకి రావాలని అడ్డగోలు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు హామీలను అమలు చేయకుండా బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులపై దృష్టిసారిస్తూ అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేసేందుకే శ్రద్ధ వహిస్తున్నారని అన్నారు. నగరంలో అన్ని హంగులతో ఏర్పాటు చేసిన గెస్ట్‌హౌస్‌ను కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్‌హౌస్‌గా నామకరణం చేస్తే అందులో కేసీఆర్ పేరు ఉందని బోర్డును తొలగించడం కాంగ్రెస్ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని తెలిపారు. తక్షణమే తిరిగి బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏడేళ్లుగా నగరంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని, ఈ యేడు మళ్లీ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేయడానికి పూనుకుంటే కాంగ్రెస్ నాయకులు అడ్డు చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో నగర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ రెడ్డి, నగర యూత్ అధ్యక్షులు కుల్దీప్ వర్మ, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, మైనార్టీ నగర అధ్యక్షులు షౌకత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కరీంనగర్‌టౌన్: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా కరీంనగర్ లోని వేంకటేశ్వర ఆలయం చౌరస్తాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారి డాక్టర్ కె.శ్రీనివాస్‌రావు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల చెంతకు చేర్చాలని, నిరుపేదలు ప్రభుత్వ కార్యక్రమాలను ఉపయోగించుకొనే విధంగా చూడాలని అన్నారు. అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జి.సుజాత ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు, టీబీ రహిత సమాజంగా భారత దేశాన్ని నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీసీవో రవీందర్ రెడ్డి, యునిసెఫ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, కిషన్‌స్వామి, మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక నమోదులో 865 దరఖాస్తులు



యువకుడి నుంచి దరఖాస్తు తీసుకుంటున్న బీఎల్‌వో

కరీంనగర్‌రూరల్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ముగిసింది. తుది ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా ఈనెల 6న ముసాయిదా జాబితాను కేంద్రం ఎన్నికల సంఘం విడుదల చేసింది. అప్పటి నుంచి జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 22 వరకు అవకాశం కల్పించింది. కరీంనగర్ నియోజకవర్గంలో మొత్తం 390 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఈనెల 20, 21తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. జనవరి 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన యువతీయువకులను బీఎల్‌వోలు ఓటరుగా నమోదు చేయించారు. కొంతమంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో నమోదుకు ఈనెల 22 వరకు గడువిచ్చారు. మొత్తం 865 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో కొత్త ఓటరు నమోదు ఫారం6లో 510, తొలగింపు ఫారం7లో 187, సవరణలు ఫారం8లో 168 దరఖాస్తులున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 8న తుది జాబితాను విడుదల చేస్తారని అధికారులు తెలిపారు.

హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలి



సప్తగిరికాలనీ: నగరంలో కిరాయి భవనాల్లో కొనసాగుతున్న కళాశాల హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వందలాది విద్యార్థులు హాస్టళ్లలో అసౌకర్యాలకు గురవుతున్నారన్నారు. సొంత భవనాలు కేటాయించి నాణ్యతమైన ఆహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన హాస్టల్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు లోకిని రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యువజన క్రీడోత్సవాలు



బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఏబీవీపీ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన క్రీడోత్సవాలు ముగిశాయి. మంగళవారం సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, జిల్లా ప్రముఖ గిరిబాబు, డాక్టర్ దూలం దిలీప్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్, నందు, అంజన్న, విష్ణులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్నిరంగాల్లో ముందుండాలి



దుర్శేడ్‌లో సమావేశమైన మహిళలు



గోపాల్‌పూర్‌లో..

కరీంనగర్‌రూరల్: అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని కరీంనగర్ మండలం దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాల్లో మంగళవారం స్వశక్తి సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో ముఖ్యఅతిథిగా హాజరైన డీఎంఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ ఇ.శైలజ మాట్లాడుతూ ఆడపిల్లలను తప్పనిసరిగా తల్లిదండ్రులు చదివించాలన్నారు. మంచిగా చదువుకుని అన్నిరంగాల్లో ముందుండాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ఈ సమావేశాల్లో సర్పంచులు గాజుల వెంకటమ్మ, ఊరడి మంజుల, ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ స్వప్న, నిర్మల, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు జానకిదేవి, అంగన్‌వాడీ టీచర్లు పద్మశ్రీ, రాజేశ్వరీ, వీవో తోట పద్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎడ్ల రమేశ్

కరీంనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో పాటు కార్మిక సంఘాలను నిర్వీర్యం చేసే విధంగా అవలంభిస్తున్న తీరును నిరసిస్తూ ఫిబ్రవరి 16న ఆల్‌ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ అన్నారు. మంగళవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో జరిగిన తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. 1997 సెస్‌యాక్ట్‌ను 2020లో సవరణ చేయడం వల్ల కార్మిక సంక్షేమ నిధికి గండి పడిందని తెలిపారు. దేశవ్యాప్త సమ్మెలో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు 54 రకాల భవన నిర్మాణ కార్మికులు పాల్గొంటారని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు కదిరె రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోశాధికారి జగదీశ్, ఉపాధ్యక్షుడు తిరుపతి, ఎలయ్య, రామ్మూర్తి, రాజకుమారి, సహాయ కార్యదర్శి ప్రసాద్, సారయ్య, నాయకులు పాల్గొన్నారు.

దేశంలో బీజేపీని తిరస్కరిద్దాం



సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

కరీంనగర్: దేశంలో బీజేపీని తిరస్కరిద్దాం.. విద్యను కాపాడుకుందామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేశ్, మచ్చ రమేశ్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ బస్టాండ్ వద్ద నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని, రిజెక్ట్ బీజేపీ, రిజెక్ట్ ఎన్ఈపీ, సేవ్ ఇండియా, సేవ్ ఎడ్యుకేషన్ డిమాండ్లతో మంగళవారం సతకాల సేకరణ చేపట్టారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి, పేద మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారని, దానిలో భాగమే కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చారని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానం దేశంలోనే సుసంపన్నమైన, వైవిధ్య భరితమైన భిన్నత్వంలో ఏకత్వానికి బదులు విద్యాకాషాయికరణ హిందుత్వ ఆధారిత రాజ్యాన్ని, సమాజాన్ని స్థాపించడానికి బాటలు వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు కేశబోయిన రాము, మామిడిపల్లి హేమంత, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నునావత్ శ్రీనివాస్ నాయకులు, కసిరెడ్డి సందీప్‌రెడ్డి, సాయి, చిన్న, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రాచరికపు పోకడలు చెల్లవు



బోర్డును చూపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాచరికపు పోకడలు చెల్లవని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ పేరు మార్పుపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. 50 ఏళ్ల క్రితం అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డి ప్రారంభించిన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ పేరును వ్యక్తి పూజ కోసం మార్చడం బీఆర్ఎస్‌కే చెల్లిందన్నారు. కేసీఆర్ పేరు వచ్చేలా ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్ అని మార్చారన్నారు. ప్రజల కోరిక మేరకు తిరిగి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌గా ప్రస్తుత ప్రభుత్వం పేరు మార్చిందన్నారు. ఈ సమావేశంలో పీసీసీ కార్యదర్శి అంజన్‌కుమార్, నాయకులు అశోక్ రావు, అబ్దుల్ రెహమాన్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ చాంద్, అమేర్, పెద్దిగారి తిరుపతి, చంద్రయ్య గౌడ్, అస్తపురం రమేశ్ ,కీర్తి కుమార్, మహ్మద్ బారీ, బషీర్, ఎజ్రా, ఇమ్రాన్, నదీమ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియాకు కాంప్లెక్స్ లింక్

- సొసైటీలకు కంపెనీల షరతు
- దొడ్డు యూరియా కొరతతో రైతుల ఆందోళన



దుర్శేడ్‌లోని మార్క్‌ఫెడ్ గోదాంకు వచ్చిన యూరియా లారీలు



ఇరుకుల్లలోని మార్క్‌ఫెడ్‌లో గడ్డలు కట్టిన యూరియా

కరీంనగర్‌రూరల్: యూరియా కావాలంటే కాంప్లెక్స్ ఎరువులను తప్పనిసరిగా తీసుకోవాలంటూ సహకార సంఘాలకు ఎరువుల కంపెనీలు షరతులు పెడుతున్నాయి. మార్క్‌ఫెడ్ సరఫరా చేస్తున్న సన్నరకం యూరియా గడ్డలు కడుతుండటంతో రైతులు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడంలేదు. ప్రస్తుతం రైతులందరూ ఎక్కువగా దొడ్డురకం యూరియా డిమాండ్ చేస్తుండటంతో విధిలేని పరిస్థితుల్లో యూరియా కోసం అవసరం లేని కాంప్లెక్స్‌ను సంఘాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ఉమ్మడి కరీంనగర్ మండలం పరిధిలో కరీంనగర్, దుర్శేడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. కరీంనగర్ సంఘం పరిధిలో 12 గ్రామాలు, దుర్శేడ్ పరిధిలో 6 గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల రైతులందరూ ఆయా సంఘాల్లో అవసరమైన ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్ పంటల సాగు జోరుగా సాగుతోంది. ఇప్పటికే పలువురు రైతులు వరినాట్లు పూర్తి చేయగా మరికొందరు ఇంకా నాట్లేస్తున్నారు. దీంతో యూరియా అవసరం ఎక్కువగా ఉండటంతో రైతులందరూ ఎగబడుతున్నారు. అయితే సంఘాల్లో రైతులు కోరుకునే దొడ్డురకం యూరియా అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. యూరియా కోసం ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. అత్యవసరంగా సన్నరకం యూరియా కొనుగోలు చేసిన ఇరుకుల్ల రైతులకు యూరియా అంతా గడ్డలు కట్టి ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. సంఘాల్లో యూరియా బస్తాకు రూ.270 ధర ఉండగా ప్రైవేట్ డీలర్లు ఒక్కో యూరియా బస్తాను రూ.300నుంచి రూ.320 విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

కాంప్లెక్స్ ఎరువులు తీసుకుంటేనే..

ప్రాథమిక సహకార సంఘాలకు ఎక్కువగా మార్క్‌ఫెడ్ నుంచి ఎరువుల సరఫరా ఉంటోంది. ప్రస్తుతం మార్క్‌ఫెడ్‌లో సన్నరకం యూరియా మాత్రమే అందుబాటులో ఉంది. అయితే రైతులు సన్నరకం యూరియా కొనుగోలు చేయకపోవడంతో స్టాక్ తీసుకునేందుకు సంఘాల అధ్యక్షులు మొగ్గు చూపడంలేదు. క్రిబ్‌కో, ఇఫ్‌కో కంపెనీలు దొడ్డురకం యూరియా కావాలంటే కాంప్లెక్స్ ఎరువులను తీసుకోవాలనే లింక్ పెడుతున్నారు. క్రిబ్‌కో కంపెనీ 60టన్నుల దొడ్డు యూరియా కావాలంటే 20టన్నుల 20–20 కాంప్లెక్స్ తీసుకోవాలని, ఇఫ్‌కో కంపెనీ దొడ్డు యూరియాతో పాటు నానో యూరియా తీసుకోవాలంటూ షరతులు పెడుతున్నాయి. ప్రస్తుతం కాంప్లెక్స్ ఎరువులు సంఘాలకు అవసరం లేనప్పటికీ రైతుల కోసం దొడ్డుయూరియాను కొనుగోలు చేయాల్సి వస్తోందని సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు. సోమవారం క్రిబ్‌కో కంపెనీ వ్యాగన్ వస్తే మార్క్‌ఫెడ్‌కు 60శాతం, మిగితా 40శాతం ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేసి సహకార సంఘాలకు ఇవ్వలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్క్‌ఫెడ్ నుంచి దొడ్డు రకం యూరియాను సంఘాలకు సరఫరా చేసేలా తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బాధ్యతలు అప్పగించాలి

వీణవంక: సర్పంచుల పదవీకాలం ఈ నెలతో ముగుస్తుండడంతో ఎంపీటీసీలకు సర్పంచుల బాధ్యతలు ఇవ్వాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి కోరారు. సర్పంచుల మాదిరిగా ప్రజలతో ఎన్నికైన ఎంపీటీసీలకు బాధ్యతలు అప్పగిస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజలకు ఎన్నో వాగ్దానాలు ఇచ్చి గెలిపిస్తే నిధులు, విధులు లేక క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నామని, ఎంపీటీసీలను చిన్నచూపు చూడటం తగదని, సర్పంచ్‌ల స్థానంలో అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించొద్దని ఈ విషయంపై పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

మూడు చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదు

- బాధితుల ఫిర్యాదుతో పోలీసుల చర్యలు

కరీంనగర్‌క్రైం: నగరంలోని పలు చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదైంది. డబ్బులు కట్టించుకుని చిట్టీలు ఎత్తుకున్న తర్వాత ఆ సొమ్ము ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఆయా చిట్‌ఫండ్ నిర్వాహకులపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. సీఐ వెంకటేశ్ వివరాల ప్రకారం కరీంనగర్‌లోని శుభనందిని చిట్‌ఫండ్స్‌లో 50 నెలల చిట్టీ 42నెలల తర్వాత ఎత్తుకోగా.. డబ్బులు ఇవ్వడం లేదని బాధితుడు చిట్టంపల్లి సత్యం ఫిర్యాదుతో డిప్యూటీ జనరల్ మేనేజర్ ఏ.తిరుపతిపై కేసు నమోదు చేశామని తెలిపారు. భవిత చిట్‌ఫండ్స్‌లో రూ.5 లక్షల చిట్ వేసి పూర్తి అయినప్పటికీ డబ్బులు ఇవ్వడం లేదని బాధితుడు ఎగ్గెడి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో చిట్‌ఫండ్ యజమాని తాటిపల్లి శ్రీనివాస్‌పై కేసునమోదు చేశామన్నారు. అక్షర చిట్‌ఫండ్‌లో రూ.10లక్షల చిట్ వేయగా ఇంకా రూ.7.40 లక్షలు ఇవ్వలేదని బాధితురాలు చాడ లక్ష్మి ఫిర్యాదుతో చిట్‌ఫండ్స్ బాధ్యులు, చిట్ వేయించిన ఐల రవీందర్ రెడ్డిపై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయండి



వినతిపత్రం ఇస్తున్న అక్షయ్‌కుమార్

కరీంనగర్‌సిటీ: ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను మహిళా ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జెఏసీ రాష్ట్ర చైర్మన్ మేకల అక్షయ్ కుమార్ మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను కూడా వచ్చే 2024–25 విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వ మహిళా ఇంజనీరింగ్ కళాశాలగా అప్ గ్రేడ్ చేయాలని, తద్వారా ప్రస్తుత మహిళా పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

టీడీపీలో ధిక్కార స్వరం

తమ సంగతి తేల్చాలని ఎక్కడికక్కడ నేతల పట్టు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పరిస్థితి 'ముందు గొయ్యి.. వెనుక నుయ్యి'లా తయారైంది. పార్టీ టికెట్ల కేటాయింపుపై నిర్ణయం తీసుకోలేక తల బొప్పి కట్టిపోతోంది. జనసేనతో పొత్తుపై పార్టీ నేతలంతా పెదవి విరుస్తుండటంతో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారింది. తమ టికెట్ సంగతి తేలిస్తేనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటామని ఎక్కడికక్కడ నేతలు తెగేసి చెబుతుండటంతో తండ్రీ కొడుకులకు నిద్ర కరువైంది.

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. ఇప్పటికే పాతాళానికి కుంగిన ఆ పార్టీ.. ఎన్నికలు సమీపించే కొద్దీ ఇంకా లోతుకు కూరుకుపోతోంది. క్షేత్ర స్థాయిలో ఇప్పటికే పూర్తిగా అయోమయం నెలకొంది. పలుచోట్ల పార్టీకి ఇన్‌ఛార్జిలు లేకపోవడాన్ని బట్టే ఆ పార్టీ పరిస్థితి ఏమిటన్నది ఇట్టే అర్థమవుతోంది. నాయకులు ఉన్న చోట కూడా కుమ్ములాటలతో సతమతమవుతోంది. ఈ నేపథ్యంలోనే విజయవాడ ఎంపీ కేశినేని నాని ఆ పార్టీకి రాజీనామా చేశారు. తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు కూడా టీడీపీకి గుడ్‌బై చెప్పారు. అదే బాటలో మరికొందరు టీడీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు జనసేనతో ఇప్పటికే పొత్తులో ఉంటూ.. బీజేపీతో కూడా పొత్తు ప్రయత్నాలు చేస్తుండటంతో గందరగోళం ఇంకా పెరిగిపోయింది. తమ పార్టీ ఎక్కడ పోటీ చేస్తుందో, ఏ స్థానంలో తాము పోటీలో ఉంటామో తెలియక టీడీపీ క్యాడర్ అయోమయంలో మునిగిపోయింది. ఈ పరిస్థితుల్లో పలుచోట్ల కీలక నేతలు చంద్రబాబును ధిక్కరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో సైతం పాల్గొనకుండా ముందు తమ సంగతి తేల్చాలని పట్టుబడుతున్నారు.

గాల్లో గంటా శ్రీనివాసరావు సీటు

సీనియర్ నేత గంటా శ్రీనివాసరావును చంద్రబాబు గాల్లో పెట్టడంతో ఆయన అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఒకసారి గెలిచిన చోట మళ్లీ పోటీ చేయని గంటా వచ్చే ఎన్నికల్లో తనకు విజయనగరం జిల్లా నెల్లిమర్ల సీటు ఇవ్వాలని కోరుతుండగా చంద్రబాబు ఎటూ తేల్చడం లేదు. దీంతో ఏం చేయాలో తెలియక ఆయన తంటాలు పడుతున్నారు. చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబం కూడా టీడీపీపై రగిలిపోతోంది. పార్టీకి అండగా ఉన్న తమను దూరం పెడుతున్నారని వాపోతోంది. అయ్యన్న తనకు అనకాపల్లి ఎమ్మెల్యే సీటు, తన కుమారుడికి అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. కానీ ఎవరో ఒకరికి మాత్రమే సీటు ఇస్తామని చంద్రబాబు స్పష్టం చేయంతో అయ్యన్న అలక వహించారు. పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా.. మౌనంగా ఉంటున్నారు. విశాఖ జిల్లా పెందుర్తి సీటు జనసేనకు ఇచ్చే పరిస్థితి ఉండడంతో అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అసంతృప్తితో రగిలి పోతున్నారు. తన సీటు జనసేనకు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్న ఆయన.. అవసరమైతే పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. తమకు సీట్లు ఇవ్వకపోతే టీడీపీ సంగతి చూస్తామని గాజువాక, అనకాపల్లి నేతలు పల్లా శ్రీనివాసరావు, పీలా గోవింద్‌లు అంతర్గతంగా హెచ్చరికలు జారీ చేశారు.

కాకినాడలో టీడీపీకి హెచ్చరికలు

కాకినాడ సిటీ స్థానాన్ని జనసేనకు ఇస్తే తాను మరో దారి చూసుకుంటానని మాజీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు స్పష్టం చేస్తున్నారు. కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఇప్పటికే బహిరంగంగా తన సీటు జనసేనకు ఇవ్వొద్దని కోరారు. ఒకవేళ ఇస్తే తాను ప్రత్యామ్నాయం చూసుకుంటానని హెచ్చరించారు. మాజీ మంత్రి కేఎస్ జవహర్ కూడా పార్టీని ధిక్కరిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు సీటు తనకివ్వాల్సిందేనని ఆయన పట్టుబడుతుండగా, చంద్రబాబు మరో వ్యక్తికి ఇవ్వాలని చూస్తున్నారు. తేడా వస్తే ఆయన జంప్ అవడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో టీడీపీ నేతల మధ్య జనసేన చిచ్చు పెట్టింది. ఇక్కడ అధిక శాతం సీట్లు జనసేనకు కేటాయిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో టీడీపీ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

దేవినేని ఉమకు సీటు లేదు

ఎన్టీఆర్ జిల్లాలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు సీటు లేదని చెప్పడంతో ఆయన లోలోన కుంగిపోతూ ప్రత్యామ్నాయాలు వెతుకుతున్నట్లు తెలుస్తోంది. మైలవరం సీటును ఆయనకు కాదని కొత్త వ్యక్తికి ఇస్తామని చంద్రబాబు చెప్పడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం మొదటి నుంచి పని చేసిన తనను మోసం చేశారని వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో దివంగత కోడెల శివప్రసాద్ తనయుడు శివరామ్ ఇప్పటికే తిరుగుబాటు జెండా ఎగుర వేశారు. ఆయన స్థానంలో బీజేపీ నుంచి వచ్చిన కన్నా లక్ష్మీనారాయణకు సత్తెనపల్లి సీటు ఇస్తుండడంతో ఆయన టీడీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. చిలకలూరిపేట సీటు విషయంలో భాష్యం ప్రవీణ్, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మధ్య పోటీ నెలకొంది. సీటు లేకపోతే టీడీపీని వదిలేందుకు పుల్లారావు ఏర్పాట్లు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. నెల్లూరు సిటీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఇచ్చే అవకాశం ఉండడంతో మొదటి నుంచి అక్కడ పని చేసిన మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తనకు న్యాయం దక్కలేదంటూ ఆయన టీడీపీని వీడాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

అనంత, కర్నూలు జిల్లాల్లోనూ అదే తీరు

ఉమ్మడి అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ప్రస్తుత ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి గ్రూపులు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నాయి. ఎవరికి సీటిచ్చినా రెండో వర్గం తిరుగుబాటు చేసే పరిస్థితి నెలకొంది. మరోవైపు ధర్మవరం ఇన్‌ఛార్జిగా ఉన్న పరిటాల శ్రీరామ్ అక్కడి నుంచి పోటీ చేయాలని చూస్తుండగా, గత ఎన్నికల్లో ఓటమి తర్వాత బీజేపీలోకి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి సీటు తనదేనని చెప్పుకుంటున్నారు. దీంతో పరిటాల ఆగ్రహంతో ఊగిపోతున్నారు. తనను నమ్మించి పని చేయించుకుని ఇప్పుడు మాట మారిస్తే ఊరుకోనని ఆయన హెచ్చరిస్తున్నారు. ఒక ఇంట్లో ఒకరికే టికెట్ అని చంద్రబాబు చెప్పడంతో రాప్తాడులో పరిటాల సునీత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నంద్యాల ఇన్‌ఛార్జిగా భూమా బ్రహ్మానందరెడ్డిని తప్పించి మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను నియమించడంతో ఆ నియోజకవర్గంలో అసమ్మతి రాజుకుంది. బ్రహ్మానందరెడ్డి టీడీపీని వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆలూరు సీటు ఇవ్వకపోతే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆయన సతీమణి సుజాతమ్మ చంద్రబాబుకు ఝలక్ ఇవ్వనున్నారు. డోన్ అభ్యర్థిగా చంద్రబాబు.. ధర్మవరం సుబ్బారెడ్డిని ప్రకటించగా, కేఈ ప్రభాకర్ తాను రేసులో ఉన్నట్లు స్పష్టం చేశారు. చంద్రబాబు తీరుపై కేఈ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆళ్లగడ్డ సీటు జనసేనకు కేటాయిస్తారనే ప్రచారంతో మాజీ మంత్రి అఖిలప్రియ మండిపడుతున్నారు. అదే జరిగితే ఆమె టీడీపీకి గుడ్‌బై చెప్పేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

మీరే నా స్టార్ క్యాంపెయినర్లు

- మీ బిడ్డ ప్రభుత్వంలో మంచి జరిగిన ఇళ్లలోని అక్కచెల్లెమ్మలే నా ప్రచారకర్తలు
- ఉరవకొండ సభలో ఏపీ సీఎం వైఎస్ జగన్


లబ్ధిదారుల సమక్షంలో బటన్ నొక్కి నాలుగో విడత ఆసరా నిధులను విడుదల చేస్తున్న సీఎం జగన్

సాక్షి, అనంతపురం (ఉరవకొండ) : 'ప్రజలకు ఏ మంచీ చేయని వారికి, ప్రజలను మోసం చేసిన వారికి ఇంత మంది స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారు. ప్రతి పేద ఇంటికి అభివృద్ధి ఫలాలు అందించిన మీ బిడ్డకు, మంచి చేసిన మీ బిడ్డకు ఎలాంటి స్టార్ క్యాంపెయినర్లు లేరు. అయితే మీ బిడ్డ వాళ్లెవరినీ నమ్ముకోలేదు. వీళ్లందరి కంటే ఎక్కువగా నాకు స్టార్ క్యాంపెయినర్లు ఉన్నారని గట్టిగా చెబుతున్నాను. మీ బిడ్డ ప్రభుత్వంలో మంచి జరిగిన ఇళ్లలోని అక్కచెల్లెమ్మలే నా స్టార్ క్యాంపెయినర్లు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో మంగళవారం ఆయన వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగవ విడత నిధుల విడుదల సభలో మాట్లాడారు. 'జెండాలు జత కట్టడమే వారి ఎజెండా.. జనం గుండెల్లో గుడి కట్టడమే మీ జగన్ ఎజెండా' అని తెలిపారు. వారందరికీ భిన్నంగా తనకున్నంత మంది స్టార్ క్యాంపెయినర్లు దేశ చరిత్రలోనే కాదు.. రాజకీయ చరిత్రలో ఎవరికి ఉండరన్నారు. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే మాత్రం మీరే మీ బిడ్డకు స్టార్ క్యాంపెయినర్లుగా నిలవాలని కోరారు. జరుగబోయే కురుక్షేత్ర సంగ్రామంలో మీ బిడ్డకు మీరే సైనికుల్లా నిలవాలన్నారు. మనం వేసే ఓటు.. నొక్కే బటన్ ఎందుకు నొక్కుతున్నామో మనసులో పెట్టుకోవాలని చెప్పారు. మీరు వేసే ఓటు ఒక్క జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవడమే కాదు.. పేద కుటుంబాలు పేదరికం నుంచి బయట పడేందుకనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జగన్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటేనే అది జరుగుతుందని మనసులో పెట్టుకోవాలని చెప్పారు.

దురుద్దేశాలతోనే నాపై 'పిల్'

- నా ప్రతిష్టను దెబ్బతీసేందుకే ఈ వ్యాజ్యం
- నాపై విద్వేషపూరిత, తప్పుడు ఆరోపణలు చేయడమే ఎంపీ రఘురామకృష్ణరాజు పని
- హైకోర్టులో సీఎం వైఎస్ జగన్ ప్రాథమిక కౌంటర్ దాఖలు

సాక్షి, అమరావతి: దురుద్దేశాలు, రాజకీయ కారణాలతో ఎంపీ రఘురామకృష్ణరాజు తనపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం హైకోర్టుకు నివేదించారు. తనపై విద్వేషపూరిత, తప్పుడు ఆరోపణలు చేయడమే ఆయన పనిగా పెట్టుకున్నారని వివరించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, దుష్ప్రవర్తనకు పాల్పడినందుకు అతనిపై అనర్హత వేటువేయాలని లోక్‌సభ స్పీకర్‌కు తమ పార్టీ తరఫున లేఖ రాశామన్నారు. ఈ కారణంతోనే అప్పటి నుంచి రాఘురామకృష్ణరాజు తనపై వ్యక్తిగత కక్ష పెంచుకున్నారని తెలిపారు. తనపై ద్వేషాన్ని తెలియజేసేందుకు ఆయన పలు మార్గాలను ఎంచుకున్నారని వివరించారు. అతని కక్షపూరిత ధోరణి, శతృత్వం ప్రజలందరికీ తెలుసునన్నారు. ఇందులో భాగంగా.. అనేక సందర్భాల్లో తనపై నిరాధార ఆరోపణలు చేశారని జగన్‌మోహన్‌రెడ్డి వివరించారు. ఇదే రీతిలో రాజ్యాంగపరంగా ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు, అధికారులపై కూడా నిరాధార ఆరోపణలు చేశారన్నారు. తనపై పలు నిరాధార, తప్పుడు ఆరోపణలు చేస్తూ తన బెయిల్‌ను రద్దుచేయాలంటూ రఘురామకృష్ణరాజు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారని, ఆ ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేకపోవడంతో హైకోర్టు దానిని కొట్టేసిందన్నారు. నిజానికి.. ఆయన సదుద్దేశంతో కోర్టును ఆశ్రయించలేదని తెలిపారు. అతనిపై ఉన్న క్రిమినల్ కేసుల గురించి తన పిటిషన్‌లో ప్రస్తావించకుండా దాచిపెట్టారని సీఎం వివరించారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిల్‌ను భారీ జరిమానాతో కొట్టేయాలని ముఖ్యమంత్రి జగన్ న్యాయస్థానాన్ని కోరారు. అంతేకాక.. ప్రతివాదుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని కూడా అభ్యర్థించారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు, ఆయా ప్రభుత్వ శాఖల పనితీరుపై దూషణలు చేసేందుకే ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారని ఆయన తన కౌంటర్‌లో పేర్కొన్నారు.

ప్రభుత్వ విధానాలపై సీబీఐ దర్యాప్తు జరపండి..

రాష్ట్ర ప్రజల సంక్షేమ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న పలు ప్రజా సంక్షేమ పథకాలకు దురుద్దేశాలను ఆపాదించడంతో పాటు ఆ పథకాలవల్ల పలువురికి లబ్ధిచేకూర్చేలా ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలున్నాయని.. వాటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ స్పందిస్తూ.. ఈ పిల్ విచారణార్హతపై అభ్యంతరం లేవనెత్తారు. దీంతో న్యాయస్థానం ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డితో సహా 40 మందికి నోటీసులు జారీచేసి, పిల్ విచారణార్హతపై అభ్యంతరాలుంటే తెలియజేస్తూ అఫిడవిట్‌లు దాఖలుచేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు జగన్‌మోహన్‌రెడ్డి తన అభ్యంతరాలతో ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 12కి వాయిదా వేసింది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఐదు రోజుల్లో పరిహారం

- పులుల దాడిలో పశువు చనిపోతే చెల్లింపు
- మృతిని గుర్తించిన రోజే రూ.5 వేల సాయం
- జిల్లా అటవీ అధికారుల వద్దే ప్రత్యేక నిధి
- 'కవ్వాల్' పరిధిలో పెద్దపులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- 'సాక్షి'తో సీసీఎఫ్, ఎఫ్డీటీపీ ఎస్.శాంతారామ్


సీసీఎఫ్, ఎఫ్డీటీపీ ఎస్. శాంతారామ్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పులుల దాడిలో మరణించిన పశువులకు సంబంధించిన పరిహారాన్ని యజమానులకు ఐదు రోజుల్లో చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్), ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్(ఎఫ్డీపీటీ) ఎస్.శాంతారామ్ తెలిపారు. కవ్వాల్ టైగర్ రిజర్వులో పులుల దాడులతో చనిపోయిన పశువుల యజమానులకు పరిహారం చెల్లింపులో జాప్యం లేకుండా చూస్తామని చెప్పారు. ప్రతీ పులి కదలికను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కాగజ్‌నగర్ డివిజన్‌లో ఇటీవల రెండు పులుల మరణించడం తెలిసిందే. పులుల సంరక్షణకు అటవీ శాఖ తీసుకుంటున్న జాగ్రత్తలపై శాంతారామ్ 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లో..

తక్షణ సాయం రూ.5 వేలు

పులుల దాడిలో పశువు చనిపోతే అదే రోజు సంబంధిత యజమానికి రూ.5 వేలు అందిస్తాం. ఆ తర్వాత చనిపోయిన పశువు విలువను బట్టి మిగతా డబ్బులు ఐదు రోజుల్లో చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ప్రభుత్వానికి నివేదిస్తే, బడ్జెట్ విడుదలయ్యే వరకు వేచి చూడాల్సి వచ్చేది. ప్రస్తుతం జిల్లా అటవీ అధికారుల వద్దే పరిహారం చెల్లింపుల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేశాం. పశు యాజమానులకు తర్వగా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల రెండు పులుల మృతిలో ఒకటి విషాహారంతో చనిపోగా, మరొకటి ఆధిపత్య పోరులో చనిపోయింది. వీటిపై ఫోరెన్సిక్ రిపోర్టు ఇంకా రావాల్సి ఉంది. నిందితుల్ని అరెస్టు చేయడంతోపాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేశాం.

తడోబా నుంచే పులుల రాక..

కవ్వాల్ టైగర్ రిజర్వుకు తిప్పేశ్వర్ కంటే, తడోబా అభయారణ్యం నుంచే పులులు వస్తున్నాయి. అక్కడ పులుల సంఖ్య పెరగడంతో మనవైపు వస్తున్నాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లో పులులు సంచరించే ఏరియాలో పత్తిచేలు ఉన్నాయి. దీంతో వాటికి ఇబ్బంది కలుగుతోంది. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్ల నుంచి మంచిర్యాల జిల్లా జన్నారం డివిజన్ పరిధిలోని కవ్వాల్ కోర్ ప్రాంతానికి పులులు వెళ్లేందుకు బొగ్గు గనులు, జాతీయ రహదారి అడ్డంకిగా మారాయి. జాతీయ రహదారిపై రెబ్బెన, తాండూరు మధ్య పులుల దాటే చోట ప్రత్యేకంగా యానిమల్ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఉపయోగం ఉంటుంది. సింగరేణి సంస్థ సీఎస్సార్ నిధులను అటవీ సంరక్షణకు ఉపయోగిస్తాం. అడవుల్లో కెమెరాల బిగింపు, మరమ్మతులకు ఉపయోగిస్తాం. అలాగే యానిమల్ ట్రాకర్స్, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సకాలంలో జీతాలు వచ్చేలా ఉన్నతాధికారులకు నివేదించాం. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం.

కవ్వాల్ వరకు వెళ్లడం లేదు

కవ్వాల్ కోర్ ప్రాంతంలో పులుల మనుగడకు అనుకూలమైన వాతావరణం ఉంది. అక్కడి వరకు పులులు వెళ్లడం లేదు. అంతర్రాష్ట్ర కారిడార్ వద్దే ఆగిపోతున్నాయి. పులులను కవ్వాల్ వరకు వెళ్లేలా చేయాలి. ఇందుకోసం టైగర్ మానిటరింగ్ సెల్‌లో మరింత పకడ్బందీగా చర్యలు తీసుకుంటాం. పులులు రైతుల పశువులపై ఆధారపడకుండా ఉండేందుకు అడవుల్లో శాకాహార జంతువుల కోసం గడ్డిక్షేత్రాలను పెంచుతాం. ప్రస్తుతం పులుల సంచారం ఉన్నచోటును శాటిలైట్‌కోర్ ప్రాంతాలుగా గుర్తించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించాం.

అడుగులో అడుగేస్తూ..

- 15 రోజులు.. 300 కిలోమీటర్లు
- ఆరాధ్య దైవాన్ని స్మరిస్తూ ముందుకు..
- నాగల్‌కొండకు చేరిన 'మెస్రం' పాదయాత్ర

నార్నూర్: నాగోబా.. ఆదివాసీల ఆరాధ్య దైవం. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు, ఆచారాలంటే మెస్రం వంశీయులకు ఎంతో నమ్మకం. ఆనవాయితీ తప్పకుండా ఏటా మహాపూజకు సన్నద్ధమవుతుంటారు. ఇష్ట దైవాన్ని గంగాజలంతో అభిషేకించి మొక్కులు తీర్చుకుని జాతరకు శ్రీకారం చుడుతారు. నియమ, నిష్టలతో ఈ మహత్కార్యంలో భాగస్వాములవుతారు. ఇందులో గంగాజలం సేకరణ పాదయాత్ర కీలకం.


పాదయాత్రగా వెళ్తున్న మెస్రం వంశీయులు

ఈనెల 21న ప్రారంభం..

ఈనెల 21న 156 మంది పాదయాత్రగా గోదావరి బాట పట్టారు. కేస్లాపూర్ నుంచి బయలుదేరిన యాత్ర.. ఆయా గ్రామాల గుండా మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని హస్తినమడుగుకు ఈ నెల 28న చేరుకోనుంది. అక్కడి నుంచి గంగాజలంతో తిరిగి కేస్లాపూర్‌కు అటవీ మార్గంలో రానున్నారు. 15రోజుల పాటు సుమారు 300 కిలోమీటర్లు కాలినడకన యాత్ర కొనసాగనుంది. ఇందులో భాగంగా సోమవారం రాత్రి నార్నూర్ మండలం గుంజాల గ్రామం వద్ద బసచేశారు. మంగళవారం ఉదయం స్థానికులు వీరికి సంప్రదాయం ప్రకారం కాళ్లు కడిగారు. అనంతరం యాత్ర ముక్తాపూర్ మీదుగా నాగల్‌కొండకు చేరుకుంది. అక్కడే బస చేశారు. ఈ సందర్భంగా పలువురిని 'సాక్షి' పలకరించింది.

నియమ నిష్టలతో ముందుకు..



తరతరాలుగా వస్తున్న మా ఆచార, సంప్రదాయాలను పాటిస్తున్నాం. నాగోబాను అభిషేకించేందుకు గంగాజలం కోసం నియమ, నిష్టలతో కాలినడకన ముందుకు సాగుతున్నాం. వంశపెద్దలు నిర్ణయించిన ప్రకారం ఆయా గ్రామాల్లో ఆ రోజు బస చేస్తున్నాం. మా వంశస్తులతో పాటు గ్రామస్తుల సహకారం ఉంటుంది. మరుసటి రోజు ఉదయం వారి అతిథి మర్యాదలు స్వీకరిస్తున్నాం. ఆహారంలో మిలింద (గోధుమ రొట్టె బెల్లం కలిపి), అన్నం, పప్పు ఉంటుంది. అనంతరం మళ్లీ పాదయాత్ర కొనసాగిస్తాం.

– మెస్రం దాదేరావు, ప్రధాన్

15 రోజులు.. 300 కిలోమీటర్లు



ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా ఆలయం నుంచి ఆదివారం మా యాత్ర ప్రారంభమైంది. దీనిని మేము ఎంతో పవిత్రంగా భావిస్తాం. కాలినడకన ఆయా గ్రామాల మీదుగా మంచిర్యాల జిల్లా జన్నారం మండలం హస్తిన మడుగుకు చేరుకుంటాం. అక్కడ గంగాజలం తీసుకుని తిరిగి కేస్లాపూర్‌కు చేరుకుంటా. మొత్తం 15 రోజుల్లో 300 కిలోమీటర్లు పాదయాత్ర ఉంటుంది.

– మెస్రం తిరుపతి, నాగోబా కొత్వాల్

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు







కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. సుమారు 40 వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్లు ఈవో వెంకటేశ్ తెలిపారు. ఘాట్‌రోడ్డు, బొజ్జ పోతన్న ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి. దర్శనానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. వివిధ టిక్కెట్ల ద్వారా రూ.2 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు ఆలయవర్గాలు పేర్కొన్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవోతోపాటు ఏఈవో శ్రీనివాస్, మల్యాల ఎస్సై అశోక్, సూపరింటెండెంట్లు సునీల్, శ్రీనివాసశర్మ, అధికారులు, పోలీసు సిబ్బంది అందుబాటులో ఉండి, సేవలందించారు.

హామీల అమలుపై దృష్టిసారించాలి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్


మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈశ్వర్

జగిత్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై దృష్టిసారించాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఒకవైపు కాలువలు సరిగా లేవు, చెరువులు నిండలేదు, రైతులను, ప్రజలను విస్మరిస్తూ గత ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ సర్పంచ్‌లు, నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాలలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా అభివృద్ధిపైనే దృష్టి పెట్టిందని తెలిపారు. రైతుబంధు, రైతు సంక్షేమాన్ని పట్టించుకోకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఏం సాధించారని విదేశీ పర్యటనలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. కుంగిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్‌కు మరమ్మతులు చేపడితే సరిపోతుందని నిపుణులే చెబుతున్నారని తెలిపారు. కానీ, కేసీఆర్‌పై బురద జల్లాలనే ఉద్దేశంతో ప్రాజెక్టును వేలెత్తిచూపుతున్నారని ఆరోపించారు. నిజంగానే లోపాలుంటే విజిలెన్స్ కమిటీ ఎందుకు వేయలేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఇప్పటికీ రైతుబంధు, రైతుబీమా లేవని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఎక్కడ అని ప్రశ్నించారు.

కాలయాపన కోసమే ఇంటింటి సర్వే

దరఖాస్తులు స్వీకరించాక ఇంటింటి సర్వే అనడం కాలయాపన కోసమేనని మాజీ మంత్రి ఈశ్వర్ విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేలోపు ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ అన్ని విధాలుగా సహకరిస్తుందని పేర్కొన్నారు. కానీ, కక్షపూరిత చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. త్వరలో రైతుల మోటార్లకు మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రభుత్వం ఏర్పడి నెల రోజులైనా కాకముందే రూ.9 వేల కోట్ల అప్పు తీసుకువచ్చారని ఆరోపించారు. గత ప్రభుత్వం రూ.50 లక్షల కోట్లు ఆస్తులు సృష్టించిందన్నారు. జిల్లాకో మెడికల్ కళాశాల, కలెక్టరేట్ భవనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతోందని మండిపడ్డారు. ప్రజలు అవకాశం ఇచ్చారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలకులు బీఆర్ఎస్ కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారే తప్ప అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆరు గ్యారంటీల అమలు ఎక్కడికి పోయిందన్నారు. అక్రమ కేసులు పెడితే పోరాడుతామన్నారు. జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, కల్వకుంట్ల సంజయ్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, బాపురెడ్డి, హరిచరణ్‌రావు తదితరులున్నారు.

మేడిపల్లి శివారులో చిరుతపులి కలకలం

- మెట్‌పల్లి–అమ్మక్కపేట మధ్య రైల్వేగేటు వద్ద కనిపించిన చిరుత


మేడిపల్లి శివారులో రైల్వే గేటు వద్ద రోడ్డు దాటుతున్న చిరుత

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి శివారులో చిరుతపులి సంచరించడం కలకలం రేపుతోంది. మంగళవారం రాత్రి సమయంలో మెట్‌పల్లి–అమ్మక్కపేట మధ్య రైల్వే గేటు వద్ద చిరుతపులి రోడ్డు దాటినట్లు ఫారెస్ట్ అధికారులకు సమాచారం తెలిసింది. దీంతో ఆ ప్రాంతానికి చేరుకున్న అధికారులు చిరుత పులి సంచరించిందా..? లేదా..? అని ఆరా తీశారు. అక్కడే ఉన్న రైల్వే గేటుమన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిరుతని ప్రత్యక్షంగా చూసిందెవరు అనే విషయంలో స్పష్టత రాలేదు. సోషల్ మీడియాలో చిరుత సంచరించినట్లు ఫొటో వైరల్ అవుతోంది. డిప్యూటీ ఫారెస్ట్ ఆఫీసర్ హఫీజొద్దీన్, ఇబ్రహీంపట్నం బీట్ ఆఫీసర్ రత్నాకర్ తదితరులు ఉన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
బుధవారం ॥ 24-1-2024



నేడు జాతీయ బాలిక దినోత్సవం

అమ్మాయి ఆరోగ్యానికి ఏడు పరీక్షలు

ఆడపిల్లలు ఆరోగ్యంగా పెరగాలి. అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలి. వారికి వద్దు ఆటంకాలు. వారిపై వద్దు చిన్నచూపు. ఇదే 'నేషనల్ గర్ల్ చైల్డ్ డే' సందేశం. అయితే యుక్త వయసుకు వచ్చిన బాలికలకు చాలామంది తల్లిదండ్రులు ఆరోగ్య పరీక్షలు చేయించరు. వైద్యనిపుణులు మాత్రం ఎదిగే వయసులోని ఆడపిల్లలకు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించాలంటున్నారు. 'జాతీయ బాలికా దినోత్సవం' సందర్భంగా తల్లిదండ్రులు ఆడపిల్లలకు ఇవ్వాల్సిన కానుక ఈ ఆరోగ్య పరీక్షలే.

ఆడుతూ పాడుతూ ఉన్నంత మాత్రాన మన ఇంటి ఆడపిల్లలకు శారీరకంగా ఏవో కొన్ని పోషక విలువల లోటుపాట్లు ఉండకపోవు. అయితే చాలామంది తల్లిదండ్రులు వాటిని నిర్ధారణ చేసుకోరు. నిజానికి బాలికలు అనేక శారీరక సవాళ్లను ఎదుర్కొంటారు. యుక్తవయస్సు వచ్చిన తర్వాత శారీరక మార్పులకు లోనవుతారు. పోషకాహార లోపంతో బాధపడే బాలికల్లో కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయి. అందుకే వారి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసేందుకు, లోపాలను సరి చేసుకునేందుకు కొన్ని పరీక్షలు తరచూ చేయించాలంటున్నారు వైద్య నిపుణులు. బాలికల సమగ్ర వికాసాన్ని సందేశంగా ఇచ్చే 'నేషనల్ గర్ల్ చైల్డ్ డే' సందర్భంగా తప్పక ఈ పరీక్షలను చేయించడమే ఆడపిల్లలకు ఇచ్చే అసలైన కానుక అవుతుంది.

కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ): బాలికల్లో రక్తహీనత సర్వసాధారణం. పూర్తి రక్త గణన (సీబీపీ) పరీక్ష చేయించడం వల్ల రక్తహీనత ఉందో లేదో తెలుస్తుంది. సీబీసీ పరీక్ష ఎర్ర రక్త కణాలు, తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్స్ కౌంట్ గురించి చెబుతుంది. ఇన్ఫెక్షన్లు ఏమైనా ఉన్నా సీబీపీ పరీక్ష తెలియచేస్తుంది. బాలికల్లో అలసట, బరువు తగ్గడం, జ్వరం, బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తూ ఉంటే అసలు కారణం తెలియడానికి సీబీపీ చేయించడం మంచిది.

ఐరన్ ప్రొఫైల్: ఐరన్ లోపం వల్ల రక్తహీనత వంటి వ్యాధులు వస్తాయి. శరీరం తగినన్ని ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేయనప్పుడు సాధారణంగా రక్తహీనత వస్తుంది. సరైన ఆహారం, ఐరన్ సప్లిమెంట్లు, ఐరన్ స్థాయిలను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం ద్వారా ఈ పరిస్థితిని (ఐరన్ లోపాన్ని) సమర్థంగా అధిగమించవచ్చు.

విటమిన్ ప్రొఫైల్ టెస్ట్స్: ఉత్సాహకరమైన శారీరక ఆరోగ్యానికి విటమిన్లు చాలా అవసరం. విటమిన్ ప్రొఫైల్ టెస్ట్స్ వల్ల విటమిన్ల లోపం ఏదైనా ఉంటే తెలుస్తుంది. విటమిన్ బి12 జీవ క్రియలకు అత్యంత ముఖ్యమైనది. ఆ విటమిన్ లోపం ఉంటే వైద్యుని సలహాతో దానిని పూరించే సప్లిమెంట్స్ ఇప్పించాలి. విటమిన్ డి లోపంతో ఎముకలపై ప్రభావం పడుతుంది. శరీరంలో డి విటమిన్ తగ్గకుండా ఉదయపు ఎండ తగిలేలా చూడటం, వైద్యుల సూచనతో సప్లిమెంట్స్ తీసుకోవడం చేయాలి. ఆడపిల్లలు కండరాల బలహీనత, అలసట, ఎముకల్లో నొప్పిని ఎదుర్కొంటుంటే విటమిన్ల టెస్ట్ తప్పక చేయించాలి.

మూత్ర పరీక్ష: మైక్రోస్కోప్ ద్వారా చేసే మూత్రపరీక్ష ఏవైనా ఇన్ఫెక్షన్స్ ఉంటే తెలియచేస్తుంది. బాలికల్లో పొత్తి కడుపు నొప్పి, మూత్రవిసర్జనలో ఇబ్బందులు, మూత్రంలో రక్తం, మంట వంటి లక్షణాలు కనిపిస్తే మూత్ర పరీక్ష చేయించాలి. ఒక్కోసారి యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ ఉన్నా సింప్టమ్స్ కనిపించకపోవచ్చు. అందువల్ల ఒకసారి ఈ పరీక్ష చేయించడం మంచిది.

మల పరీక్ష: ఎదిగే వయసు పిల్లలు మల విసర్జన రోజువారీ చేయకపోయినా, మల విసర్జనలో ఇబ్బంది పడుతున్నా, తరచూ విరేచనాలవుతున్నా లేదా కడుపు నొప్పితో ఇబ్బంది పడుతున్నా అదేం పెద్ద విషయం కాదన్నట్టు నిర్లక్ష్యం చేయకూడదు. మల పరీక్ష చేయించాలి. దానివల్ల జీర్ణ వ్యవస్థకు సంబంధించిన ఏవైనా ఇన్ఫెక్షన్లు ఉంటే తెలుస్తుంది.

కంటి పరీక్ష: టీనేజ్ పిల్లలకు తప్పనిసరిగా చేయించాల్సిన పరీక్ష ఇది. ఈ వయసులో హ్రస్వదృష్టి వచ్చినా, దీర్ఘదృష్టి వచ్చినా పిల్లలు దానిని గుర్తించకనే కంటికి శ్రమ ఇచ్చి రోజువారి పనులను, చదువును కొనసాగిస్తారు. కాని కంటి పరీక్ష వల్లే దృష్టిలోపం తెలుస్తుంది. ఈ వయసులో గుర్తించకుండా దృష్టి లోపం కొనసాగితే తర్వాత కాలంలో కంటి నరాలకు సంబంధించిన సమస్యలు వస్తాయి. అందుకని కంటి పరీక్ష తప్పదు.

హార్మోనల్ వర్కప్ టెస్ట్: ఆడపిల్లల్లో ఈడేరడం ఆలస్యం అవుతుంటే ఈ టెస్ట్ చేయించడం తప్పనిసరి. దీనివల్ల పాలిసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్, థైరాయిడ్ పని తీరు, అడ్రినల్ గ్రంథి పనితీరు తదితరాలు తెలుస్తాయి. దీనివల్ల యుక్తవయసుకు జాప్యం ఎందుకో తెలుస్తుంది. సరి చేయ వీలవుతుంది.

ఈ ఏడాది నా బర్త్‌డే ఏ వారం వచ్చింది?
వచ్చే ఏడాది ఏ వారం వస్తోంది?
లీప్ ఇయర్ కావడంతో ఆ క్రమంలో ఓరోజు మిస్సవుతోందా!
కంప్యూటర్ క్యాలెండర్‌లో ఎన్ని సంవత్సరాలున్నాయి?
అంతకంటే ముందు సంవత్సరాలెందుకు లేవు?
ఆ తర్వాత సంవత్సరాలు ఎందుకు చూపించడం లేదు?
క్యాలెండర్‌లో పన్నెండు నెలలే ఎందుకున్నాయి?
అచ్చం ఇలాంటి క్యాలెండర్ మళ్లీ ఎన్నేళ్లకొస్తుంది?
ఆ చిన్న బుర్రలో అన్నీ ఇలాంటి ప్రశ్నలే...

కంప్యూటర్ బుర్ర

● ఏడేళ్ల జాషువా టాలెంట్



జాషువా

జాషువా గిడియోన్ వెలిచర్లతో మాట్లాడితే క్యాలెండర్‌లను నమిలి మింగేశాడా అని ఆశ్చర్యమేస్తుంది. ఒడిలో లాప్‌టాప్‌తో ఎప్పుడూ ఇంటర్నెట్‌లో ఏదో సెర్చ్ చేస్తూనే ఉంటాడు. సాధారణంగా ఏడేళ్ల పిల్లవాడు ఏం సెర్చ్ చేస్తుంటాడు... ఏ కామిక్స్ కోసమో అనుకుంటాం. అయితే జాషువా సెర్చింగ్‌లో క్యాలెండర్‌లు శతాబ్దాల వెనక్కి వెళ్తుంటాయి. అంతే వేగంగా వందల ఏళ్ల ముందుకూ వెళ్తుంటాయి. సంవత్సరం, నెల, తేదీ రాసి చూపిస్తే మన ప్రశ్న పూర్తయ్యే లోపు ఆ రోజున ఏ వారమో చెప్పేస్తాడు. ఆ బుర్రలో ఎంత ర్యామ్ ఉందో, ప్రాసెసర్ ఎంత వేగంగా ఉందో కానీ, ప్రశ్న అడిగిన నాలుగైదు సెకన్లలోనే సమాధానం వస్తోంది. 13 నిమిషాల 55 సెకన్ల సమయంలో 113 ప్రశ్నలకు సమాధానం చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నాడు. ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు అవసరమైన పరీక్షలన్నీ పూర్తి చేశాడు. ఇప్పుడు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం వీడియోలు చేస్తున్నాడు. ఒక తేదీ చెప్పగానే అది ఏ వారమో చెప్పగలిగిన శిక్షణ ఇచ్చారా అంటే అదేమీ లేదన్నారు తల్లిదండ్రులు గిడియోన్, శాంతి. జాషువా బాలమేధావిగా మారడం వెనుక తమ కృషిని వాళ్లు సాక్షితో పంచుకున్నారు.

కరోనా బయటపెట్టింది!

''మేము బాబుని ప్రత్యేకంగా తీర్చిదిద్దాలనే ప్రయత్నం ఏదీ చేయలేదు. మేమిద్దరం సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్. బాబుని రెండవ ఏటనే ప్లే స్కూల్‌లో వేయాల్సి వచ్చింది. తను చిన్నప్పటి నుంచి చాలా యాక్టివ్, అలాగే కొన్నిసార్లు మొండిగా, పెంకిగా కూడా ఉండేవాడు. 'తనకు గమనింపు శక్తి చాలా ఎక్కువగా ఉంది, చక్కగా అర్థం చేసుకుంటాడు. కానీ మనం



చేయమన్నప్పుడు చేయడు, తనకు చేయాలనిపిస్తేనే చేస్తాడు... తెలివితేటలు బాగున్నప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరం లేద'ని స్కూల్ కరస్పాండెంట్ షాహీజాన్ మేడమ్ మాకు ధైర్యం చెప్పేవారు. అయితే కరోనా టైమ్ పూర్తిగా మార్చేస్తుందని, తనలోని మేధను వెలికి తీసి ప్రపంచానికి తెలియచేస్తుందని మేము ఊహించలేదు.

విస్తృతమైన బంధుగణం

మాది బాపట్ల జిల్లా గణపవరం. కజిన్‌లు, సమీప బంధువులు అంతా కలిసి యాభై- అరవై మంది ఉన్నారు. వాళ్లందరి పుట్టిన రోజు, పెళ్లిరోజులను గుర్తు పెట్టుకుని, అవి ఏ వారం వస్తున్నాయో చెప్తుండేవాడు. నెల మొదట్లోనే ఆ నెలలో ఎవరెవరి పుట్టినరోజులున్నాయో గుర్తు చేసేవాడు. అలా ఖాళీ సమయమంతా తేదీలు, క్యాలెండర్‌తో గడపడం అలవాటైంది. అంతకంటే ముందు మరో విషయం చెప్పాలి... తనతో హోమ్ వర్క్ చేయించడం కష్టమయ్యేది. తనకు తాను నేర్చుకుంటాడు తప్ప, మనం చెప్పి నేర్పించాలంటే దృష్టి పెట్టడు. దాంతో బాబు నేర్చుకోవాల్సిన విషయాల చార్టులను ఇంట్లో గోడలనిండా తగిలించాం. బోర్డు కూడా పెట్టాం. తాను నేర్చుకుంటూ బోర్డు మీద రాసుకుంటూ, మమ్మల్ని కూర్చోపెట్టి పాఠాలు చెప్తూ ఉండేవాడు. లీప్ ఇయర్ ఎప్పుడు వస్తుంది, ఈ ఏడాది ఏ వారంతో మొదలైందో మళ్లీ ఇలాంటి క్యాలెండర్ ఎన్నేళ్లకు వస్తుంది... వంటి తన సందేహాలకు సమాధానం కోసం ల్యాప్‌టాప్‌లో సెర్చ్ చేస్తూ నేర్చుకున్నాడు. మేము చేసినదంతా తన టాలెంట్‌ను వీడియో తీసి, తన ప్రొఫైల్‌ను రికార్డుల నిర్వాహకులకు పంపించడం మాత్రమే.

చైల్డ్ సెలబ్రిటీ

జాషువా గురించి గత ఏడాది వరకు హైదరాబాద్‌లో తాను చదువుతున్న షైనింగ్ స్కూల్, మేము నివసించే మోతీనగర్ వరకే తెలుసు. ఏడాదిగా డిజిటల్, సోషల్ మీడియాలో పాపులర్ అయ్యాడు. ఫేస్‌బుక్‌లో చాలామంది చూశారు. జాషువా వివరాలు గూగుల్‌లో లభిస్తున్నాయిప్పుడు. ట్రైన్‌లో ప్రయాణిస్తుంటే గుర్తు పట్టి మాట్లాడుతున్నారు. మా ఊరు గణపవరంలో అయితే 'జాషువా కారణంగా మన ఊరిపేరు పేపర్‌లో వచ్చిందని పెద్ద కార్యక్రమం పెట్టి సన్మానం చేశారు'' అని సంతోషాన్ని పంచుకున్నారు శాంతి, గిడియోన్. ఇక జాషువాను పెద్దయిన తర్వాత ఏం చేస్తావంటే ఐపీఎస్ అవుతానని, యూఎస్ వెళ్లి పెద్ద కోర్సులు చేస్తానని చెప్పాడు.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వర్క్ ఫ్రమ్ హోమ్

మేమిద్దరం వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉండడం, కంప్యూటర్‌తో పనిచేస్తూ ఉండడంతో తనకూ ల్యాప్‌టాప్ కావాలని అడిగాడు జాషువా. బర్త్‌డే గిఫ్ట్‌గా 2021లో ల్యాప్‌టాప్ తీసిచ్చాం. అప్పటి నుంచి బ్రౌజింగ్ అంతా తనకు మనసులో ఒక తేదీ అనుకోవడం ఆ వారం ఏదో సరి చూసుకోవడంతో మొదలుపెట్టాడు. అలా రకరకాల క్యాలెండర్‌లను తెలుసుకున్నాడు. సంవత్సరం, నెల, తేదీ చెప్తే అది ఏ వారమో చెప్పగలగడంలో తాను అనుసరిస్తున్న సమీకరణ ఏమిటనేది మాక్కూడా తెలియదు. చిన్న వయసు కావడంతో విశ్లేషించి చెప్పడం తనకూ చేతకావడం లేదు. కానీ ఏ తేదీ చెప్పినా కచ్చితంగా వారం ఏదో చెప్పేస్తాడు. ఇండియా బుక్ వాళ్లు ఇచ్చిన ఆప్షన్‌లలో రెండు వందల ఏళ్ల నిడివిని గడచిన వందేళ్లు, రాబోయే వందేళ్లు (1900- 2100) వరకు విభాగంలో వాళ్లు పెట్టిన పరీక్షలో నెగ్గి అవార్డు అందుకున్నాడు. రికార్డుకంటే ఇంకా వెనక్కి, ముందుకు కూడా చెప్పగలుగుతున్నాడు. ఒకవ్యక్తి వయసు చెప్తే ఏ సంవత్సరంలో పుట్టారో చెప్పేస్తాడు.

– శాంతి, గిడియోన్, జాషువా తల్లిదండ్రులు

'పాస్ట్'కు పోదాం చలో చలో!

పాత ఫ్యాషన్‌లు కొత్త ట్రెండ్ కావడం మనకు కొత్తకాదు. డిజిటల్ ఫొటోగ్రఫీ ఒక రేంజ్‌లో ఉన్న ఈ కాలంలోనూ యువత కాలం వెనక్కి వెళ్లి పాత కెమెరాలను పలకరిస్తోంది. ఫిల్మ్ ఫోటోగ్రఫీపై మనసు పారేసుకుంటుంది. పాత కెమెరాలు కొత్తతరం చేతుల్లోకి వస్తున్నాయి. యూట్యూబ్‌లో అనలాగ్ ఫొటోగ్రఫీ ట్యుటోరియల్స్‌కు ఆదరణ పెరుగుతోంది. పాత ఇల్‌ఫర్డ్ బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్‌లు కొత్తగా దిగుమతి అవుతున్నాయి. ఈ రీసర్జెన్స్ ధోరణి గురించి....

యూత్ ప్లస్



అపురూప దె

హైయర్ రిజల్యూషన్స్, తక్కువ వెలుతురులో కూడా బెటర్ పర్ఫార్మెన్స్, స్మార్ట్ ఫోకసింగ్, షేక్ రిడక్షన్... లేటెస్ట్ డిజిటల్ కెమెరాల గురించి గొప్పగా చెప్పుకోవడానికి ఎన్నో ఉన్నాయి. అయినప్పటికీ యువతలోని ఫొటోగ్రఫీ ప్రేమికులు కొందరు కాలం వెనక్కి వెళుతున్నారు. తాము పుట్టని కాలంలో ఉపయోగించిన కెమెరాలపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారు.

డిజిటల్ కెమెరా ఇండస్ట్రీ శిఖరస్థాయిలో ఉన్న ఈ కాలంలో పాత కెమెరాలకు ఆదరణ, అది కూడా యూత్ నుంచి అనేది ఆశ్చర్యకరమైన విషయమే.

దిల్లీలోని చాందిని చౌక్‌లో రెండు దశాబ్దాలుగా కెమెరాలను రిపేర్ చేస్తున్నాడు కపిల్ ఇంద్రజిత్ వోహ్రా. ఇతడి పేరు ఫిల్మ్–ఫొటోగ్రఫీ ప్రేమికులలో పాపులర్ అయింది. కొంతకాలం వరకు వయసు మళ్లిన వారే తమ దగ్గరకు పాత కెమెరాలను పట్టుకు వచ్చేవారు. ఇప్పుడు యూత్ ఎక్కువగా వస్తున్నారు. కెమెరాల గురించి తమ సందేహాలను అడుగుతుంటారు.

యూత్ పాత కెమెరాలను పట్టుకొని తన దగ్గరకు రావడం, వింటేజ్ కెమెరాలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం వోహ్రాకు చెప్పలేనంత ఆనందం కలిగిస్తోంది.

'ఇదొక వేవ్' అంటాడు వోహ్రా.

కొన్ని రోజుల క్రితం ఒక వ్యక్తి పాత కెమెరా పట్టుకొని వోహ్రా దగ్గరికి వచ్చాడు. 22 వేలకు కెమెరాను అమ్మాలని చెప్పాడు. కొన్ని సంవత్సరాల క్రితం ఈ మాట వింటే 'ఆశ–దోశ–అప్పడం వడ' అనే మాట కచ్చితంగా వచ్చి ఉండేది. అయితే ఇప్పుడు పాత కెమెరా కొనుగోలు విషయంలో డబ్బు గురించి చాలా మంది ఆలోచించడం లేదు.

మరోవైపు సోషల్ మీడియాలో కూడా అనలాగ్ ఫొటోగ్రఫీకి సంబంధించిన విషయాలు హల్‌చల్ చేస్తున్నాయి. యూట్యూబ్‌లో అనలాగ్ ఫొటోగ్రఫీ ట్యుటోరియల్ చానల్స్‌కు ఆదరణ లభిస్తోంది. గత రెండు మూడేళ్లుగా దేశవ్యాప్తంగా ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ పేజీలు, వాట్సప్ గ్రూప్‌లలో పాత కెమెరాలకు సంబంధించిన విషయాలు, విశేషాలు, టిప్స్ అండ్ ట్రిక్స్‌ను షేర్ చేసుకుంటున్నారు. డిజిటల్ కెమెరాలో ఆటోమేటిక్ మోడ్‌లో యాంత్రికంగా షూట్ చేయడం చాలా సులభం. అయితే సృజనాత్మక ఫొటోగ్రఫీ లోతుపాతులు తెలుసుకోడానికి పాత కెమెరాలు ఉపయోగపడుతున్నాయి.

పాతరం ఫోటోగ్రఫీపై యూఎస్, యూరప్‌లలో కొన్ని సంవత్సరాల క్రితం ఏర్పడిన ఆసక్తి ఇప్పుడు ఇండియా వరకు వచ్చింది. 'ఆసియా–పసిఫిక్‌లలో ఫిల్మ్ ఫొటోగ్రఫీలో గణనీయమైన పెరుగుదల కనిపించింది' అంటున్నాడు కొడాక్ అలారిస్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ క్లారాలో. వినియోగదారులలో 18–26 సంవత్సరాల వయసు మధ్య వారు కూడా ఉన్నారు.

'ఫిల్మ్ ఫొటోగ్రఫీపై ఆసక్తి, ఆదరణ భారీగా పెరిగాయి. అసలు సవాలు ఏమిటంటే ఫిల్మ్, కెమికల్స్ చాలామందికి అందుబాటులో లేవు. డిస్ట్రిబ్యూటర్లు లేరు' అంటున్నాడు చెన్నైకి చెందిన ఫొటోగ్రాఫర్ వరుణ్ గుప్తా. అయితే ఇప్పుడు పరిస్థితులలో మార్పు వస్తోంది. కోల్‌కతాకు చెందిన ఫొటోల్యాబ్ 'ఈస్టర్న్ ఫొటోగ్రాఫిక్స్' ఇల్‌ఫర్డ్ బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్ స్టాకును మన దేశానికి తీసుకురావడం మొదలుపెట్టింది. చెన్నైలోని 'సృష్టి డిజిటల్ లైఫ్' ఇండియాలో 'ఇల్‌ఫర్డ్' అధికారిక పంపిణీదారుగా మారింది. 'లాభాలను ఆశించి తీసుకున్న నిర్ణయం కాదు ఇది. భావోద్వేగాలతో కూడిన నిర్ణయం' అంటున్నాడు 'సృష్టి డిజిటల్ లైఫ్' డైరెక్టర్, సీఈవో ఆర్.విజయ్ కుమార్.

చివరాఖరికి చెప్పొచ్చేదేమింటంటే...

ఫోటో తీయడానికి ఇప్పటి డిజిటల్ కెమెరాలలోని మీట నొక్కితే సరిపోతుంది. మనం ఫొటోగ్రాఫర్ అయిపోయినట్లే. అయితే ఎనలాగ్ షూటింగ్‌కు ఏ మీట ఎక్కడ ఉందో మాత్రమే తెలిసుంటే చాలదు. గ్లామర్ తెలియాలి. గ్రామర్ తెలియాలి. అందుకు పాత కెమెరాలే కొత్త పాఠశాలలు.

బలమైన పునాది

ఫొటోగ్రఫీకి సంబంధించిన ప్రాథమిక శిక్షణ ఏ యూనివర్శిటీలోనూ తీసుకోలేదు. అయితే యూట్యూబ్ వీడియోల నుంచి ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ వరకు నేర్చుకునే అవకాశం ఎక్కడ ఉన్నా నేర్చుకున్నాను. ఫొటోగ్రఫీలోని అత్యాధునిక టెక్నాలజీ గురించి మాత్రమే కాదు గత కాలపు టెక్నాలజీ గురించి తెలుసుకున్నాను. గత కాలపు ఫొటోగ్రఫీ సాంకేతికత గురించి అవగాహన చేసుకోవడం అంటే బలమైన పునాది ఏర్పాటు చేసుకోవడం లాంటిది. ఫొటోగ్రఫీ అభిరుచి ఉన్న వారు చదువు, ఉద్యోగం వదులుకోకుండానే ఎంజాయ్ చేయవచ్చు. ప్యాషన్‌ను కెరీర్‌గా మలుచుకోవాలనుకుంటే మాత్రం రకరకాల సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటిని ఎదుర్కొంటూ ముందుకు వెళ్లాలి.

– అపురూప దె, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్

బ్యూటిప్స్

కురులకు కొబ్బరిపాలు

తలకు పెట్టుకోవడానికి సరిపడా కొబ్బరిపాలలో కొన్నిచుక్కల నిమ్మరసం కలపాలి. ఈ పాలను కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి గంట తరువాత మైల్డ్‌షాంపూతో తలస్నానం చేయాలి. వారానికి రెండు మూడుసార్లు కొబ్బరి పాలను



ఇలా తలకు పట్టిస్తూ ఉంటే కురులకు మంచి పోషణ అంది జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. జిడ్డుతత్వం గల కురులు ఉన్నవారికి ఈ కొబ్బరిపాలు మంచి ఫలితాన్ని ఇస్తాయి.

- ఎండబెట్టిన కమలాతొక్కలను దోరగా వేయించి మెత్తటి పొడిలా చేయాలి. దీనిలో టీస్పూను పసుపు, రెండు టీస్పూన్ల శనగపిండి, కొద్దిగా నీళ్లుపోసి కలపాలి. ఈ



మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పూతలా వేసి ఆరనివ్వాలి. ఇరవై నిమిషాల తరువాత తడిచేతులతో రుద్ది కడిగేయాలి. మృతకణాలు, ట్యాన్ తొలగిపోయి ముఖం కాంతిమంతంగా మారుతుంది. వారానికి రెండుసార్లు ఈ ప్యాక్ వేసుకుంటే ముఖం మిలమిలలాడుతుంది.
- టేబుల్ స్పూను ఉసిరి నూనె లేదా బాదం నూనె తీసుకుని కొబ్బరి నూనెలో కలిపితే చలికాలంలో కొబ్బరినూనె గడ్డకట్టదు. ఉసిరి, బాదంలోని గుణాలు నూనెని గడ్డకట్టనివ్వవు. అందువల్ల వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ కొబ్బరి నూనె గట్టిగా కాదు.



- మాయిశ్చరైజర్ లేదా లోషన్‌లో రెండు చుక్కల గ్లిజరిన్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, చేతులకు రాసుకోవాలి. ఈ మిశ్రమం చర్మానికి తేమనందించి చర్మం పొడిబారకుండా చేస్తుంది.



కిచెన్ టిప్స్

- ఉల్లిపాయ తొక్కలను పారేయకుండా శుభ్రంగా కడిగి రెండు సార్లు కడగాలి. వీటిని ఎండలో ఆరబెట్టి పొడిచేయాలి. ఆరునెలలపాటు నిల్వ ఉండే ఈ పొడి మసాలాలో కలుపుకుని కూరల్లో వేసుకుంటే..కూర మంచి రుచిగా ఉంటుంది.



- బాగా జిడ్డుపట్టిన నూనె డబ్బాలను ముందుగా అన్నంతో రుద్దాలి. తరువాత ఉప్పు, డిష్ వాష్ లిక్విడ్‌తో రుద్ది కడిగితే జిడ్డు సులభంగా వదులుతుంది.
- టూత్ పేస్టుని కొద్దిగా బ్రష్ మీద వేసి పిల్లలు గీసిన పెన్సిల్, క్రెయాన్స్ గీతలపై రుద్దితే మరకలు ఇట్టే పోతాయి.
- డ్రైఫ్రూట్స్‌ను కట్ చేయాలంటే ముందుగా వాటిని ఒక గంట సేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. అలాగే తరిగే చాకును వేడినీటిలో ముంచి తీయాలి. అప్పుడే సమంగా, నీట్‌గా ముక్కలు చేయడం సాధ్యమవుతుంది.
- ఉల్లిపాయలను తరిగేటప్పుడు కన్నీళ్లు రాకుండా ఉండాలంటే పొట్టు ఒలిచిన తర్వాత మధ్యలోకి కట్ చేసి నీటిలో వేసి పది నిమిషాల తర్వాత తరగాలి.
- బాదం పప్పును మరిగే నీటిలో పది నిమిషాల పాటు ఉంచి ఒలిస్తే పొట్టు సులభంగా వస్తుంది.
- మార్బుల్ రాతి మీద కూరగాయలను తరుగుతుంటే కత్తి పదును పోయి త్వరగా మొద్దుబారుతుంది. కాబట్టి చాపింగ్ బోర్డు వాడడం మంచిది. మార్కెట్‌లో ఎక్కువగా ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులు అందుబాటులో ఉంటున్నాయి కాని ఉడెన్ చాపింగ్ బోర్డు వాడితే ఆరోగ్యానికి మంచిది.





అంతర్జాతీయ వుషు 'ఉత్తమ క్రీడాకారిణి'గా రోషిబినా దేవి

భారత సీనియర్ వుషు క్రీడాకారిణి నరోమ్ రోషిబినా దేవికి అరుదైన గౌరవం లభించింది. 2023 సంవత్సరానికి ఈ మణిపూర్ అమ్మాయి 'సాండా' కేటగిరీలో 'అంతర్జాతీయ ఉత్తమ క్రీడాకారిణి' పురస్కారం గెల్చుకుంది. పబ్లిక్ ఓటింగ్‌లో రోషిబినాకు అత్యధికంగా 93,545 ఓట్లు లభించాయని అంతర్జాతీయ వుషు సమాఖ్య తెలిపింది. 2023 జాతీయ క్రీడా పురస్కారాల్లో 'అర్జున' అవార్డు గెల్చుకున్న 23 ఏళ్ల రోషిబినా 2018 ఆసియా క్రీడల్లో కాంస్యం, 2022 ఆసియా క్రీడల్లో రజతం సాధించింది.



మెయిన్ 'డ్రా'కు కిరణ్ జార్జి అర్హత

ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ కిరణ్ జార్జి మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. జకార్తాలో జరుగుతున్న ఈ టోర్నీలో మంగళవారం జరిగిన రెండు క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లోనూ ప్రపంచ 36వ ర్యాంకర్ కిరణ్ జార్జి గెలుపొందాడు. కేరళకు చెందిన 23 ఏళ్ల కిరణ్ తొలి రౌండ్‌లో 12-21, 21-18, 22-20తో లానియర్ (ఫ్రాన్స్)పై, రెండో రౌండ్‌లో 21-17, 12-21, 21-15తో రుస్తావిటో (ఇండోనేసియా)పై నెగ్గాడు.

మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో భారత్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ ఒక స్థానం మెరుగుపర్చుకొని 95,861 పాయింట్లతో టాప్ ర్యాంక్‌కు ఎగబాకింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్... మహారాష్ట్ర ప్లేయర్ చిరాగ్ శెట్టి ఈ ఏడాది జరిగిన రెండు ప్రధాన టోర్నీల్లోనూ (మలేసియా ఓపెన్-1000, ఇండియా ఓపెన్-750) అద్భుత ప్రతిభ కనబరిచి రన్నరప్‌గా నిలిచారు. గత ఏడాది అక్టోబర్‌లో ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించాక సాత్విక్-చిరాగ్ తొలిసారి వరల్డ్ నంబర్‌వన్‌గా అవతరించింది. పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో ప్రణయ్ ఒక స్థానం పురోగతి సాధించి ఎనిమిదో ర్యాంక్‌లో నిలిచాడు.

ఓటమితోనే ముగింపు



దోహా: ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత పురుషుల జట్టు లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టింది. గ్రూప్ 'బి'లో భాగంగా సిరియాతో జరిగి న చివరిదైన మూడో లీగ్ మ్యాచ్‌లో సునీల్ ఛెత్రి నాయకత్వంలోని టీమిండియా 0-1 గోల్ తేడాతో ఓడిపోయింది. సిరియా తరఫున ఆట 76వ నిమిషంలో ఒమర్ ఖిరిబిన్ ఏకైక గోల్ చేసి తమ జట్టును గెలిపించాడు. ఈ టోర్నీలో భారత జట్టు ఒక్క గోల్ కూడా చేయకుండానే, ఒక్క విజయం కూడా లేకుండా నిష్క్రమించింది. తొలి మ్యాచ్‌లో భారత్ 0-2తో ఆస్ట్రేలియా చేతిలో, రెండో మ్యాచ్‌లో 0-3తో ఉజ్బెకిస్తాన్ చేతిలో పరాజయం పాలైంది. ఏడు పాయింట్లతో ఆస్ట్రేలియా, ఐదు పాయింట్లతో ఉజ్బెకిస్తాన్ ఈ గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించాయి.

ఎదురులేని జొకోవిచ్



ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 11వసారి సెమీఫైనల్లోకి

క్వార్టర్ ఫైనల్లో ఫ్రిట్జ్‌పై విజయం

మెల్‌బోర్న్: తనకెంతో కలిసొచ్చిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా) తన జోరు కొనసాగిస్తూ 11వసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ 7-6 (7/3), 4-6, 6-2, 6-3తో 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)పై గెలుపొందాడు. 3 గంటల 45 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 20 ఏస్‌లతో హడలెత్తించాడు. 52 విన్నర్స్ కొట్టిన ఈ సెర్బియా స్టార్ నెట్ వద్దకు 20 సార్లు దూసుకొచ్చి 13సార్లు పాయింట్లు గెలిచాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయిన జొకోవిచ్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. 36 ఏళ్ల జొకోవిచ్ ఈ టోర్నీలో గతంలో సెమీఫైనల్ చేరిన 10 సార్లూ విజేతగా తిరిగి రావడం విశేషం. మరో క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ) తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. క్వార్టర్ ఫైనల్లో సినెర్ 6-4, 7-6 (7/5), 6-3తో ఐదో సీడ్ రుబ్లెవ్ (రష్యా)ను ఓడించి సెమీఫైనల్లో జొకోవిచ్‌తో పోరుకు సిద్ధమయ్యాడు. ఈ టోర్నీలో సినెర్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. సెమీఫైనల్ చేరుకునే క్రమంలో సినెర్ ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం విశేషం.

సూపర్ సబలెంకా...





కోకో గాఫ్

మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, రెండో సీడ్ సబలెంకా (బెలారస్), నాలుగో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) సెమీఫైనల్లోకి అడుగు పెట్టారు. క్వార్టర్ ఫైనల్లో సబలెంకా 6-2, 6-3తో తొమ్మిదో సీడ్ క్రిచికోవా (చెక్ రిపబ్లిక్)పై, కోకో గాఫ్ 7-6 (8/6), 6-7 (3/7), 6-2తో మార్టా కొస్టుక్ (ఉక్రెయిన్)పై విజయం సాధించారు. క్రిచికోవాతో 71 నిమిషాల్లో ముగిసిన మ్యాచ్‌లో సబలెంకా నాలుగు ఏస్‌లు సంధించడంతో పాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది.

రవిశాస్త్రికి జీవిత సాఫల్య పురస్కారం

ఒకేసారి నాలుగేళ్ల వార్షిక అవార్డులను అందజేసిన బీసీసీఐ





గిల్

బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రవిశాస్త్రి

సాక్షి, హైదరాబాద్: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మాజీ కెప్టెన్, మాజీ హెడ్ కోచ్ రవి శాస్త్రికి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేసింది. 1983లో భారత్ నెగ్గిన తొలి వన్డే ప్రపంచకప్ విజేత సభ్యుడైన రవిశాస్త్రి అంతర్జాతీయ కెరీర్ అనంతరం టీవీ వ్యాఖ్యతగా బుల్లితెర ప్రేక్షకుల్ని అలరించారు. తదనంతరం భారత పురుషుల టీమ్ డైరెక్టర్‌గా, హెడ్ కోచ్‌గా విజయవంతమయ్యారు. టెస్టులు, వన్డేలు, టి20ల్లో జట్టును మరో దశకు తీసుకెళ్లారు. ఓ ఆటగాడిగా, కోచ్‌గా రవిశాస్త్రి దేశానికి చేసిన సేవల్ని గుర్తించిన బీసీసీఐ 2019-20 సీజన్‌కుగాను 'సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' (జీవిత సాఫల్య) అవార్డుతో సత్కరించింది. ఆయనతో పాటు ఫరూఖ్ ఇంజినీర్‌కు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేసింది. పురుషుల విభాగంలో అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించిన ఆటగాళ్లకు ఇచ్చే 'పాలీ ఉమ్రీగర్ బెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుల్ని 2019-20 సీజన్‌కుగాను షమీ, అశ్విన్ (2020-21), జస్‌ప్రీత్ బుమ్రా (2021-22), శుబ్‌మన్ గిల్ (2022-23) అందుకున్నారు.

మహిళల కేటగిరీలో బెస్ట్ క్రికెటర్ అవార్డుల్ని దీప్తి శర్మ (2019-20, 2022-23), స్మృతి మంధాన (2020-21, 2021-22) గెలుచుకున్నారు. ఓపెనింగ్‌లో చిచ్చర పిడుగల్లే రాణిస్తున్న యశస్వి జైస్వాల్ 2022-23 సీజన్‌కు ఉత్తమ అంతర్జాతీయ అరంగేట్రం అవార్డు చేజిక్కించుకున్నాడు. ఈ విభాగంలో మయాంక్ అగర్వాల్ (2019, 20), అక్షర్ పటేల్ (2020-21), శ్రేయస్ అయ్యర్ (2021-22)లకు అవార్డులు దక్కాయి. కరోనా మహమ్మారి వల్ల 2019-20, 2020-21, 2021-22, 2022-23 సీజన్లలో బీసీసీఐ వార్షిక అవార్డులు ప్రదానం చేయలేకపోయారు. దీంతో మంగళవారం ఓ స్టార్ హోటల్‌లో నిర్వహించిన వేడుకలో నాలుగు సీజన్లకు సంబంధించిన పురుషులు, మహిళల, దేశవాళీ క్రికెటర్లకు అవార్డుల్ని ఒకేసారి ప్రదానం చేశారు.

కేఎల్ రాహుల్ బ్యాటర్‌గానే...

- హెడ్ కోచ్ ద్రవిడ్ వెల్లడి
- వికెట్ కీపర్‌గా భరత్‌కు చాన్స్!



సాక్షి, హైదరాబాద్: ఇంగ్లండ్‌తో సొంతగడ్డపై ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్‌లో కేఎల్ రాహుల్ బ్యాటర్ పాత్రే పోషిస్తాడని భారత హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ వెల్లడించాడు. దీంతో ఆంధ్ర వికెట్ కీపర్ కోన శ్రీకర్ (కేఎస్) భరత్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశముంది. రేపటి నుంచి ఉప్పల్ స్టేడియంలో జరగనున్న భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య తొలి టెస్టు నేపథ్యంలో ద్రవిడ్ మీడియాతో ముచ్చటించాడు. 'ఐదు టెస్టుల సిరీస్ కావడంతో సెలక్షన్‌పై అప్పుడే కసరత్తు చేశాం. వికెట్ కీపర్లుగా శ్రీకర్ భరత్, ధ్రువ్ జురెల్‌లను జట్టులోకి తీసుకున్నాం. కేఎల్ రాహుల్ ఈ సిరీస్ అసాంతం వికెట్ల వెనుక కీపింగ్ చేయడు. బ్యాటర్‌గానే అతన్ని బరిలోకి దించుతాం. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో రాహుల్ కీలక భూమిక పోషించడం వల్లే సిరీస్‌ను 1-1తో సమం చేసుకోగలిగాం' అని ద్రవిడ్ అన్నాడు. భారత్‌లోని స్పిన్ పిచ్‌లపై అశ్విన్, జడేజా మాయాజాలానికి స్పెషలిస్టు వికెట్ కీపర్ అవసరమవుతాడని కోచ్ వివరించాడు. రిషభ్ పంత్ రోడ్డు ప్రమాదం తర్వాత భారత సెలక్టర్ల కంటపడిన శ్రీకర్ భరత్ అవకాశమిచ్చిన టెస్టు సిరీస్‌లలో తన సత్తా చాటుకున్నాడు. ఈ నేపథ్యంలో జురెల్ కంటే భరత్‌కే ఎక్కువ అవకాశాలున్నాయి.

ఇంగ్లండ్‌కు స్పిన్ పరీక్ష

హైదరాబాద్‌లో జరిగే తొలి టెస్టులో ఇంగ్లండ్‌కు స్పిన్ పరీక్ష తప్పదు. అయితే పిచ్ స్వభావం గురించి ఒక అంచనాకు రావడం కష్టమని ద్రవిడ్ అన్నాడు. మ్యాచ్ రోజే అర్థం చేసుకోవచ్చని చెప్పాడు. వికెట్ టర్నింగ్‌పై తమకు ఏ బెంగాలేదన్నాడు. నెట్స్‌లో భారత ఆటగాళ్లంతా గంటల తరబడి శ్రమించారు. మంగళవారం ప్రాక్టీస్ తప్పనిసరేం కాకపోయినా చెమటోడ్చారు. కానీ ఒక్క బుమ్రా మాత్రం గైర్హాజరయ్యాడు.

పుణేరి, ముంబా మ్యాచ్ 'టై'

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో పుణేరి పల్టన్ తొలి 'టై' నమోదు చేసింది. యు ముంబా, పుణేరి పల్టన్ జట్ల మధ్య గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం జరిగిన మ్యాచ్ 32-32 పాయింట్లతో 'టై'గా ముగిసింది. యు ముంబా ప్లేయర్ గుమన్ సింగ్ 15 పాయింట్లు స్కోరు చేయడం విశేషం. నేడు జరిగే మ్యాచ్‌ల్లో హరియాణా స్టీలర్స్‌తో దబంగ్ ఢిల్లీ; తెలుగు టైటాన్స్‌తో తమిళ్ తలైవాస్ తలపడతాయి.

23 నుంచి డబ్ల్యూపీఎల్

న్యూఢిల్లీ: వచ్చే నెల 23 నుంచి మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్ జరుగనుంది. బెంగళూరులో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌తో రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది. సీజన్‌లోని మొత్తం 22 మ్యాచుల్ని బెంగళూరు (11 మ్యాచ్‌లు), న్యూఢిల్లీ (11 మ్యాచ్‌లు) వేదికల్లో నిర్వహిస్తారు. ఐదు ఫ్రాంచైజీల (ముంబై, బెంగళూరు, ఢిల్లీ, యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్) మధ్య ఈ లీగ్ జరుగుతుంది. మార్చి 13 వరకు లీగ్ దశ పోటీలు జరుగుతాయి. 15న ఎలిమినేటర్, 17న టైటిల్ పోరు ఢిల్లీలో నిర్వహిస్తారు.

సినిమా

'బార్బెన్‌హైమర్' పోరు ఖరారు!

96వ ఆస్కార్ అవార్డుల నామినేషన్ల ప్రకటన











గత ఏడాది బాక్సాఫీస్ దగ్గర సంచలన వసూళ్లు కురిపించిన దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ 'ఒప్పెన్‌హైమర్', దర్శకురాలు గ్రెటా గెర్విగ్ 'బార్బీ' చిత్రాలు ఆస్కార్ అవార్డ్స్‌లోనూ పోటీలో నిలిచాయి. 96వ ఆస్కార్ అవార్డులకు సంబంధించిన నామినేషన్లు మంగళవారం సాయంత్రం (భారతీయ కాలమాన ప్రకారం) వెలువడ్డాయి. 23 విభాగాల్లోని ప్రధాన విభాగాల్లో 'ఒప్పెన్‌హైమర్'కు 13 నామినేషన్లు దక్కగా, 'బార్బీ' ఎనిమిది నామినేషన్లను సొంతం చేసుకుంది. నామినేషన్ల జాబితాను నటుడు జాక్ క్వైడ్, నటి జాజీ బీట్జ్ ప్రకటించారు. ఇంకా అత్యధిక నామినేషన్లు దక్కించుకున్న చిత్రాల్లో 11 నామినేషన్లతో యోర్గోస్ లాంతిమోస్ దర్శకత్వం వహించిన 'పూర్ థింగ్స్', పది నామినేషన్లతో మార్టిన్ స్కోర్సెస్ దర్శకత్వం వహించిన 'కిల్లర్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్', ఏడు నామినేషన్లతో 'మేస్ట్రో' ఉన్నాయి. ఉత్తమ చిత్రం విభాగంలో 'ఒప్పెన్‌హైమర్', 'బార్బీ' పోటీ పడుతుండటంతో 'ఇది బార్బెన్‌హైమర్ పోరు' అని హాలీవుడ్ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, ఉత్తమ దర్శకుల విభాగంలో 'బార్బీ' దర్శకురాలు గ్రెటా గెర్విగ్‌కి నామినేషన్ దక్కుతుందనే అంచనాలు నెలకొన్న నేపథ్యంలో ఆమె నామినేట్ కాకపోవడం ఆశ్చర్యానికి గురి చేసిందని హాలీవుడ్ అంటున్న మాట. కానీ ఇదే చిత్రానికి సహాయ నటి విభాగంలో అమెరికా ఫెర్రెరాకి దక్కడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఫెర్రెరాకి నామినేషన్ దక్కుతుందనే కనీస అంచనాలు లేకపోవడమే ఈ ఆశ్చర్యానికి కారణం. అలాగే 'బార్బీ'లో టైటిల్ రోల్ చేసిన మార్గెట్ రాబీకి ఉత్తమ నటి నామినేషన్ దక్కకపోవడం ఘోరం అనే టాక్ కూడా ఉంది. ఇక దర్శకుల విభాగంలో గ్రెటా గెర్విగ్‌కి దక్కకపోయినప్పటికీ 'అనాటమీ ఆఫ్ ఎ ఫాల్' చిత్రదర్శకురాలు జస్టిన్ ట్రైట్‌కి దక్కడంతో ఈ కేటగిరీలో ఓ మహిళ ఉన్నట్లు అయింది. ఇక మార్చి 10న లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్లో (భారత కాలమానం ప్రకారం మార్చి 11) ఆస్కార్ అవార్డుల వేడుక జరగనుంది. మూడేళ్లుగా వ్యాఖ్యాతగా వ్యవహరించిన జిమ్మీ కెమ్మెల్ ఈసారి కూడా ఆ బాధ్యతను నిర్వర్తించనున్నారు. ఇదిలా ఉంటే గతేడాది 'ఆర్ఆర్ఆర్' ('నాటు నాటు...' పాటకు 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' అవార్డు), బెస్ట్ డాక్యుమెంటరీ ఫిల్మ్ విభాగంలో 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' ఆస్కార్ అవార్డు దక్కించుకుని, భారత దేశ కీర్తిని ప్రపంచానికి చాటాయి. ఈసారి దేశం నుంచి ఏ సినిమా పోటీలో లేదు. అయితే కెనడాలో స్థిరపడ్డ భారత సంతతికి చెందిన నిషా పహుజా దర్శకత్వం వహించిన కెనెడియన్ డాక్యుమెంటరీ ఫిల్మ్ 'టు కిల్ ఏ టైగర్'కి నామినేషన్ దక్కింది.



- మార్టిన్ స్కోర్సెస్



- జాన్ విలియమ్స్

ఉత్తమ చిత్రం: • అమెరికన్ ఫిక్షన్ • అటానమీ ఆఫ్ ఎ ఫాల్ • బార్బీ • ది హోల్డోవర్స్ • కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్ • మేస్ట్రో • ఒప్పెన్‌హైమర్ • పాస్ట్ లైవ్స్ • పూర్ థింగ్స్ • ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్ **ఉత్తమ దర్శకుడు:** • అటానమీ ఆఫ్ ఎ ఫాల్: జస్టిన్ ట్రైట్ • కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్: మార్టిన్ స్కోర్సెస్ • ఒప్పెన్ హైమర్: క్రిస్టోఫర్ నోలన్ • పూర్ థింగ్స్: యోర్గోస్ • ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్: జొనాథన్ గ్లేజర్ **ఉత్తమ నటుడు:** • బ్రాడ్లీ కూపర్: మేస్ట్రో • కోల్మన్ డొమింగో: రస్టిన్ • పాల్ జియామటి: ది హోల్డోవర్స్ • కిలియన్ మర్ఫీ: ఒప్పెన్ హైమర్ • జెఫ్రీ రైట్: అమెరికన్ ఫిక్షన్ **ఉత్తమ నటి:** • అన్నెతే బెనింగ్: నయాడ్ • లిల్లీ గ్లాడ్‌స్టోన్: కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్ • సాండ్రా హల్లర్: అటానమీ ఆఫ్ ఎ ఫాల్ • కెర్రీ ములిగన్: మేస్ట్రో • ఎమ్మా స్టోన్: పూర్ థింగ్స్.

★ 91 ఏళ్ల కంపోజర్ జాన్ విల్లియమ్స్ 54వ నామినేషన్ దక్కించుకున్నారు. 'ఇండియా జోన్స్ అండ్ ది డయల్ ఆఫ్ డెస్టినీ' చిత్రానికి గాను ఆయనకు నామినేషన్ దక్కింది. అత్యధిక సార్లు నామినేషన్ దక్కించుకున్న సంగీతదర్శకుడిగా ఆయన రికార్డ్ సాధించారు. ఇప్పటికే ఐదు ఆస్కార్ అవార్డులు సొంతం చేసుకున్న జాన్‌కి ఈ చిత్రం కూడా ఆస్కార్ తెచ్చి, ఆనందపరుస్తుందా అనేది చూడాలి ★ ఈ ఏడాది నామినేషన్స్ 61 ఏళ్ల జోడీ ఫాస్టర్‌ని మళ్లీ పోటీలో నిలబెట్టాయి. 29 ఏళ్ల తర్వాత 'నయాడ్' చిత్రానికి గాను ఉత్తమ సహాయ నటి విభాగంలో ఆమె నామినేషన్ దక్కించుకున్నారు. అంతకు ముందు 'నెల్' చిత్రానికిగాను 1995లో ఆమెకు నామినేషన్ దక్కింది. కాగా 'ది అక్యూస్డ్', 'ది సైలెన్స్ ఆఫ్ ది ల్యాంబ్స్' చిత్రాలకు గాను ఉత్తమ నటిగా ఆస్కార్ అవార్డులు అందుకున్నారు జోడీ. ఇప్పుడు సహాయ నటి అవార్డును ఇంటి తీసుకెళతారా చూడాలి ★ 96వ ఆస్కార్ అవార్డ్స్‌లో దర్శకుడు మార్టిన్ ఏ స్కోర్సెస్‌కి ఉత్తమ దర్శకుడిగా నామినేషన్ దక్కింది. దర్శకుడిగా పది నామినేషన్లు దక్కించుకుని, ప్రస్తుతం జీవించి ఉన్న వ్యక్తిగా ఆయన రికార్డు సొంతం చేసుకున్నారు. ఉత్తమ దర్శకునిగా స్టీవెన్ స్పీల్‌బర్గ్ తొమ్మిది నామినేషన్స్ దక్కించుకున్నారు. అయితే ఇప్పటివరకు పది సార్లు నామినేషన్ దక్కించుకున్న మార్టిన్‌కు ఒక ఆస్కార్ అవార్డు మాత్రమే దక్కింది. 2006లో వచ్చిన 'డిపార్టెడ్' సినిమాకు అవార్డు అందుకున్నారు మార్టిన్. ఇదిలా ఉంటే.. తొమ్మిదిసార్లు నామినేట్ అయినప్పటికీ రెండు సార్లు ఉత్తమ దర్శకుడిగా ఆస్కార్ అందుకున్నారు స్టీవెన్ సీల్‌బర్గ్. ఉత్తమ దర్శకుడి విభాగంలో విలియమ్ వైలర్ 12 నామినేషన్స్ దక్కించుకుని రికార్డు సొంతం చేసుకున్నారు.. అలాగే మూడు ఆస్కార్ అవార్డులు సాధించారు. అయితే ప్రస్తుతం ఆయన జీవించి లేరు.

జూన్‌లో ఎమర్జెన్సీ



- కంగనా రనౌత్

ఈ ఏడాది జూన్‌లో వెండితెరపై 'ఎమర్జెన్సీ' విధించనున్నట్లు హీరోయిన్ కంగనా రనౌత్ ప్రకటించారు. ఆమె లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. జీ స్టూడియోస్‌తో కలిసి మణికర్ణిక ఫిల్మ్స్‌పై కంగనా రనౌత్ నిర్మించిన ఈ సినిమా కొత్త విడుదల తేదీ ఖరారైంది. 2023 నవంబరు 24న ఈ చిత్రం విడుదల కావాల్సి ఉండగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది జూన్ 14న సినిమాని రిలీజ్ చేయనున్నట్లు కంగనా రనౌత్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు. ''ఇండియా చీకటి రోజుల వెనక కథని చూడండి. జూన్ 14న 'ఎమర్జెన్సీ' సినిమా విడుదలవుతుంది. చరిత్ర మరోసారి కళ్ల ముందుకు రానుంది' అని ఎక్స్‌లో (ట్విట్టర్) పోస్ట్ చేశారు కంగనా రనౌత్. 'ఎమర్జెన్సీ' చిత్రంలో ఇందిరా గాంధీ పాత్రలో కంగనా కనిపించనున్నారు. 1975లో ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఎమర్జెన్సీ టైమ్‌లో జరిగిన ఘటనలతో ఈ మూవీ రూపొందింది.

అత్తారింట్లో ఆంక్షలు లేవు

- లావణ్యా త్రిపాఠి



''వరుణ్ తేజ్‌తో పెళ్లి తర్వాత పాత్రల ఎంపిక విషయంలో వరుణ్, కుటుంబ సభ్యులు నాకు ఎలాంటి షరతులు, ఆంక్షలు విధించలేదు. కెరీర్ విషయంలో అత్తారింట్లో నాకు ఫుల్ సపోర్ట్ ఉంది. మంచి కథ కుదిరితే వరుణ్‌తో నటించడానికి సిద్ధం'' అని లావణ్యా త్రిపాఠి అన్నారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకత్వంలో లావణ్యా త్రిపాఠి, అభిజీత్ దుద్దాల, అభిజ్ఞ ఉతలూరు కీలక పాత్రల్లో 'మిస్ పర్ఫెక్ట్' అనే వెబ్ సిరీస్ రూపొందింది. అన్నపూర్ణ స్టూడియోస్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మించిన ఈ సిరీస్ ఫిబ్రవరి 2 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సిరీస్ ట్రైలర్ రిలీజ్ వేడుకలో లావణ్యా త్రిపాఠి మాట్లాడుతూ– ''మిస్ పర్ఫెక్ట్' సిరీస్ స్టార్ట్ చేసినప్పుడు నేను మిస్ పర్ఫెక్ట్.. సిరీస్ పూర్తయ్యేలోపు మిసెస్ పర్ఫెక్ట్ అయ్యాను. టైటిల్‌కు తగినట్లే 'మిస్ పర్ఫెక్ట్' బాగుంటుంది. మెగా కోడలు అనే ట్యాగ్ నటిగా మరింత బాధ్యత పెంచింది.. ఈ పిలుపుని ప్రత్యేకంగా భావిస్తున్నాను'' అన్నారు. ''కొత్త ప్రతిభని ప్రోత్సహించడం కోసమే నాగేశ్వరరావు, నాగార్జునగార్లు అన్నపూర్ణ సంస్థ స్థాపించారు. 'మిస్ పర్ఫెక్ట్'తో మేమూ అదే ప్రయత్నం చేశాం'' అన్నారు సుప్రియ యార్లగడ్డ.

అందుకు ధైర్యం కావాలి


- యండమూరి వీరేంద్రనాథ్



- యండమూరి వీరేంద్రనాథ్, దీపక్

''సిద్ధార్థ్ రాయ్' లాంటి సినిమా ఏ భాషలోనూ రాలేదు. ప్రతి మనిషిలో రెండు సంఘర్షణలుంటాయి.. ఇలాంటి కాన్సెప్ట్‌తో సినిమా తీయాలంటే చాలా ధైర్యం కావాలి. ఈ సినిమా విజయం సాధిస్తుంది'' అని ప్రముఖ రచయిత, దర్శకుడు యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. బాలనటుడు దీపక్ సరోజ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. తన్వీ నేగి హీరోయిన్. వి. యశస్వి దర్శకత్వంలో జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్ విడుదల వేడుకలో యండమూరి వీరేంద్రనాథ్, దర్శకులు సాయి రాజేష్, వీరశంకర్, రచయిత లక్ష్మీ భూపాల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వి. యశస్వి మాట్లాడుతూ–''సుకుమార్ గారికి మా సినిమా చూపిస్తే, ఫస్ట్ హాఫ్ అవగానే.. 'సినిమా అదిరింది.. నీ తర్వాతి చిత్రం నా బ్యానర్‌లో చేయాలి'' అన్నారు.

నాలుగు కథలతో...



- శ్రీనివాస్ రెడ్డి, సాయికుమార్

సాయి కుమార్, శ్రీనివాస్ రెడ్డి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'మూడో కన్ను'. 'ప్లాన్ బి' మూవీ డైరెక్టర్ కేవీ రాజమహి, సునీతా రాజేందర్ దేవులపల్లి నిర్మించిన ఆంథాలజీ చిత్రం ఇది. నాలుగు కథలతో రూపొందిన ఈ చిత్రానికి సూరత్ రాంబాబు, కె.బ్రహ్మయ్య ఆచార్య, కృష్ణమోహన్, మావిటి సాయి సురేంద్రబాబు దర్శకత్వం వహించారు. అమెరికాలో జరిగిన వాస్తవ ఘటన ఆధారంగా రూపొందిన 'మూడో కన్ను' ట్రైలర్‌ని నటుడు శ్రీకాంత్ విడుదల చేసి, ఈ చిన్న సినిమా పెద్ద సక్సెస్ సాధించాలన్నారు. ''ఈ నెల 26న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు కేవీ రాజమహి, సునీత రాజేందర్.

తండ్రీ కొడుకుల కథ



- సముద్రఖని, ధనరాజ్

హాస్య నటుడిగా ప్రేక్షకుల్లో గుర్తింపు పొందిన ధనరాజ్ కొరనాని తొలిసారి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రామం రాఘవం'. సముద్ర ఖని, ధనరాజ్ కొరనాని తండ్రీ కొడుకులుగా నటిస్తున్నారు. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో పృథ్వీ పోలవరపు నిర్మిస్తున్నారు. ''తండ్రీ కొడుకుల కథతో రూపొందుతోన్న చిత్రం 'రామం రాఘవం'. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో సినిమా విడుదల చేస్తాం'' అన్నారు ధనరాజ్.

ఇది కనులు కల గన సాధ్యమా...



- హెబ్బా పటేల్, చైతన్యా రావు

'నిజమా.. ఇది కనులు కల గన సాధ్యమా..' అంటూ ప్రేమ పాట పాడుకున్నారు చైతన్యా రావు, హెబ్బా పటేల్. ఈ ఇద్దరూ జంటగా నటించిన 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' చిత్రంలోని పాట ఇది. ఎన్ఆర్ఐ ఎంటర్టైన్మెంట్స్ (యుఎస్ఎ) సమర్పణలో న్యూ రీల్ ఇండియా ఎంటర్టైన్మెంట్స్‌పై కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. బాల రాజశేఖరుని దర్శకుడు. ఈ చిత్ర సంగీత దర్శకుడు కల్యాణీ మాలిక్ స్వరపరచి, సునీతతో కలిసి పాడినన 'నిజమా...' పాటను దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''నిజమా..' పాట చాలా మెలోడియస్‌గా ఉంది. లొకేషన్స్ బాగున్నాయి. కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రం మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''రామ్‌గోపాల్ వర్మగారితో 'బ్యూటీ ఆఫ్ ప్యాషన్, ఆట' అనే రెండు హాలీవుడ్ చిత్రాలకు పనిచేశాను. నేను దర్శకుడు కావడానికి 'శివ' చిత్రం స్ఫూర్తి. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం'' అన్నారు బాల రాజశేఖరుని.

సాక్షి బిజినెస్
బుధవారం
24-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
1,053	330
70,371	21,242

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	15,363	△ 2
డోజోన్స్	37,836	▽ 166
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,486	▽ 2
డాక్స్	16,627	▽ 56
షాంఘై	2,771	△ 15
నికాయ్	36,517	▽ 29

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,355
బంగారం (99.5 స్వచ్ఛత)	62,105
వెండి (కేజీ)	70,311

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.73	83.75
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.63	107.21
€	యూరో	ఒకటి	89.49	91.85
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.58	56.84
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.92	55.85
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.19	62.63
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.22	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.74	23.54
¥	చైనా యువాన్	పదింటికి	10.48	12.55

బంగారం, వెండి విడిభాగాలపై 5% సెస్

15 శాతానికి దిగుమతి సుంకం



న్యూఢిల్లీ: బంగారం, వెండి ఆభరణాల విడిభాగాలు, నాణేలపై 5 శాతం కేంద్రం వ్యవసాయ మౌలిక అభివృద్ధి సెస్‌ను (ఏఐడీసీ) విధించింది. దీనితో వీటికి సంబంధించి దిగుమతి సుంకం మొత్తంగా 15 శాతానికి పెరిగింది. హుక్, క్లాస్ప్, క్లాంప్, పిన్, క్యాచ్ లేదా స్క్రూ బ్యాక్ వంటి చిన్న భాగాలు తాజా సెస్ పరిధిలోకి వస్తాయి. ఆభరణాల భాగాలను కలపడానికి వీటిని వినియోగిస్తారు. తాజా సుంకం జనవరి 22 నుంచి అమల్లోకి వస్తుంది. కాగా, విలువైన లోహాలతో కూడిన మెత్తని రజనుపై కూడా ఏఐడీసీని 4.35 శాతం విధించినట్లు పరోక్ష పన్నులు, కస్టమ్స్ సెంట్రల్ బోర్డ్ (సీబీఐసీ)నోటిఫికేషన్ తెలిపింది. విలువైన లోహాలపై దిగుమతి సుంకాన్ని బులియన్‌తో సమానంగా తీసుకురావాలనే లక్ష్యంతో 10 శాతం ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీకి అదనంగా ఏఐడీసీని విధించడం జరిగింది. వ్యవసాయ మౌలిక సదుపాయాలకు నిధులు సమకూర్చడానికి ప్రభుత్వం కొన్ని వస్తువులపై 2021–22 వార్షిక బడ్జెట్ ఏఐడీసీని ప్రవేశపెట్టింది.

రెనో డస్టర్ మళ్లీ వస్తోంది

రెనో ఇండియా సీఈవో వెంకట్రామ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీలో ఉన్న ఫ్రెంచ్ సంస్థ రెనో.. భారత మార్కెట్లో కాంపాక్ట్ ఎస్‌యూవీ డస్టర్‌ను తిరిగి ప్రవేశపెడుతోంది. వచ్చే ఏడాదికల్లా ఇక్కడి రోడ్లపై పరుగుతీసే అవకాశం ఉంది. 2012లో భారత్‌లో డస్టర్ అడుగుపెట్టింది. రెనో ఇండియా ఈ మోడల్ తయారీని 2022లో నిలిపివేసింది. డస్టర్ పేరుతోనే రీఎంట్రీ ఇస్తుందని రెనో ఇండియా సీఈవో, ఎండీ వెంకట్రామ్ మామిల్లపల్లె వెల్లడించారు. కైగర్, ట్రైబర్, క్విడ్ ఫేస్ లిఫ్ట్ మోడళ్లను హైదరాబాద్ మార్కెట్లో విడుదల చేసిన సందర్భంగా మంగళవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. 2024లో 20 శాతం వృద్ధిని ఆశిస్తున్నట్టు చెప్పారు. ఎప్పటికప్పుడు భద్రతా ఫీచర్లను జోడిస్తూ ఏ, ఏ ప్లస్ ప్యాసింజర్ కార్ల విభాగంలో పోటీపడతామని అన్నారు. కార్ల ధరలను పెంచలేదని, 2024 కోసం కొత్త శ్రేణిని ప్రవేశపెట్టామని గుర్తు చేశారు.

మూడేళ్లలో అయిదు కొత్త మోడళ్లు..

వచ్చే మూడేళ్లలో భారత విపణిలో రెనో అయిదు కొత్త మోడళ్లను ప్రవేశపెట్టనుంది. వీటిలో రెండు బ్రాండ్ న్యూ ఎస్‌యూవీలు, ఒకటి ఎలక్ట్రిక్ వెహికిల్ ఉండనుంది. రెండు బ్యాటరీ ప్యాక్‌లలో ఎలక్ట్రిక్ కారును తీసుకొస్తామని వెంట్రామ్ వెల్లడించారు. 'ఒకసారి చార్జింగ్‌తో గరిష్ఠంగా 320 కిలోమీటర్ల వరకు ఇది ప్రయాణిస్తుంది. భారత్ కోసం ఈవీని రూపొందిస్తున్నాం. రానున్న రోజుల్లో ఇతర మార్కెట్లకు ఈవీలను ఎగుమతి చేస్తాం. లిథియం నిల్వలు భారత్ చేతుల్లో ఉంటే బ్యాటరీల ధరలను నియంత్రించే ఆస్కారం ఉంటుంది. భవిష్యత్తులో మార్కెట్లో అన్ని ధరల శ్రేణిలో ఎలక్ట్రిక్ కార్లు లభిస్తాయి' అని వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-1-2024	
విశాఖ	565–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	558–00
విజయవాడ	558–00
రిటైల్ ధర (డజను)	72.00
23-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

8.50 లక్షల కోట్ల సంపద ఆవిరి



దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల వెల్లువ

- అధిక వెయిటేజీ షేర్ల పతన ప్రభావం
- సెన్సెక్స్ 1,053 పాయింట్లు క్రాష్
- నిఫ్టీ నష్టం 330 పాయింట్లు
- ఫార్మా షేర్లకు మాత్రమే లాభాలు

సెన్సెక్స్ ఒకటిన్నర శాతానికి పైగా నష్టపోవడంతో బీఎస్‌ఈలో రూ.8.50 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.365 లక్షల కోట్లకు దిగివచ్చింది.

ముంబై: దలాల్ స్ట్రీట్‌లో మంగళవారం అమ్మకాల మోత మోగింది. అధిక వెయిటేజీ షేర్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(3%), రిలయన్స్ ఇండస్ట్రీస్(2%), ఎస్‌బీఐ(4%) షేర్లు పతనంతో పాటు పశ్చిమాసియాలోని యుద్ధ ఉద్రిక్తతలు ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. ఇటీవల విడుదలైన కార్పొరేట్ క్యూ3 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడమూ సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచింది. విదేశీ ఇన్వెస్టర్లు వరుస విక్రయాలు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. గడిచిన 3 నెలల్లో భారీగా ర్యాలీ చేసిన చిన్న, మధ్య తరహా షేర్లలో లాభాల స్వీకరణ జరిగింది. ఫలితంగా బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌క్యాప్ 3శాతం చొప్పున నష్టపోయాయి.

పెరిగి పడిన మార్కెట్...

మూడు రోజుల వరుస సెలవుల తర్వాత తెరుచుకున్న మార్కెట్ లాభాలతో మొదలైంది. సెన్సెక్స్ 444 పాయింట్లు పెరిగి 71,868 వద్ద, నిఫ్టీ 145 పాయింట్లు బలపడి 21,717 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. కానీ, కాసేపటికే అమ్మకాల ఒత్తిడి మొదలైంది. ఒక దశలో సెన్సెక్స్ 1,189 పాయింట్లు క్షీణించి 70,235 వద్ద, నిఫ్టీ 397 పాయింట్లు దిగివచ్చి 21,193 వద్ద ఇంట్రాడే కనిష్టాలను దిగివచ్చాయి. చివరికి సెన్సెక్స్ 1,053 పాయింట్లు నష్టపోయి 70,371 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 330 పతనమై 21,242 వద్ద స్థిరపడ్డాయి. జనవరి 17 తర్వాత సూచీలకు ఇది భారీ పతనం.

ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లూ డీలా...!

అమ్మకాల సునామీతో ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లు ఎరుపెక్కాయి. రంగాల వారీగా ఎన్ఎస్ఈలో మీడియా 13%, రియల్టీ 5%, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంకు 4%, మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్ 3%, బ్యాంక్ నిఫ్టీ 2%, ప్రైవేట్ రంగ బ్యాంక్ 2%, ఎఫ్ఎంసీజీ, ఆటో ఇండెక్సులు ఒకటిన్నర శాతం నష్టపోయాయి. ఫార్మా సూచీ మాత్రమే 1.5% రాణించింది.



- నష్టాల ట్రేడింగ్‌లోనూ మెడి అసిస్ట్ హెల్త్‌కేర్ లిస్టింగ్ సక్సెస్ అయ్యింది. ఇష్యూ ధర(రూ.418)తో పోలిస్తే బీఎస్ఈలో 11.24% ప్రీమియంతో రూ.465 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో 22% ఎగసి రూ.510 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 11% లాభపడి దాదాపు లిస్టింగ్ ధర రూ.464 వద్ద ముగిసింది. మార్కెట్ విలువ రూ.3,197 కోట్లుగా నమోదైంది.
- ఆర్థిక ఫలితాల ప్రకటన తర్వాత సిప్లా షేరు రాణించింది. డిసెంబర్ క్వార్టర్‌లో నికర లాభం 32% వృద్ధి చెందినట్లు వెల్లడించడం కలిసి వచ్చింది. బీఎస్ఈలో ఈ షేరు 7% పెరిగి రూ.1,409 వద్ద ముగిసింది.



- సోనీ గ్రూప్ 10 బిలియన్ డాలర్ల విలీన ఒప్పందం రద్దుతో జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ షేరు కుప్పకూలింది. బీఎస్ఈలో 10% నష్టంతో రూ.209 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ఇంట్రాడేలో ఏకంగా 34% పతనమై రూ.152 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది. చివరికి 33% నష్టంతో రూ.156 వద్ద స్థిరపడింది. ఒక దశలో షేరు ఇరు ఎక్స్ఛేంజీలో లోయర్ సర్క్యూట్‌ను తాకింది. షేరు భారీ క్షీణతతో కంపెనీకి రూ.7,300 కోట్ల నష్టం వాటిల్లింది.



- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు పతనం ఆగడం లేదు. బీఎస్ఈలో 3.50% నష్టపోయి రూ.1428 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 3.65% పతనమై రూ.1,425 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది. ఈ క్రమంలో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.10.83 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో ఈ ప్రైవేట్ రంగ బ్యాంకు వరుస అయిదు రోజుల్లో 13% క్షీణించింది.

'నవరత్న' ఆర్ఈసీ లాభం అప్

క్యూ3లో రూ. 3,308 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం నవరత్న ఆర్ఈసీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 13 శాతంపైగా బలపడి రూ. 3,308 కోట్లను అధిగమించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,915 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,795 కోట్ల నుంచి రూ. 12,071 కోట్లకు ఎగసింది. ప్రాజెక్టుకు ప్రత్యేకించిన ప్రత్యేక సంస్థ(ఎస్‌పీవీ) ఏర్పాటుకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ పేర్కొంది. సొంత అనుబంధ సంస్థ ఆర్ఈసీ పవర్ డెవలప్‌మెంట్ అండ్ కన్సల్టెన్సీ లిమిటెడ్‌కు పూర్తి అనుబంధంగా ఇది ఏర్పాటుకానున్నట్లు ఆర్ఈసీ వెల్లడించింది. దేశీయంగా విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు టారిఫ్ ఆధారిత పోటీ బిడ్డింగ్‌ను చేపట్టే నోడల్ ఏజెన్సీగా ఆర్ఈసీ పవర్ డెవలప్‌మెంట్ వ్యవహరిస్తోంది. ఈ ఆరు విద్యుత్ ప్రసార ప్రాజెక్టులలో ధూలే, బీదార్, శికర్ ఖేత్రి, పచోరా, కరేరా, ఇషానగర్ ఉన్నాయి.

మార్కెట్ల పతనం నేపథ్యంలో ఆర్ఈసీ షేరు బీఎస్ఈలో 5.6% పతనమై రూ. 434 వద్ద ముగిసింది.

యాక్సిస్ లాభం జూమ్

క్యూ3లో రూ. 6,492 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతం పుంజుకుని రూ. 6,492 కోట్లకు చేరింది. స్టాండెలోన్ లాభం సైతం 4 శాతం వృద్ధితో రూ. 6,071 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 5,853 కోట్లు ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం 9 శాతం వృద్ధితో రూ. 18,087 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయం 22 శాతం జంప్‌చేసి రూ. 5,555 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్లు 4.26 శాతం నుంచి 4.01 శాతానికి స్వల్పంగా తగ్గాయి. వెరసి మొత్తం ప్రొవిజన్లు రూ. 1,438 కోట్ల నుంచి తగ్గి రూ. 1,028 కోట్లకు పరిమితమయ్యాయి. ప్రస్తుత సమీక్షా కాలంలో యాక్సిస్ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.73% నుంచి 1.58 శాతానికి మెరుగుపడ్డాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 17.6 % నుంచి 14.88 శాతానికి తగ్గింది.

మార్కెట్ల పతనం నేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 3 శాతం క్షీణించి రూ. 1,089 వద్ద ముగిసింది.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

డా.వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీలో 20 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు

విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 20
» **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2024 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.25,220 నుంచి రూ.80,910
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ ఎగ్జామ్, మెయిన్ ఎగ్జామ్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తు ఫీజు చెల్లింపుకు చివరితేది:** 31.01.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.02.2024
» **వెబ్‌సైట్:** drysruhs.edu.in

సీఆర్‌పీఎఫ్‌లో 169 కానిస్టేబుల్ పోస్టులు

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్).. స్పోర్ట్స్ కోటా కింద గ్రూప్ సి విభాగంలో కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ) నాన్–గెజిటెడ్ అండ్ నాన్ మినిస్టీరియల్ ఖాళీల భర్తీకి పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులు భారతదేశం, విదేశాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 169
» **క్రీడలు:** జిమ్నాస్టిక్, జూడో, వుషు, షూటింగ్, బాక్సింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ, రెజ్లింగ్, ఫ్రీ స్టైల్, గ్రీకో రోమన్, తైక్వాండో, వాటర్ స్పోర్ట్స్ కయాక్, కానో, రోయింగ్, బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, ట్రయత్లాన్, డైవింగ్, డైవింగ్ ఈక్వెస్ట్రియన్, యాచింగ్, ఐస్ హాకీ, ఐస్ స్కేటింగ్, ఐస్ స్కైయింగ్.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. నిర్దిష్ట శారీరక దారుఢ్యంతో పాటు సంబంధిత క్రీడాంశాల్లో అర్హత సాధించి ఉండాలి.
» **వయసు:** 15.02.2024 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** రూ.21,700 నుంచి రూ.69,100.
» **ఎంపిక విధానం:** క్రీడా ప్రదర్శన, స్పోర్ట్స్ ట్రయల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.02.2024
» **వెబ్‌సైట్:** https://recruitment.crpf.gov.in

వీసా నిబంధనలు కఠినం

నేడు మన దేశ విద్యార్థుల్లో ఎక్కువ మంది లక్ష్యం.. స్టడీ అబ్రాడ్! గ్రాడ్యుయేషన్ పట్టా అందుకుంటూనే.. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల్లో ఉన్నత విద్య కోర్సుల్లో చేరాలని చాలా మంది కోరుకుంటున్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, టెక్నికల్, సైన్స్, మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థులు.. విదేశాల్లో ఎంఎస్ చేస్తే కెరీర్‌కు ఢోకా ఉండదని భావిస్తున్నారు. కాని కోవిడ్ అనంతరం కాలంలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగిందని భావిస్తున్న పలు దేశాలు.. స్టూడెంట్ వీసా నిబంధనలను కఠినతరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. టాప్ డెస్టినేషన్స్‌గా నిలుస్తున్న పలు దేశాల్లో తాజా వీసా నిబంధనలపై ప్రత్యేక కథనం..

» స్టూడెంట్ వీసాలపై పలు దేశాల ఆంక్షలు
» కెనడా, యూకే, ఆస్ట్రేలియాల్లో కొత్త నిబంధనలు
» అన్ని రకాల జాగ్రత్తలతోనే ప్రవేశం!

కెనడా.. చదువు భారమే!

✦ వీసా నిబంధనలు కఠినం చేసిన దేశాల జాబితాలో ప్రథమ స్థానంలో నిలుస్తోంది కెనడా. తాజా నిబంధనల ప్రకారం–కెనడాలో స్టడీ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తమ ఆర్థిక స్థోమతకు, సంసిద్ధతకు సంబంధించి చూపాల్సిన డిపాజిట్ మొత్తాన్ని భారీగా పెంచేసింది. ప్రస్తుతం పది వేల కెనడా డాలర్లుగా ఉన్న డిపాజిట్ మొత్తాన్ని 20,635 డాలర్లకు పెంచింది. దీంతో దరఖాస్తు దశలోనే విద్యార్థులపై ఆర్థికంగా రెట్టింపు భారం పడుతోంది. ట్యూషన్ ఫీజు, ప్రయాణ ఖర్చులకు ఇది అదనం. దీంతో కెనడా చదువు ఆర్థికంగా పెను భారం అనేది స్పష్టమవుతోంది. దీంతోపాటు విదేశీ విద్యార్థులకు కొత్తగా ఇవ్వబోయే స్టడీ పర్మిట్లపై రెండేళ్ల పాటు పరిమితి విధించనున్నట్లు ఆ దేశ ఇమ్మిగ్రేషన్ శాఖ ప్రకటించింది.

✦ వెరిఫికేషన్ ప్రక్రియను కూడా 2023, డిసెంబర్ 1 నుంచి కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. పోస్ట్ సెకండరీ ఎడ్యుకేషన్ స్థాయిలో గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్స్ (డిజిగ్నేటెడ్ లెర్నింగ్ ఇన్‌స్టిట్యూట్స్) ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థికి సంబంధించి లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్‌ను ఐఆర్‌సీసీకి చూపి ఆమోదం పొందాలనే నిబంధన తెచ్చారు.

✦ అంతేకాకుండా త్వరలోనే పోస్ట్ గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్ ప్రోగ్రామ్ విధానంలోనూ మార్పులు తెచ్చే దిశగా కెనడా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో.. పోస్ట్ స్టడీ వర్క్ విషయంలోనూ మన విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే ఆస్కారముంది. ప్రస్తుత విధానంలో పీజీ పూర్తి చేసుకున్న తర్వాత ఆరు నెలల పాటు కెనడాలోనే ఉండి ఉద్యోగాన్వేషణ సాగించొచ్చు. ఈ సమయంలో ఏదైనా ఉద్యోగం లభిస్తే పోస్ట్ స్టడీ వర్క్ పర్మిట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. కనిష్ఠంగా ఎనిమిది నెలలు, గరిష్ఠంగా మూడేళ్ల వ్యవధికి తొలుత పోస్ట్ స్టడీ వర్క్ పర్మిట్‌ను జారీ చేస్తారు. ఆ తర్వాత దాన్ని పొడిగించుకునే అవకాశం ఉంటుంది.

✦ స్టూడెంట్స్ సేవింగ్స్ డిపాజిట్ మొత్తాన్ని పెంచడం.. దాన్ని వెంటనే అమల్లోకి తేవడం; అదే విధంగా.. ప్రస్తుతం రెండు దేశాల మధ్య నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల ప్రభావం ఇప్పటికే మన విద్యార్థులపై కనిపిస్తోంది. 2022 డిసెంబర్‌తో పోల్చితే.. 2023 డిసెంబర్‌లో– మన దేశ విద్యార్థుల సంఖ్యలో 86 శాతం మేర తగ్గుదల నమోదవడమే ఇందుకు నిదర్శనం.

✦ కెనడాలోని యూనివర్సిటీల్లో చేరేందుకు విద్యార్థులు ముందుగా స్టూడెంట్ వీసాకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధాలుగానూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోదల్చిన విద్యార్థులు www.cic.gc.ca ద్వారా ఆ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రవేశం ఖరారు చేసుకున్నట్లు రుజువు చేసే అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్ ఆధారంగా.. స్టడీ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఈ సమయంలో నిర్దేశిత డాక్యుమెంట్లను అందించాల్సి ఉంటుంది. ఆ తర్వాత.. విద్యార్థులకు కెనడా కాన్సులేట్ అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించి.. ఈ పర్మిట్‌ను మంజూరు చేస్తారు. వీరికి ముందుగా టెంపరరీ రెసిడెంట్ వీసా ఇస్తారు.

ఆస్ట్రేలియా.. ఇంగ్లిష్‌పై పట్టుంటేనే

✦ మన దేశ విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపే దేశాల్లో ఆస్ట్రేలియా ఒకటి. 2022 గణాంకాల ప్రకారం–ఈ దేశంలో లక్ష మందికిపైగా భారతీయ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఆస్ట్రేలియా సైతం అంతర్జాతీయ విద్యార్థులకు కఠిన నిబంధనల అమలు దిశగా అడుగులు వేస్తోంది. సబ్ క్లాస్ 500 కింద స్టూడెంట్ వీసాకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఇకపై ఇంగ్లిష్ లాంగ్వేజ్ నైపుణ్యానికి సంబంధించి మరింత ప్రతిభ చూపాల్సి ఉంటుంది. ఎందుకంటే.. ఆస్ట్రేలియా ప్రభుత్వ నూతన నిబంధనల ప్రకారం– టెంపరరీ గ్రాడ్యుయేట్ వీసా పొందాలనుకుంటే.. ఐఈఎల్‌టీఎస్ 6.5 బాండ్స్ ఉండాల్సిందే. ప్రస్తుతం ఇది 6గానే ఉంది. ఇక స్టూడెంట్ వీసా దరఖాస్తుకు అవసరమైన ఐఈఎల్‌టీఎస్ స్కోర్‌ను 5.5 బ్యాండ్స్ నుంచి 6 బ్యాండ్స్‌కు పెంచింది.

✦ అంతేకాకుండా 'న్యూ జెన్యూన్ టెస్ట్' అనే కొత్త విధానాన్ని తీసుకురానుంది. ప్రస్తుతం ఉన్న 'జెన్యూన్ టెంపరరీ ఎంట్రెంట్'కు బదులు దీన్ని తీసుకురానుంది. నూతన విధానం ప్రకారం–ఆస్ట్రేలియాలో అడుగుపెట్టే విద్యార్థుల అసలు ఉద్దేశాన్ని, వారు చేరాలనుకుంటున్న కోర్సు ద్వారా వారి ఆశిస్తున్న లక్ష్యాలను పరిశీలించనున్నారు.

✦ అదే విధంగా విద్యార్థులు దరఖాస్తు సమయంలో చూపాల్సిన సేవింగ్స్ మొత్తాన్ని కూడా పెంచింది. మొత్తం 24,505 డాలర్లు తమ వద్ద ఉన్నట్లు చూపాల్సి ఉంటుంది. ఇప్పటివరకూ ఈ మొత్తం ఏడాదికి 20, 290 డాలర్లుగానే ఉంది.

✦ ఆస్ట్రేలియాలో యూజీ, పీజీ, మాస్టర్ డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు సబ్ క్లాస్ 500 వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. వీరి అడ్మిషన్ దరఖాస్తు, ఫైనాన్షియల్ ఎవిడెన్స్, ట్యూషన్ ఫీజు, యూనివర్సిటీలో ఎన్‌రోల్‌మెంట్, మెడికల్ ఎగ్జామినేషన్, వీసా లాడ్జ్‌మెంట్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వీసా మంజూరు చేస్తారు.

యూకే..డిపెండెంట్ వీసాలకు నో ఛాన్స్

✦ అంతర్జాతీయ విద్యార్థుల ప్రవేశం, వీసా మంజూరుపై ఆంక్షలు విధిస్తున్న దేశాల జాబితాలో యూకే ముందు వరుసలో నిలుస్తోంది. తాజా నిబంధనల ప్రకారం –స్టూడెంట్ వీసాతో వచ్చే విద్యార్థులు తమ కుటుంబాలను వెంట తెచ్చుకోకుండా బ్రిటన్ నిషేధం విధించింది. పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ చేస్తున్న విద్యార్థులకు మాత్రం ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు.

✦ అదేవిధంగా విద్యార్థులు తమ చదువు పూర్తయ్యేవరకు వర్క్ వీసాకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా నిబంధనలు రూపొందించారు. దీంతోపాటు పోస్ట్ స్టడీ వర్క్ విషయంలోనూ సంస్కరణలు తెచ్చేలా యూకే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రస్తుత విధానంలో చదువు పూర్తయ్యాక రెండేళ్ల వ్యవధికి పోస్ట్ స్టడీ వర్క్ వీసా మంజూరు చేస్తున్నారు.

✦ ముఖ్యంగా గ్రాడ్యుయేట్ రూట్ వీసా విధానంలో మార్పుల దిశగా యూకే ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రస్తుతం గ్రాడ్యుయేట్ రూట్ వీసా విధానం ప్రకారం–బ్యాచిలర్ డిగ్రీ, పీజీ కోర్సుల విద్యార్థులు రెండేళ్లు, పీహెచ్‌డీ విద్యార్థులు మూడేళ్లపాటు పోస్ట్ స్టడీ వర్క్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ దరఖాస్తుకు ఆమోదం లభించి గ్రాడ్యుయేట్ వీసా మంజూరైతే.. చేతిలో ఆఫర్ లెటర్ లేకపోయినా.. అక్కడే ఉండి ఉద్యోగాన్వేషణ చేయొచ్చు. ఉద్యోగం లభిస్తే గ్రాడ్యుయేట్ వీసా కాలపరిమితి ముగిశాక.. ఇతర వర్క్ వీసాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉదాహరణకు గ్రాడ్యుయేట్ వీసాతో ఉద్యోగం పొంది.. రెండేళ్లు, లేదా మూడేళ్ల వ్యవధి పూర్తయ్యాక.. స్కిల్డ్ వర్కర్ వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలా స్కిల్డ్ వర్కర్ వీసా మంజూరైతే.. సదరు అభ్యర్థులు యూకేలోనే మరింత కాలం ఉద్యోగం చేసే అవకాశం లభిస్తుంది. ఈ విధానాన్ని సమీక్షించి మార్పులు తెచ్చే అవకాశముందని యూకే అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.



✦ యూకేలో పీజీ స్థాయి కోర్సులు, గ్రాడ్యుయేట్ స్థాయి కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు టైర్–4 జనరల్ కేటగిరీ వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. అది కూడా సదరు ఇన్‌స్టిట్యూట్ అందించే కన్ఫర్మేషన్ ఆఫ్ యాక్సెప్టెన్స్ ఫర్ స్టడీస్(సీఏఎస్) ఫామ్ ఆధారంగానే చేయాల్సి ఉంటుంది.

అమెరికా.. పాస్‌పోర్ట్ ఆధారంగా వీసా

✦ మన విద్యార్థులకు తొలి గమ్యంగా నిలిచే అమెరికా కూడా వీసా మంజూరులో కొత్త నిబంధనలు తెచ్చింది. తాజా నిబంధనల ప్రకారం–పాస్‌పోర్ట్‌లో ఉన్న సమాచారాన్ని వీసా మంజూరుకు పరిగణనలోకి తీసుకోనుంది. ఇతర ఏ సమాచారాన్ని వీసా మంజూరుకు అంగీకరించరు. ఈ విధానాన్ని ఎఫ్–1, ఎం, జె స్టూడెంట్ వీసాలు పొందాలనుకునే వారికి అమలు చేయనున్నారు.

✦ అమెరికాలో ఉన్నత విద్య, వీసా కోరుకునేవారు యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్ ఇచ్చే ఐ–20 ఫామ్ (అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్) ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత దశలో ఆన్‌లైన్ విధానంలో యూఎస్ ఇమ్మిగ్రేషన్ వెబ్‌సైట్‌లోని డీఎస్–160 వీసా అప్లికేషన్‌ను పూర్తి చేయాలి. ఈ ఆన్‌లైన్ అప్లికేషన్ సమయంలో తాము ఇంటర్వ్యూకు, అదే విధంగా అప్లికేషన్ సెంటర్(వీఏసీ)కి వేర్వేరుగా రెండు తేదీల్లో అపాయింట్‌మెంట్ తీసుకోవాలి. వాటికి హాజరవదలచుకున్న కాన్సులేట్ కార్యాలయాన్ని తెలియజేయాలి. అప్లికేషన్ సెంటర్‌లో ప్రక్రియకు వెళ్లే ముందు పాస్‌పోర్ట్, డీఎస్–160 కన్ఫర్మేషన్ పేజ్, అపాయింట్ కన్ఫర్మేషన్ పేజ్‌లతో వెళ్లాలి. అప్లికేషన్ సెంటర్‌లో ఇంటర్వ్యూ విజయవంతంగా ముగించుకుంటే వీసా ఇంటర్వ్యూకు హాజరు కావాలి. ఈ ఇంటర్వ్యూ సమయంలో ఒరిజినల్ సిటిజన్‌షిప్ పాస్‌పోర్ట్, అపాయింట్‌మెంట్ లెటర్, డీఎస్–160 కన్ఫర్మేషన్ లెటర్, సెవిస్(స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ రిపోర్ట్, రిసీప్ట్ (ఐ–901), ఐ–20లను దగ్గర ఉంచుకోవాలి. విద్యార్థులు అకడమిక్ సెషన్ ప్రారంభానికి కనీసం మూడు నెలల ముందుగా వీసా మంజూరు ప్రక్రియ ముగుస్తుంది

స్టాండర్డ్ టెస్ట్ స్కోర్లే ఆధారంగా

స్టూడెంట్ వీసా కోసం విద్యార్థులు అకడమిక్ ప్రతిభతోపాటు సంబంధిత స్టాండర్డ్ టెస్ట్ స్కోర్లలో బెస్ట్ స్కోర్ కోసం ప్రయత్నం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆయా దేశాల్లోని యూనివర్సిటీల ప్రామాణికాలు, ప్రభుత్వ ఇమ్మిగ్రేషన్ నిబంధనలపై ముందుగానే అవగాహన పెంచుకుంటే.. వీసా పొందే అవకాశాలు మెరుగవుతాయని పేర్కొంటున్నారు.

ఇవి తప్పనిసరి

విదేశీ యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు నిర్దేశిత డాక్యుమెంట్లు/ సర్టిఫికెట్లను తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుంది. పాస్‌పోర్ట్, అడ్మిషన్ కన్ఫర్మేషన్ లెటర్, కోర్సు ఫీజు వ్యయం, ఆర్థిక వనరులకు సంబంధించిన రుజువులు, ఎడ్యుకేషన్ లోన్ ద్వారా అభ్యసించదలిస్తే సంబంధిత బ్యాంకు నుంచి అధీకృత రుజువులతో వీసాకు దరఖాస్తు చేసుకోవాలి.

వీసా ఇంటర్వ్యూ

వీసా మంజూరుకు నిర్వహించే ఇంటర్వ్యూ సందర్భంగా విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కోర్సు పూర్తయ్యాక స్వదేశానికి తిరిగొస్తామనే నమ్మకం కలిగించాలి. ఆ దేశంలోనే చదవాలనుకోవడానికి గల కారణాలను ఇమ్మిగ్రేషన్ అధికారులను సంతృప్తి పరిచేలా చెప్పగలగాలి. అక్కడ కోర్సు ద్వారా తాము నేర్చుకోదలిచిన నైపుణ్యాల గురించి స్పష్టత ఉండాలి.

జీరో టికెట్ @ 10 కోట్లు

45 రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించిన మహిళల సంఖ్య ఇది
- మహాలక్ష్మి పథకంలో ఇదో కీలక మైలురాయి
- విజయోత్సవం తరహా కార్యక్రమానికి ఆలోచన

సాక్షి, హైదరాబాద్: కేవలం 45 రోజుల వ్యవధిలోనే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతిని పదికోట్లమంది మహిళలు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. డిసెంబరు ఏడో తేదీన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు తీసుకోగా, అదే నెల తొమ్మిదే తేదీన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచి తంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించారు. సోనియాగాంధీ పుట్టినరోజును పురస్కరించుకుని దీన్ని ఆ రోజు ప్రారంభించినట్టు స్వయంగా సీఎం వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇది కూడా ఒకటి. రెండు కేటగిరీ బస్సుల్లో మహిళలకు జీరో టికెట్ జారీ ద్వారా, బస్సుల్లో ప్రయాణిస్తున్న వారి సంఖ్యను గుర్తిస్తున్నారు. సోమవారం నాటికి జారీ అయిన జీరో టికెట్ల సంఖ్య 10 కోట్లను దాటింది.

రూ.550 కోట్ల మేర ఆదా

పది కోట్ల జీరో టికెట్ల రూపంలో మహిళా ప్రయాణికులకు రూ.550 కోట్ల మేర ఆదా అయినట్టు తెలిసింది. అంతమేర ఆదాయం ఆర్టీసీ కోల్పోయినందున, ఆ మొత్తాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేయాల్సి ఉంది. ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు ఉండటంతో బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య సగటున నిత్యం 10 లక్షల కంటే



ఎక్కువ మేర పెరిగింది. కానీ, ఆ తాకిడిని తట్టుకునే సంఖ్యలో ఆర్టీసీ వద్ద బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న విషయం తెలిసిందే. కొత్త బస్సులు కొంటున్నామని ఆర్టీసీ చెబుతున్నా, కొన్ని నామమాత్రంగానే వచ్చాయి. ఇప్పటికిప్పుడు కనీసం 4 వేల బస్సులు అవసరమన్న అభిప్రాయాన్ని ఆర్టీసీనే వ్యక్తం చేస్తోంది. కానీ, వాటిని కొనేందుకు అవసరమైన నిధులు సంస్థ వద్ద లేనందున, ప్రభుత్వమే సాయం చేయాల్సి ఉంది. సరిపోను బస్సులు లేక జనం పడుతున్న ఇబ్బందులు ఎలా ఉన్నా, ఈ పథకం విజయవంతమైందన్న విషయాన్ని జనంలోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. విజయోత్సవం తరహాలో ఓ కార్య క్రమం నిర్వహించాలనే ఆలోచనలో ఉంది. 10 కోట్ల మంది మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించినట్టు తేలగానే కార్యక్రమం నిర్వహించాలని అనుకున్నా, అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారు. వీలైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనేలా కార్యక్రమం ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

బకాయిల చెల్లింపు ప్రకటనకు అవకాశం

దీర్ఘకాలంగా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించటం లేదు. దీనిపై కార్మికుల నుంచి ఒత్తిడి వస్తోంది. రెండు వేతన సవరణలు, అంతకుముందు వేతన సవరణ తాలూకు బాండ్ల మొత్తం బకాయి ఉంది. సీసీఎస్, పీఫ్ బకాయిలూ ఉన్నాయి. దీంతో సమ్మక్క–సారలమ్మ జాతరలోపు ఏదో ఒక బకాయి చెల్లింపుపై ప్రకటన చేయాలని ఈ భేటీలో నిర్ణయించినట్టు తెలిసింది. బాండ్ల మొత్తం, పీఎఫ్ బకాయిల చెల్లింపుపై ప్రకటన చేసే అవకాశముంది. ఉద్యోగులు వేతన సవరణపై ఒత్తిడి తెస్తున్నా, అది ఖజానాపై పెద్ద భారమే మోపేలా ఉన్నందున దాని విషయంలో ఆచితూచి నిర్ణయించాలని భావిస్తున్నారు. సీఎంతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారు.

రూ.1,040 కోట్లతో కొత్త బస్సులు

గత ప్రభుత్వ హయాంలోనే ఆర్టీసీ 1,050 బస్సులకు టెండర్లు పిలిచింది. అవి దశలవారీగా సమకూరాల్సి ఉంది. మరో వేయి ఎలక్ట్రిక్ బస్సులు కూడా రావాల్సి ఉంది. మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తున్న పల్లెవెలుగు, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల సంఖ్య వెంటనే పెంచాల్సి ఉన్న విషయాన్ని ఆర్టీసీ తాజాగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మంగళవారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భేటీ అయి బడ్జెట్ పద్దులపై చర్చించారు. ఈ సందర్భంగా 2 వేల బస్సులు కొనేందుకు రూ.1,040 కోట్లు కేటాయించాలని కోరినట్టు తెలిసింది. దీనికి భట్టివిక్రమార్క సానుకూలంగా స్పందించారు. అయితే, ఆర్టీసీ అంతర్గత ఆదాయాన్ని పెంచుకునేందుకు మరింత కసరత్తు చేయాలని, మెట్రో రైలు తరహాలో దీనిపై దృష్టి సారించాలని సూచించారు.

26 నుంచి 28 వరకు హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్

- హైటెక్ సిటీ సత్వ నాలెడ్జ్ సెంటర్‌లో మూడు రోజుల వేడుకలు
- ఈ ఏడాది నార్వే, ఒడియా భాషా సాహిత్యాలపై చర్చ

సాక్షి, హైదరాబాద్: ప్రతి ఏటా జనవరిలో నిర్వహించే హైదరాబాద్ సాహిత్య ఉత్సవాలు (హెచ్‌ఎల్‌ఎఫ్) ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. హైటెక్‌సిటీలోని సత్వ నాలెడ్జ్ సెంటర్ వేదికగా జరగనున్న ఈ సాహిత్య ఉత్సవాల్లో ఈసారి అంతర్జాతీయంగా నార్వే, జాతీయంగా ఒడియా భాషా సాహిత్యాలపై ప్రత్యేక చర్చలను నిర్వహించనున్నారు. ఈ సాహిత్య ఉత్సవాలకు నార్వే దేశానికి చెందిన సాహితీవేత్తలు, కళాకారులు, రచయితలు, ఒడిశాకు చెందిన సాహిత్య దిగ్గజాలు పాల్గొంటారు. వీరితోపాటు దేశ విదేశాలకు చెందిన సుమారు 200 మందికి పైగా రచయితలు, సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, మేధావులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరవుతారని హెచ్‌ఎల్‌ఎఫ్ నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అమీష్ త్రిపాఠీ, మణిశంకర్ అయ్యర్, గురుచరణ్ దాస్, శశి థరూర్ వంటి ప్రముఖులు కూడా హాజరుకానున్నారు. హెచ్‌ఎల్‌ఎఫ్‌లో పాల్గొనే సందర్శకులకు ఆయా రంగాలకు చెందిన ప్రముఖులతో నేరుగా సంభాషించేందుకు అవకాశం లభించనుంది. వివిధ భాషలకు చెందిన పుస్తకాలను కూడా ప్రదర్శించనున్నారు. కాగా, హెచ్‌ఎల్‌ఎఫ్ వేడుకలు నిర్వహించనున్న సత్వ నాలెడ్జ్ సెంటర్‌కు చేరుకునేందుకు రాయదుర్గం మెట్రోస్టేషన్ నుంచి ఉచితంగా షటిల్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు వాయిదా

సాక్షి, హైదరాబాద్: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసింది. పరీక్షల ముందు ఎన్నికల నిర్వహణ సరికాదంటూ వివిధ ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. దీంతో కొత్త షెడ్యూల్ వచ్చే వరకు వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 29న ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించాలని విద్యాశాఖ ఈనెల 18న షెడ్యూల్ ఇచ్చింది. దీంతో ఈనెల 20న తల్లిదండ్రుల వివరాలను నోటీసు బోర్డుపై ఉంచారు. 2019లో ఏర్పాటు చేసిన పాత కమిటీలను కొనసాగించడంపై రెండేళ్లుగా విమర్శలు వస్తున్నాయి. ఈ కమిటీలను రద్దు చేయడం, కొత్త కమిటీల ఎన్నికలను ఆపేయడంతో కొత్త సమస్యలు వచ్చే వీలుందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. పాఠశాలల నిర్వహణ కోసం నిధులు ఖర్చు చేయాలన్నా.. కమిటీల అనుమతి కావాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో చెక్ పవర్ ఎవరికి ఇస్తారనేది ప్రభుత్వం స్పష్టం చేయాల్సి ఉంటుంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.